


12వ కాంగ్రెస్ – 6వ పేజీలో

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ట్రిపుల్ ఆర్ భూ బాధితుల డిమాండ్లకు సిపిఐ మద్దతు

భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు బీమా రంగం సన్నద్ధం కావాలి

ప్రజల ప్రాణాలే ముఖ్యం

జిడిపిలో ఎంఎస్ఎంఇలు పదిశాతం వాటా సాధించాలి

03

సంపుటి 28, సంచిక: 85 | ఆదివారం | 14-09-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# వాటా సాధించాల్సిందే

● కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాపై నిపుణులు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశనం ● చుక్క నీటినీ వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టీకరణ ● 904 టిఎంసిల నీటిని సాధించేందుకు పట్టుబట్టాలని సూచన ● కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణకు స్వయంగా హాజరవుతా : మంత్రి ఉత్తమ్



ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాల్సిందేనంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయ నిపుణులకు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులకు దిశా నిర్దేశనం చేశారు. కృష్ణాలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కుడా వదులుకునే ప్రసేక్తే లేదని స్పష్టం చేశారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణ నేపథ్యంలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టిఎంసిల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. ఇంత కాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకు రావాల్సిన ప్రతీ నీటి బొట్టునూ దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్‌కు సమర్పించాలని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు 299 టిఎంసిల వాటాకు

తరువాయి 2లో



# అదానీ, అంబానీలకే... వికసిత భారత్, అమృత్ కాల్

● కార్మికులకు, సామాన్య ప్రజలకు కాదు ● కేంద్ర ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలి ● వ్యవసాయం, ఉత్పత్తి, చిన్నతరహా పారిశ్రామిక రంగాలు అతలాకుతలం ● ఎఐబిఎ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్. వెంకటాచలం ● ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దేశం మనుగడ : కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ విధానాలలో మార్పు రావలసిన అవసరముందని, అంతే తప్ప వికసిత భారత్, అమృత్ కాల్ అంటూ సామాన్య ప్రజలను ఇంకా మోసం చేయలేరని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం అన్నారు. వికసిత భారత్, అమృత్ కాల్ అంటే కేవలం అదానీ, అంబానీలకే చెల్లుతుందని, పేద ప్రజలకు కాదన్నారు. వ్యవసాయం, ఉత్పత్తిరంగాలు, చిన్నతరహా పారిశ్రామిక రంగం కుడా అతలాకుతలం అవుతున్నదని, అయినప్పటికీ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ సామాన్య ప్రజలను మభ్య పెడుతుందని విమర్శించారు. దేశంలో కార్మికవర్గానికి కనీస వేతనాలు

తరువాయి 2లో

## జనజీవన స్రవంతిలోకి సుజాత

డిజిపి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు

రూ.25 లక్షల డిడి అందజేసిన డిజిపి జితేందర్

02

## స్కూల్ మాటున అల్ప్రాజోలం తయారీ

రూ. కోటి సొత్తు స్వాధీనం, ముగ్గురి అరెస్టు











# ప్రపంచం WORLD NEWS

## ఉగ్రవాదుల కాల్పుల్లో 12 మంది పాక్ సైనికులు మృతి

**వన్నా:** పాకిస్థాన్ ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రం దక్షిణ వజిరిస్థాన్‌లో శనివారం వరకూ గడచిన మూడు రోజులుగా వివిధ ప్రాంతాలలో జరిగిన ఎదురు కాల్పుల్లో 35 మంది ఉగ్రవాదులు, మరో 12 మంది పాకిస్థాన్ సైనికులు మరణించారు.
మరణించిన ఉగ్రవాదులలో 13 మంది తెహ్రిక్ ఏ తాలిబన్ పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఫిత్నా అల్ ఖ్వారిజ్ ఉగ్రవాదులు ఉనట్లు ప్రభుత్వం తెలియజేసింది. వీరితోపాటు భారత్ ప్రేరేపిత అల్ ఖ్వారిజ్ హిందుస్థాన్ ఉగ్రవాదులు కూడా ఉన్నట్లు తెలిపింది. హోరాహోరీ కాల్పుల యుద్ధం తర్వాత బారౌజ్ ప్రాంతంలో 22 మంది భారత్ ప్రేరేపిత ఉగ్రవాదులను చంపి నరకానికి పంపించామని ప్రభుత్వం ఆ ప్రకటనలో పేర్కొంది. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల నుండి వస్తున్న ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో చాలా సంవత్సరాలుగా అలజడి సృష్టిస్తున్నారు.

# నేపాల్ పార్లమెంటు రద్దు రాజ్యాంగ విరుద్ధం

### ప్రతిపక్షాలు, బార్ అసోసియేషన్ ఆగ్రహం

### వచ్చే ఏడాది మార్చి 5న ఎన్నికలు



**ఖాట్మండు :** నేపాల్ పార్లమెంటును రద్దుచేయడాన్ని ఆ దేశ రాజకీయపార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పార్లమెంటును రద్దుచేసి, 2026 మార్చి 5వ తేదీన పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయని దేశాధ్యక్షుడు రామచంద్రపౌడెల్ ప్రకటించారు. తాత్కాలిక ప్రధానమంత్రి సిఫార్సు మేరకు ఈ తేదీని ఖరారుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని, ఈ చర్య దేశ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అనీ ప్రధాన ప్రతిపక్షం నేపాలీ కాంగ్రెస్ విమర్శించింది. ఇది ప్రజాస్వామ్యదేశానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయమని కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్‌–లెనినిస్ట్) ప్రధాన కార్యదర్శి శంకర్ పోఖారెల్ అన్నారు. పార్లమెంటు రద్దు, తిరోగామి చర్యలకు వ్యతిరేకంగా తమ నిరసనకు మద్దతు ఇవ్వాలని నేపాల్ బార్ అసోసియేషన్ పిలుపు ఇచ్చింది. పార్లమెంటు రద్దు చర్య అనేక నిశితమైన, తీవ్ర ప్రశ్నలను దేశం ముందుకు తెచ్చిందని నేపాలీ కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి బిశ్వాస్ ప్రకాశ్ శర్మ అన్నారు. ''పార్లమెంటు రద్దు నేపాలీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం, సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులకు, మార్గదర్శకాలకు విరుద్ధం, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం'' అని విమర్శించారు. నేపాలీ కాంగ్రెస్ కేంద్ర కార్యవర్గ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ప్రజలు సాధించుకున్న ప్రజాస్వామ్య విజయాలకు అధ్యక్షుడు తీవ్ర హాని తలపెట్టారని కార్యవర్గ కమిటీ విమర్శించింది.

''గతంలో అనేక మెజారిటీ ప్రభుత్వాలు పార్లమెంటు రద్దు ప్రయత్నాల చర్యను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొని సవాలు చేశాయి, కానీ అవే పార్టీలు ఇప్పుడు పార్లమెంటు రద్దుకు గళం కలిపి మద్దతు ఇస్తున్నాయి, ఇదెంతో హాస్యాస్పదమైన విషయం, మేం మాత్రం ప్రజాస్వామ్యరక్షణకోసం అప్రమత్తంగా వ్యవహరిస్తాం'' అని శంకర్ పోఖారెల్ స్పష్టం చేశారు. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్) పార్టీ కూడా దేశాధ్యక్షుడి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ పార్టీ ఉపాధ్యక్షుడు, అధికార ప్రతినిధి అగ్ని ప్రసాద్ సప్కోటా మాట్లాడుతూ దేశాధ్యక్షుడి నిర్ణయం రాజ్యాంగ విరుద్ధ చర్య అన్నారు. నేపాల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయ్ ప్రసాద్ మిశ్ర, కేదార్ ప్రసాద్ కొయిరాలా ఒక సంయుక్త ప్రకటన చేస్తూ, రాజ్యాంగ ఆధిపత్యాన్ని అణగదొక్కి, పార్లమెంటును రద్దుచేయడం ద్వారా మౌలికమైన రాజ్యాంగ విలువలపై దాడి చేశారని విమర్శించారు. ఎన్నో ఉద్యమాలు చేసి, ఎంతో శ్రమకోర్చి సంపాదించుకున్న ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థను కూలదోశారని విమర్శించారు. దేశాధ్యక్షుడు తీసుకున్న నిర్ణయం సుప్రీంకోర్టు తొలుత ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకమని నేపాల్ బార్ అసోసియేషన్ గుర్తుచేసింది. పార్లమెంటు పదవీకాలం ముగియకముందుగానే సభను రద్దుచేయడంవల్ల తదుపరి దేశ ప్రజలకు ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యవస్థలపై నమ్మకం పోతుందని, రాజ్యాంగ మౌలిక విలువలకు ఇది పెద్ద బెడదగా మారిందని విమర్శించారు. యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించిన రెండురోజుల నేపాల్ ఉద్యమం వల్ల దేశంలో తిరిగి మితవాద తిరోగామి శక్తులు తలెత్తడానికి అవకాశాలు పెరిగాయని పలువురు విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో పార్లమెంటు రద్దు రాజ్యాంగ విరుద్ధమని, ఇది ఏకపక్ష నిర్ణయమనీ విమర్శించాయి. జనరేషన్ జెడ్ ఉద్యమ ప్రదర్శకుల ప్రతినిధులకు, దేశాధ్యక్షుడికీ మధ్య ఆర్మీ అధికారుల సమక్షంలో రెండురోజులపాటు జరిగిన చర్చల్లో ఏకాభిప్రాయం కుదరడంతో తాత్కాలిక ప్రభుత్వ ప్రధానమంత్రిగా న సుశీల కర్కి(73)శుక్రవారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత రాత్రి 11 గంటల నుండీ పార్లమెంటు రద్దు నిర్ణయం అమలులోకి వచ్చినట్లు అధ్యక్ష కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. నేపాల్ పార్లమెంటు దిగువసభ (ప్రతినిధి సభ)లో 334 మంది సభ్యులు, ఎగువసభ రాష్ట్రీయసభ (నేషనల్ అసెంబ్లీ)లో 59 మంది సభ్యులు ఉంటారు. దిగువసభకు నిర్ణీత ప్రకారం 2027 నవంబరులో ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఎగుసభలో 59మంది సభ్యులున్నారు. ఎగువసభకు గతేడాదే ఎన్నికలు జరిగాయి. ఈనెల 8,9 తేదీలలో దేశంలో జరిగిన యువజన,విద్యార్థి హింసాత్మక ఉద్యమం దేశ రాజకీయాలను, నేపాల్ చరిత్రను కొత్త మలుపు తిప్పింది.

**ఆసుపత్రుల్లో ప్రధాని పరామర్శలు**

సుశీల కర్కిపై గురుతరమైన బాధ్యతలు ఉన్నాయి. అమె ఆదివారంనాడు మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారు. ఐతే ఖర్చులు తగ్గించేందుకు చాలా చిన్న మంత్రివర్గాన్ని అమె ఏర్పాటు చేస్తారు. దాదాపు 24 మంత్రిత్వశాఖల బాధ్యతలను ప్రధానమంత్రే చూసుకుంటారు. వీటిల్లో విదేశీ,హోం, రక్షణ మంత్రిత్వశాఖలు ప్రధానమైనవి. దేశంలో యువకులు, విద్యార్థులు ఆమెపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉద్యమ సమయంలో యువకులు కోరుకున్నవిధంగా నిరుద్యోగ నిర్మూలనతోపాటు వృథాఖర్చులను నియంత్రించాల్సిన అవసరం ప్రధానంగా ఆమె భుజస్కంధాలపైనే ఉంది. కర్కి పొదుపు చర్యలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని భావిస్తున్నారు. ఉద్యమకారులు సింగ్దర్‌బార్ సచివాలయంలో ఉన్న ప్రధానమంత్రి కార్యాలయాన్ని కూడా అగ్నికి ఆహుతిచేశారు. సింగ్ధర్‌బార్‌లో హోంమంత్రిత్వశాఖకోసం కొత్తగా నిర్మించిన భవనంలో ప్రధానమంత్రి కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శిథిలాలను తొలగిస్తున్నారు. ప్రధానమంత్రి కార్యాలయాన్ని తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, తాత్కాలిక ప్రధానమంత్రి సుశీల కర్కి శనివారంనాడు దేశంలో అల్లర్లు జరిగిన ప్రధాన ప్రాంతాలను సందర్శించారు. బనేశ్వర్ ప్రాంతంలో ఉన్న వివిధ ఆసుపత్రులకు వెళ్ళి గాయపడినవారిని పరామర్శించారు.

**సాధారణ జీవనం ప్రారంభం**

నేపాల్‌లో దేశవ్యాప్తంగా గడచిన నాలుగు రోజులుగా విధించిన కర్ఫ్యూ, నిషేధాజ్ఞలను శనివారం తొలగించారు. దీంతో దేశంతో మునుపటిలాగానే సాధారణ పౌర జీవన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. జనరేషన్ జెడ్ నిరసన ప్రదర్శకులు కోరుకున్న ప్రధానమంత్రి సుశీల కర్కి నియామకం జరిగిన తర్వాత ఖాట్మండు లోయలో విధించిన కర్ఫ్యూ, నిషేధాజ్ఞలను ఎత్తివేసినట్లు సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ దేశంలో రెండురోజులపాటు జరిగిన ఉద్యమంలో 51 మంది మరణించగా, 1,300 మంది గాయపడ్డారు. వివిధ జైళ్ళ నుండి ఈ సందర్భంగా 15 వేలమంది ఖైదీలు పారిపోయారు. వీరిలో కొంతమందిని భారత సరిహద్దు భద్రతాదళాలు పట్టుకుని ఆ దేశ బలగాలకు స్వాధీనం చేసింది.

## అదానీ, అంబానీలకే (మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, గొంతెత్తితే ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మిక సంఘాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎ.ఐ.సి.బి.ఈ.ఎఫ్) ఎ పి, టిఎస్ 37వ మహాసభ, సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండి యా ఆఫీసర్స్ యూనియన్ (సి బి ఐ ఓయు ) ఎపి, టిఎస్ 13వ త్రైవార్షిక సభలు సంయుక్తంగా శుక్రవారం హైదరాబాద్ కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్ లో ఎ.సుందర్ రావు ప్రాంగణంలో జరిగాయి. ఈ మహాసభలను ఎ ఐ బి ఈ ఎ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలం ప్రారంభించగా, ముఖ్య అతిధులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు, ఎ.ఐ.బి.ఈ.ఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ కె.ధారాసింగ్ నాయక్, ఎ.ఐ.బి.ఓ.ఎ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఖాన్, వరంగల్ రీజినల్ హెడ్ ఎ.వి. కృష్ణా మోహన్, విజయవాడ రీజియన్ హెడ్ పి.సతీష్ బాబు హాజరయ్యారు. సభలో సిహెచ్. వెంకటాచలం మాట్లాడుతూ ఎ ఐ బి ఈ ఎ పోరాడి కనీస వేతనాల చట్టాన్ని సాధించగా, ప్రస్తుత పరిస్థితులలో ప్రైవేటీకరణ మోజులో పడి కార్మికవర్గానికి కనీస వేతనాలను ప్రభుత్వాలు నిరాకరిస్తుండడం గర్హనీయమన్నారు. దేశం ఆర్థిక రంగం, కార్మిక లోకం, కార్మిక సంఘాలు నేడు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాయన్నారు. ఇన్ని విజయాలు సాధించినప్పటికీ ప్రస్తుతం పరిస్థితి భయంకరంగా ఉందని, ప్రభుత్వ విధానాల వల్ల యూనియన్ యాజమాన్యాలకు మధ్య సంప్రదింపులు లేకుండా చేస్తున్నాయని, ఇలాంటి అనేక సవాళ్ళను బ్యాంకింగ్ రంగంలో ఉన్న అన్ని యూనియన్లు సంయుక్తంగా ముందుకు వచ్చి ఎదుర్కోవాలన్నారు. నేడు బ్యాంకుల్లో వివిధ రూపాల్లో రూ.250 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఉందని, ఇది ప్రభుత్వ బడ్జెట్‌ల కంటే ఎక్కువ అని, ఈ ధనం అంతా సామాన్య ప్రజలదే తప్ప ప్రభుత్వానిది కాదని, ఈ డబ్బును కాపాడవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకులన్నీ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని,అయినప్పటికీ పాలకులు ప్రైవేట్ బ్యాంకులను ప్రోత్సహిస్తూ దశాబ్దాల తరబడిగా ప్రజలకు అండగా ఉంటూ వారి ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి కృషి చేస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి పాలకవర్గాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించా రు.

ఈ పరిస్థితులలో బ్యాంకింగ్ ఉద్యోగులు దీర్ఘకాలికంగా చేస్తున్న పెన్షన్, అప్‌గ్రేడేషన్‌తో పాటు దేశ ప్రజల పక్షాన ఎ ఐ బి ఈ ఎ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

### ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దేశం మనుగడ : కూనంనేని సాంబశివ రావు

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటనే ఈ దేశం మనుగడ సాధ్యమౌతుందని సాంబశివ రావు అన్నారు. బ్యాంకుల ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. భారత బ్యాంకింగ్ సెక్టార్‌లో ప్రధాన యూనియన్‌కు నేతృత్వం వహిస్తున్న వెంకటాచలం బ్యాంకిం గ్ సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారని అభినందించారు. ప్రపంచం ఆర్థిక మాద్యం ఎదుర్కొన్నప్పుడు ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు మాత్రమే దేశాన్ని కాపాడాయన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిరక్షణ కోసం ఎ ఐ బి ఈ ఎ పోరాటం చేసి ప్రభుత్వ రంగం బ్యాంకులను నిలబెట్టకోగలిగిందన్నారు.

బ్యాంకింగ్ రంగంలో 10 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, ఎ ఐ బి ఈఎ కు 5 లక్షల సభ్యత్వం ఉండటం గర్వ కారణమన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడాలంటే చట్టాలు చేసే వారు ఎవరు ఉండాలని ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యులైన ఇంద్రజిత్ గుప్త, గురుదాస్ దాస్ గుప్తాలు బ్యాంకింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను లెవనెత్తేవారని, బ్యాంకు ఉద్యోగుల వ్యతిరేక చట్టాలు తీసుకొస్తే అడ్డుకున్నారన్నారు. బ్యాంకింగ్ రంగంలో చోటుచేసుకున్న అనేక స్కామ్ లను గురుదాస్ దాస్ గుప్తా వెలుగులోకి తీసుకొచ్చారని కూనంనేని తెలిపారు. చట్టాలు చేసేవారు ఉద్యోగ, కార్మికవర్గ ప్రయోజనాలు కోరేవారు కాదని, చట్ట సభలైన పార్లమెంట్, శాసనసభలలో ఈ వర్గాల ప్రయోజనాలను కోరేవారు ఉంటే బ్యాంకు ఉద్యోగుల గొంతు వినిపించేందుకు అవకాశం లభిస్తుందని, చట్ట సభలలో మన గొంతు వినిపించేందుకు ఓట్లు వేసి, గెలిపించాలని కోరారు. ఉద్యోగులు, కార్మికులకు కష్టం వస్తే నిలబడేది ఎర్రజెండానే అన్నారు. ఎ పి టి బి ఈ ఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షంచుకోవాలని, పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు ప్రభుత్వ రంగ బ్యాంక్‌గా నిలబెట్టుకోవాలని, ఇందు కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎ ఐ బి ఈ ఎ సభ్యులు మరింత సంఘటితంగా పోరాడాలన్నారు. ఎ పి టి బి ఈ ఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి పి.వి. కృష్ణా రావు, సి బి ఐ ఈ యు తమిళనాడు ప్రధాన కార్యదర్శి డి.పి.గోపినాథ్, సి బి ఓ యు తమిళనాడు ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ దేవయ్య, సి బి ఐ ఈ యు కర్నాటక ప్రధాన కార్యదర్శి ఎల్. సతీష్, సి బి ఓ యు కర్నాటక ప్రధాన కార్యదర్శి ఆర్.టి.యాదవ్, సి బి ఓ యు కేరళ ప్రధాన కార్యదర్శి అనిల్ ఉన్నతన్, సి బి ఐ ఈ ఎ ఎపి, టిఎస్ అధ్యక్షులు వై. శ్రీనివాస్ రావు, సి బి ఐ ఈ ఎ ఎపి, టిఎస్ ప్రధాన కార్యదర్శి పి.ఉదయ్ భాస్కర్, సి బి ఓ యు ఎపి, టిఎస్ అధ్యక్షులు బిఎన్ నాయక్, ప్రధాన కార్యదర్శి పి ఎస్ పి ఆర్. ఫణికుమార్ పాల్గొన్నారు.

# స్కూల్ మాటున అల్ఫాజోలం తయారీ

* రూ.కోటి సొత్తు స్వాధీనం
* ముగ్గురి అరెస్టు
* స్కూలు డైరెక్టరే ప్రధాన సూత్రధారి
* బోయిన్‌పల్లిలోని శ్రీ మేధా పాఠశాలపై ఎక్సైజ్ ఈగల్ టీం మెరుపుదాడులు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** బయటి ప్రపంచానికి అది ఒక స్కూల్..అయితే ఈ స్కూల్‌నే అడ్డాగా చేసుకున్న ఓ ప్రబుద్ధుడు కల్తీ కల్లుకు ఉపయోగించే అల్ఫాజోలం దందాను కొనసాగిస్తున్నాడు. మహబూబ్‌నగర్‌లో తీగలాగితే దాని డొంక బోయిన్‌పల్లిలోని శ్రీమేధా స్కూల్‌లో కదిలింది. ఈ మేరకు బోయిన్ పల్లిలో ఎక్సైజ్ ఈగల్ టీమ్ శనివారం మధ్యాహ్నం శ్రీమేధా స్కూల్ పై మెరుపు దాడులు నిర్వహించింది. ఈ దాడిలో ప్రధాన సూత్రధారితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి నుంచి సుమారు కోటి వరకు విలువ చేసే అల్ఫాజోలం మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన శ్రీ మేధా స్కూల్ డైరెక్టర్ జయ ప్రకాశ్ గౌడ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.
జయప్రకాశ్ గౌడ్ తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. అయితే జయప్రకాశ్ గౌడ్ ఇక్కడ ఆల్ఫాజోలం తయారు చేసి హైదరాబాద్ బోయిన్ పల్లితో పాటు మహబూబ్ నగర్, జడ్చర్ల ప్రాంతాలకు పెద్ద మొత్తంలో అల్ఫాజోలం సరఫరా చేస్తున్నట్లుగా ఈగిల్ టీమ్ గుర్తించింది. ఎవరికీ అనుమానం కలగకుండా ఓ స్కూల్ ని స్థాపించి అందులోనే సదరు వ్యక్తి అల్ఫాజోలంను నిల్వ చేసి అక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి మహబూబ్ నగర్ జిల్లా వాసి కావడంతో జిల్లాలో చాలా మంది కల్లు అమ్మకందారులతో అంటకాగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆ పరిచయాలతోనే పెద్దమొత్తంలో మహబూబ్ నగర్ జిల్లాకు అల్ఫాజోలం సరఫరా చేసినట్లు సమాచారం. జయప్రకాశ్‌గౌడ్‌తో పాటు మురళీసాయి, ఉదయ్‌సాయిలను అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో కల్తీ కల్లు మూలాలు మహబూబ్‌నగర్ జిల్లాలో వెలుగు చూస్తుండటంతో ఈగల్ టీం అధికారులు అంతర్గత విచారణను సాగిస్తున్నారు.

**బంజారాహిల్స్‌లో డ్రగ్ పట్టివేత :** బంజారా హిల్స్‌లో మరోసారి డ్రగ్స్ పట్టుబడింది. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 14.83 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ టి ఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజి రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భరత్ తుర్కల్ (50), కొనిపట్ల కృష్ణ (43) అనే వ్యక్తులు కారులో ఎండిఎంఎ డ్రగ్స్‌ను తీసుక వచ్చి అమ్మకాలు బంజారా హిల్స్‌లో శనివారం ఈ డ్రగ్స్‌ను అమ్మ కాలు జరుపు తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టిఎఫ్ అధికారు లు



చాకచక్యం గా వీరిని అదుపు లోకి తీసుకున్నారు. డ్రగ్స్‌తోపాటు 70 గ్రాముల గంజాయిని కూడ స్వాధీనం చేసు కున్నారు. ఈ కేసులో మూడో నిందితుడిగా ఉన్న ఢిల్లీకి చెందిన మహ్మద్ షాజీవ్ పరారీలో ఉన్నారు.

# జనజీవన స్రవంతిలోకి సుజాత

**డిజిపి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి**

**తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.25లక్షల నగదు అందచేసిన డిజిపి జితేందర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి (62)అలియాస్ (కిషన్‌జీ భార్య, మైనాబాయి, మైనక్క, సుజాత) జనజీవన స్రవంతిలో కలిశారు. 43 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో అజ్ఞాతంలో పనిచేసిన ఆమె స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబి) చీఫ్ సుమతి ముందు లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంటెలిజెన్స్ డిజి శివధర్ రెడ్డితో కలిసి డిజిపి డాక్టర్ జితేందర్ వెల్లడించారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండ లం పెంచి కల్వాడు గ్రామానికి చెందిన పద్మావతి ఇంటర్ పూర్తి చేసుకున్న తరువాత 1982లో సిపిఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూప్‌లో చేరింది. ఆ తరువాత పీపుల్స్‌వార్ గ్రూప్ ఆధ్వర్యంలో నడుస్తున్న కోఠిలోని పీస్ బుక్ సెంటర్ పనిచేస్తున్న సమయంలో పీపుల్స్‌వార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి కార్యదర్శిగా పనిచేస్తున్న మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీతో 1984లో వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమార్తె కూడా ఉంది.1987లో వీరిద్దరు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాకు వచ్చి పార్టీ అజ్ఞాత పనులలో నిమగ్నమయ్యారు.మొదట పెరిమిలి దళం, ఎటపల్లి దళంలో పటేల్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తూ డిప్యూటీ కమాండర్‌గా పదోన్నతి పొందా రు. 2001లో దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటిలో రాష్ట్ర కమిటి సభ్యురాలిగా పనిచేశారు.భర్త 2008లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటి కార్యదర్శిగా బదిలీ అయ్యి వెళ్లిపోయిన తరువాత నవంబర్ 24, 2011న అక్కడ జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ధ్మావతి మాత్రం 2018 వరకు దండకారణ్యంలోని జనతన్ సర్కార్ పూర్తి బాధ్యతలను నిర్వర్తించింది.2023లో సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటి సభ్యురాలిగా పదోన్నతి పొందింది. పార్టీ బాధ్యతలతో పాటు కోయ భాషలో వచ్చే 'పేతురి' అనే పత్రిక సంపాదకురాలిగా కూడా పనిచేసింది.

**ఆరోగ్యం క్షీణించడంతో..**

తన ఆరోగ్యం క్షీణించడంతో పార్టీని విడిచి ప్రభుత్వ సహాయంతో జన జీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నట్లు మావోయిస్టు కేంద్ర కమిటి సభ్యుడు ద్వారా కేంద్ర కమిటికి తెలియజేసింది. 43 సంవత్సరాలు ఆమె అజ్ఞాతంలో ఉండడం, ఆరోగ్యానికి ప్రాధాన్యతతో పాటు కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపాలనే నిర్ణయం మేరకు పద్మావతి మావోయిస్టు పార్టీని విడిచి జన జీవన స్రవంతిలోకి వచ్చారు. ఆమె పేరుపై తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల నగదు బహుమతిని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిజిపి డాక్టర్ జితేందర్ ఆమెకు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస పథకానికి అనుగుణంగా లొంగిపోయిన మావోయిస్టులకు లభించే అన్ని ఇతర ప్రయోజనాలు కూడా ఆమెకు అందిస్తామని డిజిపి స్పష్టం చేశారు.

**జనజీవన స్రవంతిలో కలవండి**

అజ్ఞాతంలో ఉన్న సిపిఐ (మావోయిస్టు) సభ్యులు, నేతల జనజీవన స్రవంతిలోకి రావాలని తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పోలీసు శాఖ అవలంభించిన వ్యూహం ప్రభావంతో ఈ ఏడాదిలోనే మొత్తం 404 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారని తెలిపారు. ఇందులో నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులు,ఒకరు డివిజనల్ కమిటీ కార్యదర్శి, 8 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 34 మంది ఏరియా కమిటీ సభ్యులు, సాయుధ పోరాటాన్ని వీడి తమ, తమ కుటుంబాలతో కలిసి శాంతియుత జీవితం గడపాలని నిర్ణయించుకొని తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోవడం జరిగిందన్నారు. ఇది మావోయిస్టులపై తెలంగాణ పోలీసుల ప్రధాన విజయం అని అన్నారు. ప్రస్తుతం సిపిఐ (మావోయిస్టు)లో 78 మంది అజ్ఞాత మావోయిస్టు కేడర్లు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారని. అలాగే కేంద్ర కమిటీ మొత్తం 15 మంది సభ్యుల్లో 10 మంది తెలంగాణకు చెందినవారే ఉన్నారని తెలిపారు.

# వాటా సాధించాల్సిందే (మొదటి పేజీ తరువాయి)

ఒప్పుకున్న విషయాన్ని ఎపి ఇప్పుడు ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సిఎంకు వివరించారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఎపికి 512 టిఎంసిలు కట్టబెట్టి, 299 టిఎంసిల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని సిఎం స్పష్టం చేశారు. స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ కె.వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్,నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇ. ఎన్.సి అంజద్ హుస్సేన్, సిఎంఓ సెక్రెటరీ మాణిక్‌రాజ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

**స్వయంగా హాజరవుతా : ఉత్తమ్**

సాగునీటికి సంబంధించి తెలంగాణాకు చెందాల్సిన నీటి వాటలో చుక్క నీరు కూడా వదులుకునే ప్రసక్తేలేదని నీటిపారుదల, శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 23 నుండి 25 వరకు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో బలమైన వాదనలు వినిపించనున్నామని, విచారణకు తాను స్వయంగా పాల్గొనబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో 23 నుండి 25 వరకు జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్2 విచారణలో తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన అంశంపై శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయం జలసౌధ లో న్యాయనిపుణులు, నీటిపారుదల రంగ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ. ఎన్.సి అంజద్ హుస్సేన్ సుప్రీం కోర్టు న్యాయవాది సి.ఎస్ వైద్యనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ అంశంపై ఒత్తిడి తెచ్చేందుకు కృష్ణా జలాశయాలలో తెలంగాణా రాష్ట్ర వాటాను సాధించేందుకు బలమైన వాదనలు వినిపించేందుకు పూర్తి స్థాయిలో అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామన్నారు. అధికారులిచ్చే నివేదికల ఆధారంగా న్యాయవాదులు తెలంగాణా రాష్ట్రానికి చెందాల్సిన నీటివాటపై వాదనలు వినిపించనున్నారని ఆయన పేర్కొన్నారు. విచారణ రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకుని ఢిల్లీకి చేరుకుని సమీక్షించనున్నారన్నారు.

**ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడిని ట్రిబ్యునల్ ముందు పెడుతాం :**

కెడబ్ల్యూడిటి ఎదుట 2025 ఫిబ్రవరి నుండి వాదనలు కొనసాగుతున్నాయని, సమైక్యాంధ్రలో తెలంగాణా ప్రాంతానికి జరిగిన అన్యాయంపై ప్రస్తావించారని ఆయన తెలిపారు. శాస్త్రియంగా నీటి కేటాయింపులు, ఆంధ్రప్రదేశ్ చేపట్టిన అనధికార బేసిన్ ల వివరాలు,తెలంగాణా ప్రాంతంలో సాగునీటి అవసరాలు అందులో పొందు పర్చామన్నారు. ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలువల సామర్థ్యాలను పెంచుకుంటూ గోదావరి, పట్టిసీమ, చింతలపూడి, పులిచింతల నీరు అక్రమంగా తరలించుకు పోతున్న అంశాలను ఇప్పటికే ట్రిబ్యునల్ ముందు ఉంచామన్నారు. 1956 జలవివాద చట్టం, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాల ఉల్లంఘనలకు పాల్పడిన విషయంపై వాదనలు వినిపించామని చెప్పారు. .811 టిఎంసి ల కృష్ణా జలాశయాలలో తెలంగాణా ప్రాంతానికి 71 శాతం కేటాయింపులు ఉండాలని తాము డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65శాతం కేటాయింపులు ఉండాల్సిందే నన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రిబ్యునల్ కు సమర్పించా మని ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఇప్పటికే ట్రిబ్యునల్ ఎదుట వాదనలు పూర్తిగా వినిపించగా తాజాగా అధికారులు అందిస్తున్న నివేదికల ప్రకారం జూన్, జులై నెలలో ఇక్కడికి అవసరమైన నీటి కోసం 80 టిఎంసి ల నీటిని అందుబాటులో ఉంచేలా వాదనలు వినిపించనున్నామన్నారు. అదేవిధంగా ఆపరేషన్ ప్రొటో కాల్ నిబంధనల ననుసరించి మిగిలిన నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణాకు ఉండేలా ట్రిబ్యునల్ ముందు పెడుతామని చెప్పారు. ఐఎస్ఆర్‌డబ్ల్యుడి చట్టం లోని సెక్షన్ 4(1)ఎ తో పాటు పునర్వ్యవస్థీకరణ చట్టం లోని 11వ షెడ్యూల్ 10వ పేరాగ్రాఫ్ వంటి న్యాయపరమైన అంశాలను కూడా ఈ విచారణలో వాదించబోతున్నట్లు ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా వినియోగిస్తున్న 291 టిఎంసిల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందే నని ఆయన డిమాండ్ చేశారు.

**ఎపి కారణంగానే తెలంగాణలో ప్రాజెక్టులు అలస్యం :**

సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్, నదుల నిర్వహణ బోర్డు ల ఎదుట ఆంధ్రపదేశ్ ప్రభుత్వం తెలంగాణా లో కడుతున్న ప్రాజెక్టులపై అడ్డుపడుతుండడంతో ఒకింత ఆలస్యం జరుగుతొందని ప్రాజెక్ట్ ల నిర్మాణాలపై తెలంగాణాకు ఉన్న హక్కులను కూడా ట్రిబ్యునల్ ఎదుట జరిగే వాదనలలో వినిపిస్తామన్నారు. తమ వాదనలకు బలం చేకూరేలా ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణాల అంశాలతో కూడిన ప్రత్యేక జిఓను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేందుకు సన్నదమౌతుందన్నారు. వీటిలో కల్వకుర్తి, నెట్టెంపాడు,పాలమూరురంగా రెడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరం త్రాగునీటి అవసరాల కోసం కొత్తగా నిర్మిస్తున్న రిజర్వాయర్ లు,100 టిఎంసి లను మళ్లించడానికి వీలుగా రూపకల్పన చేసిన జూరాల ఫ్లడ ఫ్లో కెనాల్ లు ఉన్నాయన్నారు.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లె కృష్ణా జలాలల్లో అన్యాయం :**

ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకో లేక పోయిందని ఆయన బిఆర్ఎస్ పాలకుల పై మండిపడ్డారు. గత పాలకుల ఉదాసీనతతోటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నీటిని తరలించుకుని పోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుండే న్యాయంగా తెలంగాణాకు రావాల్సిన నీటి వాటా పై గట్టిపట్టు పడుతున్నామన్నారు.అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి ముందుకు పోతున్నామనితెలిపారు. తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని ట్రిబ్యునల్ ఇప్పటికే గుర్తించిందని తెలంగాణాకు దక్కాల్సిన నీటి వాటా కేటాయింపులను ఎట్టి పరిస్థితుల్లో సాధించి తీరుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నీటిలో కొట్టుకపోయి నలుగురు మృతి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వాంకిడి మండలంలోని దాబా గ్రామంలో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. చికి వాగు నీటి కుంటలో అదే గ్రామానికి చెందిన మొహరే నిర్మల (33), మొహరే గణేష్ (12), మహెశ్వరి (10), శశికళ (10) దుర్మరణం చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.
గ్రామ శివారులోని చికి వాగు నీటికుంటలో యూరియా బస్తాలు కడుగుతుండగా ఓ ఖాళీ బస్తా నీటిలో కొట్టుకుపోయింది. ఆ బస్తాను తెచ్చేందుకు మొహరే గణేష్ నీటిగుంటలోకి దిగగా నీటి లోతు ప్రవాహం అధికంగా ఉండటంలో గల్లంతయ్యాడు. అది గమనించిన తల్లి మొహరే నిర్మల కాపాడేందుకు వెళ్లగా ఆమె వెంట బంధువులైన శశికళ, మహేశ్వరి నీటిలో గల్లంతయ్యారు. ఒడ్డున ఉన్న మరో అమ్మాయి గమనించి పరుగున వెళ్లి గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా వారిని వెలికితీశారు. అప్పటికే వారు మృతి చెందారు.

## ట్రిపుల్ ఆర్ భూ బాధితుల డిమాండ్లకు సిపిఐ మద్దతు

### రైతుల శవాలపై రోడ్లు వేస్తామంటే తిరుగుబాటు చేస్తాం
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ట్రిపుల్ ఆర్ భూ బాధితుల న్యాయమైన డిమాండ్లకు సిపిఐ మద్దతిస్తుందని, నిరంతరం రైతుల పక్షాన పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. శనివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని ఎస్ఎంఆర్ కన్వెన్షన్ హాల్లో ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, వలిగొండ మండలాల రైతులతో ట్రిపుల్ ఆర్ బాధిత రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ ఆర్ఆర్ రింగు రోడ్డుకు అన్ని ప్రాంతాల్లో సమాన దూరంలో ఏర్పాటు చేయాల్సిన ట్రిపుల్ ఆర్‌ను ఒక్కో ప్రాంతంలో ఒక్కో తీరుగా అలైన్మెంట్ చేయడం ఏంటని, చౌటుప్పల్ పరిసర ప్రాంతానికి ఉత్తర దక్షిణ భాగంలో 28 కిలోమీటర్ల దూరం తగ్గించి అలైన్మెంట్ క్రాసింగ్ చేశారని, బడా పారిశ్రామిక కంపెనీల మేలు కోసం అలైన్మెంట్ క్రాసింగ్ చేశారని మిగతా ప్రాంతాల్లో 40, 50 కిలోమీటర్ల తీసుకొని చౌటుప్పల్‌లో 28కిలోమీటర్లు మాత్రమే తీసుకోవడంలో ఆంతర్యం ఏంటని, దివిస్ కంపెనీని కాపాడడం కోసమే అలైన్మెంట్ మార్పులు చేశారని అన్నారు. అభివృద్ధి పేరుతో రైతుల పొట్టకొట్టి బడా పరిశ్రమల కడుపు నింపడం సరికాదన్నారు. ప్రజాపాలన చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పెద్దలతో కలిసి మొదట ప్రజలతో చర్చించిన తర్వాత కలెక్టర్లు, పోలీసులు, అధికారులను పంపించాలన్నారు. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని, రైతులను సంతృప్తిపరచాకే రోడ్డు నిర్మాణం చేపట్టాలే తప్ప బలవంతంగా రైతుల శవాలపై రోడ్లు వేస్తామంటే రైతులతో తిరుగుబాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చౌటుప్పల్ శివారులో ఎకరానికి సుమారు రూ.4కోట్ల వరకు ధర పలుకుతున్న వారికి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం సరిపోదన్నారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, వలిగొండ మండలాలలో 1400 ఎకరాలు 1000 మంది రైతులు నష్టపోతున్నారన్నారు. ట్రిపుల్ ఆర్ రోడ్డుపై అసెంబ్లీలో, శాసనమండలిలో సిపిఐ పార్టీ తరఫున ప్రశ్నిస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రైతులకు భరోసా కల్పించారు. ఎల్లప్పుడూ రైతుల పక్షాన సిపిఐ పోరాడుతుందని తెలిపారు.

**సంపన్నులకు మద్దతుగా ఆర్ఆర్ఆర్ మార్పు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

సంపన్న వర్గాలకు మేలు జరిగే విధంగా ట్రిపుల్ ఆర్ వలయ మార్గంలో మార్పులు చేయడం సరికాదన్నారు. ఉత్తర భాగం రైతులు తీవ్ర ఆందోళన చేపట్టిన సందర్భంగా నాటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకులు 60 కిలోమీటర్లుగా చేయాలన్నారు. నేడు అధికారం చేపట్టిన ఆ కాంగ్రెస్ పార్టీ నాయకులే నిష్పక్షపాతంగా ఒక ప్రాంతంలో 40 కిలోమీటర్లు ఒక ప్రాంతంలో 60 కిలోమీటర్లు ఒక ప్రాంతంలో 28 కిలోమీటర్లుగా మార్పు చేయడంతో సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు రూపకల్పన చేసినప్పుడు భూసేకరణ అనేది రైతులకు నష్టం జరగకుండా ఉండాలని, దివిస్ కంపెనీ మేలు కోసం పేదలను ఇబ్బందులు గురిచేయవద్దన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలని భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ విలువను చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు చింతల దామోదర్ రెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, బూరుగు కృష్ణారెడ్డి, బచ్చనగోని గాలయ్య, కురుమిద్ద శ్రీనివాస్, దోనూరి నర్సిరెడ్డి, నడికుడి అంజయ్య, పగిళ్ల మోహన్ రెడ్డి, బోరెం ప్రకాశ్ రెడ్డి, సురుకంటి శ్రీనివాస్ రెడ్డి, పల్లె పుష్పరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, మునగల రమణారెడ్డి, గాజుల భగత్, కొండూరు వెంకటేష్ ఉడుత రామలింగం, పల్లె మధు, మల్లేష్, టంగుటూరి రాములు, దాసరి అంజయ్య, నీళ్ల బిక్షపతి, తదితర భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

## భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు
# బీమా రంగం సన్నద్ధం కావాలి

### ఐఐఆర్ఎం స్నాతకోత్సవంలో ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత బీమా రంగం, సంస్థలు పన్నద్ధం కావాలని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ ) డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా, దేశంలో వస్తున్న వాతావరణ, భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బీమా సంస్థలు విధానాలు, పద్ధతులు, సేవలను రూపొందించుకోవాలని ఆయన సూచించారు. గచ్చిబౌలిలో శనివారం జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్స్యూరెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్ ఎం) స్నాతకోత్సవానికి ఎం.రాజేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోపన్యాసం చేశారు. ఐఐఆర్ఎంలో 2023–25 విద్యా సంవత్సరంలో పిజిడిఎం విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులకు రాజేశ్వర రావు పట్టాలను ప్రదానం చేశారు. సభకు అతిథులుగా భారత ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డిఎఐ) సభ్యులు రజయ్ కుమార్ సిన్హా, పి.కె.అరోరా, సత్యజిత్ త్రిపాఠి, ఐఐటి సిఈఓ వెంకట్ చెంగవల్లి, ఎస్‌బిఐ లైఫ్ ఇన్స్యూరెన్స్ అధికారి అభిషేక్ ముజుందార్ హాజరయ్యారు. సభలో రాజేశ్వర రావు ప్రసంగిస్తూ ఆర్థిక రంగాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి స్థిరమైన ఆర్థిక విధానం, ప్రభావవంతమైన రిస్క్ మేనేజ్‌మెంట్, నాయకత్వం అవసరన్నారు. ఐక్యరాజ్య సమితి 2020–23 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని, ఈ వాతావరణ అసమానతలను నియంత్రించనట్లయితే ప్రపంచవ్యాప్తంగా 4 శాతం జిడిపిని నష్టపోయే ప్రమాదం ఉందని, దీని ప్రభావం అన్ని రంగాలపై పడుతుందని, ముఖ్యంగా బీమా రంగంలో పై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఈ వాతావరణ, సామాజిక భౌగోళికమైన మార్పులు బీమా రంగంలో గణనీయమైన డిమాండ్‌ను పెంచుతుందని, ఇందుకు అనుగుణంగా బీమా రంగం తన సేవలను రూపొందించాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం లెక్కల ప్రకారం దేశంలో బీమా రంగం విస్తరణ తక్కువగా ఉందని, ప్రపంచవ్యాప్తంగా బీమా ప్రీమియం సగటు 7 శాతం కాగా భారతదేశంలో అది 3 శాతంగా ఉందన్నారు. అయితే భవిష్యత్తులో ఆర్థిక రంగం కంటే ఎక్కువగా బీమా రంగం అభివృద్ధి చెందుతుందని, 2024 – 28 మధ్యకాలంలో దేశంలో బీమా రంగం వృద్ధి 11 శాతం ఉంటుందని భారత బీమా రంగం అంచనా వేసిందన్నారు. ఈ వృద్ధి సాంకేతిక అంశాలు, వాతావరణ మార్పులు, సూక్ష్మ ఆర్థిక వ్యవహారాలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఆర్థిక, ఇన్స్యూరెన్స్ సంస్థలు ఈ మార్పులను సూక్ష్మంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు.

ఐఆర్‌డిఎఐ సభ్యులు రజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ బీమా, ఆర్థిక సేవల రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. సమాజంలో, తాము ఎంచుకున్న రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేసిన వారే మనుగడ సాధిస్తారని, లేనట్లయితే వెనుకబడిపోతారన్నారు. ఐఐఆర్ఎం డైరెక్టర్ అరవింద్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.కె.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రూపు–1 పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### సంవత్సరంలో రెండులక్షలు ఉద్యోగాలు ఇస్తానని వాగ్ధానం చేశారని రెండెళ్లైన ఇవ్వరా ? : మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** గ్రూప్ వన్ పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. గ్రూపు వన్ పరీక్షలో లక్షలాది రూపాయలు ముడుపులు డిమాండ్ చేసారని ఆరోపణలు వెల్లివిరుస్తున్నాయని.. ఇంత నిర్లక్ష్యంగా పరీక్ష నిర్వహిస్తారా అని స్వయంగా హైకోర్టు ప్రభుత్వంపై మొట్టికాయాలు వేసిందన్నారు. నిజంగా తప్పుచేయకుంటే సిఎం రేవంత్‌రెడ్డి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. తప్పును సరిదిద్దకుండ మరో అప్పీల్‌కు పోదామని చెప్పటం మూర్ఖత్వం అని విమర్శించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచికళా భవన్‌లో నిర్వహించిన మెగాజాబ్ మేళాను మాజీ మంత్రి హరీష్‌రావు ప్రారంభించి మాట్లాడారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని రెండేళ్లు పూర్తి కానున్నాయని, రెండు లక్షల ఉద్యోగాలు ఏమైనాయని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీని అశోక్‌నగర్‌లో కూర్చోబెట్టి మాటిచ్చారని, రెండు లక్షల ఉద్యోగాలు ఏమైనాయన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్ష, ఇంటర్వ్యులు నిర్వహించింది కెసిఆర్ అయితే కేవలం ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చింది మాత్రం రేవంత్‌రెడ్డి అన్నారు.

*** నేపాల్, బంగ్లాదేశ్‌లో వచ్చిన విప్లవాలు మనదేశంలో రావద్దు**

సమాజ భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. స్థానిక వైశ్యభవన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు ప్రైవేటుపాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు ముఖ్యమన్నారు. నేపాల్, బంగ్లాదేశ్‌లో వచ్చిన విప్లవాలు మనదేశంలో రావద్దని, సామాజిక నైతిక బాధ్యతలు నేర్పాలని సూచించారు. యువత డ్రగ్స్, గంజాయికి బానిసలుగా మారుతున్నారన్నారు. విద్య అనేది ఉద్యోగం కోసంకాకుండ సమాజ నిర్మాణం కోసం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్,ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీఎస్టీ కమిషన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎంఎల్సి ఫారుక్‌హుస్సేన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం తక్షణమే కనీస వేతనాల
# జిఓలను విడుదల చేయాలి

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం కనీస వేతనాల జిఒలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మాల డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శనివారంతెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు 2010లో కనీస వేతనాలు పెంచారని, ప్రతి 5 ఏళ్లకోసారి వేతనాలు పెంచాల్సిన అవసరం ఉండగా గత 15 ఏళ్లుగా ఇప్పటి వరకు వేతనాలనే పెంచలేదన్నారు.


తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రాన్ని 10 ఏళ్ల పాటు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కూడ పట్టించుకోలేదన్నారు. దీంతో అనేక పోరాటాల ఫలితంగా కనీస వేతనాల బోర్డును గత బిఆర్ఎస్ ఏర్పాటు చేసినప్పటికీ ఆ బోర్డు సిపార్సు చేసిన కనీస వేతనాల జి.ఓ.లను యాజమాన్యాలు ఒప్పుకోవడం లేదంటూగత బిఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిందన్నారు.ఇదే క్రమంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలి నియమించగా సలహా మండలి 10 సమావేశాలు నిర్వహించి కనీస వేతనాలపై ఒక అవగాహనకు వచ్చి తమ రికమండేషన్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిందని, అయితే ఈ ప్రభుత్వం జి.ఓ. విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ దీనిపై ముగ్గురు మంత్రులతో ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ మంత్రుల ఉపసంఘాల సమావేశం ఎప్పుడు జరుగుతుందో ఎవరికి అర్థంకాని పరిస్థితిల్లో ఈ జిఓలకింద వచ్చే 1.20కోట్ల మంది అసహానంతో, అసంతృప్తితో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జిఓలను సలహా మండలి సలహాల ప్రకారం వెంటనే విడుదల చేయాలని లేకపోతే అక్టోబర్ 8వ తేదీన లేబర్ డిపార్ట్‌మెంట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి లేబర్ డిపార్ట్‌మెంట్‌ను స్థంభింపచేస్తామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి హసీనాబేగం, కార్యనిర్వాహక అధ్యక్షురాలు యం.లక్ష్మి బాయి, సహాయ కార్యదర్శులు పి.సురేష్, సుధాకర్‌లు తెలిపారు. అప్పటికీ జి.ఓ.లను విడుదల చేయకుంటే నిరవధిక సమ్మెను కూడా వెనకబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.లక్ష్మి , మధన్‌సింగ్, శారద, షాహీన్, సంతోషి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పదవీ విమరణ చేసిన పాత్రికేయులకు పెన్షన్ అందేలా కృషి

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదవీ విమరణ చేసిన పాత్రికేయులకు ప్రభుత్వం పెన్షన్ ఇచ్చేలా తనవంతు కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్షనాయకుడు కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. శనివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో కూనంనేని సాంబశివరావును వయోధిక పాత్రికేయ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కె.లక్ష్మణ్‌రావు, మల్లయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాసనసభలో పాత్రికేయుల సమస్యలను లేవనెత్తడం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం పట్ల కూనంనేని సాంబశివరావుకు వయోధిక పాత్రకేయ సంఘ ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. పదవీ విరమణ చేసి పాత్రికేయులకు ఎలాంటి ఆదాయ వనరులు గాని, కనీస పెన్షన్ గాని లేకపోవడం తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. పదవీ విమరణ చేసిన పాత్రికేయులకు గౌరవప్రదమైన పెన్షన్ ఇచ్చేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాల్సిందిగా కోరుతూ వినతిపత్రం అందజేశారు. దానిపై సానుకూలంగా స్పందించిన కూనంనేని ఈ అంశాన్ని తప్పకుండా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కూడా విజ్ఞప్తి చేస్తానని హామీ ఇచ్చారు.



## కల్లు గీత వృత్తిని రక్షించాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి పలువురు వక్తల విజ్ఞప్తి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో కల్లు గీత వృత్తిని రక్షించాలని పలువురు వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కల్లు గీత సొసైటీలకు 25శాతం వైన్స్‌లు కేటాయించాలని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్ కుమార్‌గౌడ్‌ల సంయుక్త అధ్యక్షతన మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గందమల్ల ఆనంద్‌గౌడ్ హాజరై, మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ గౌడ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తాటిచెట్లపై నుంచి పడి గాయపడ్డ, మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే పెండింగ్‌లోఉన్న రూ.13కోట్ల 95లక్షల నిధులను విడుదల చేయాలని కోరారు. తాటి చెట్ల పెంపకానికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తిచేశారు. 50ఏళ్లు పైబడిన గీత కార్మికులకు రూ.5వేల పెన్షన్ చెల్లించాలని, గీత కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తు ఉద్యమకార్యాచరణకు సిద్ధం కావాలని గౌడ సంఘాలకు సూచించారు. సమావేశంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు నారాయణగౌడ్, బిసి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్.దుర్గయ్య గౌడ్, యువ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు సంపత్‌గౌడ్, దామోదర్‌గౌడ్, తాళ్ల శ్రీశైలంగౌడ్, చీకటి ప్రభాకర్‌గౌడ్, కెవి.గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిడిపిలో ఎంఎస్ఎంఇలు
# పది శాతం వాటా సాధించాలి

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర జిడిపిలో సూ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) ల వాటా 10 శాతం ఉండేలా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం ఎంఎస్ఎంఇ నూతన పాలసీని రూపొందించినట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శంషాబాద్ ఏర్పాటైన గోనేషనల్ ఎక్స్ పో 2025 ఐదో ద్వైవార్షిక సదస్సును శనివారం ఆయన ప్రారంభించిన సందర్భంగా నిర్వాహకులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. దాదాపు 4వేల మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ సదస్సును బిజినెస్ నెట్ వర్క్ ఇంటర్నేషనల్ (బిఎన్ ఐ) నిర్వహిస్తోంది. రెండు రోజుల పాటు జరిగే ప్రదర్శనతో పాటు వివిధ అంశాలపై సదస్సులు జరుగుతాయి. నూతన సాంకేతికత, డిజిటలైజేషన్లతో ఎంఎస్ ఎంఇలు ఎప్పటికప్పుడు ఆధునీకరించుకునేలా తమ ప్రభుత్వం సహకరిస్తోందని శ్రీధర్ బాబు వివరించారు. తక్కువ వడ్డీతో రుణ సదుపాయం, నిధుల సమీకరణకు అన్ని రకాలుగా తోడ్పాటును అందిస్తున్నట్టు తెలిపారు. ఎస్ఎంఎస్ఇలలో లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఇది అత్యంత ప్రాధాన్యతా రంగం. వచ్చే రెండు నెలల్లో కృత్రిమ మేథ నూతన ఆవిష్కరణల హబ్ ను ప్రారంభిస్తాం. చిన్న పరిశ్రమల ఉత్పాదనల ఎగుమతులకు రాష్ట్రంలో రెండు డ్రైపోర్టులను ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శనలో రెండు వందల ఎంఎస్ ఎస్ఇలు తమ తయారీలను ప్రదర్శించడం సంతోషంగా ఉందని శ్రీధర్‌బాబు అన్నారు.సదస్సులో ఉత్పత్తుల ప్రదర్శన, వివిధ అంశాలపై సమావేశాలతో పాటు బేకింగ్, ఫుడ్ ఇన్నోవేషన్, ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ స్టయిలింగ్ ఫోటోగ్రఫీ, వాణిజ్య ప్రకటనలపై పోటీలు జరిగాయి.

## ఇస్కీలో పిజి స్టడిస్ స్కూల్‌లో 2023–25 బ్యాచ్‌కు ఘనంగా వీడ్కోలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ) పిజి స్టడిస్ స్కూల్లో 2023–25 బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన అధ్యాయానికి ముగింపు పలికిన ఈ వేడుకను అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహభరితంగా, సాంస్కృతిక వైభవంతో జరిపారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, సంగీతం, నృత్య ప్రదర్శనలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జూనియర్‌ల సృజనాత్మక ప్రదర్శనలు కార్యక్రమానికి ఉత్సాహాన్ని నింపగా, సీనియర్ల హృదయపూర్వక ప్రసంగాలు, అనుభవాల పంచుకోవడం భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రమేశ్వర్ రావు విద్యార్థులను అభినందిస్తూ ప్రేరణాత్మక సందేశం అందించారు. కష్టపడి పనిచేయడం, నిజాయితీ, నూతనత విలువలను ఆచరిస్తూ వృత్తి జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

# ప్రజల ప్రాణాలే ముఖ్యం

### అవసరమైతే ఎక్సైజ్ శాఖకు ఆయుధాలను ఇస్తాం
### ఎక్సైజ్ అధికారుల సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గంజాయి, డ్రగ్స్, నాటుసారా, ఎన్‌డిపిఎల్ నేరాలపై ఉక్కు పాదం మోపాలని ఎక్సైజ్ అధికారులను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. తమ ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలే ముఖ్యమని అవసరమైతే ఎక్సైజ్ సిబ్బందికి ఆయుధాలను ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో శనివారం ఎక్సైజ్ అధికారులతో జూపల్లి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రితోపాటు ప్రిన్సిపల్ సెక్రటరీ రీజ్వీ, ఎక్సైజ్ కమిషనర్ సి.హరి కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీంతో పాటు అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ..ఈ మేరకు మంచిగా పని చేసే వారికి గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలని మంత్రి అదేశించారు. నల్లబెల్లం తయారీ, అమ్మకాలు, వినియోగంపై పూర్తి స్థాయిలో అధ్యాయనం చేసి ఎక్సైజ్‌శాఖ పట్టుకున్న నల్లా బెల్లాన్ని రైతులకు సేంద్రియ ఎరువుల తయారీకి ఇవ్వడానికి అవసరమైన మార్గ దర్శకాలను తయారు చేయాలని అధికారులకు సూచించారు. నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను పట్టుకున్నప్పుడు వాటిని పగలగొట్టకుండా వినియోగించుకోవడానికి అవకాశాలను పరిశీలించాలని, జాతీయ ఉత్పత్తిగా గుర్తించి అమ్మకాలు చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయితోపాటు సింథాటిక్ డ్రగ్స్ తయారీ, అమ్మకాలు, రవాణ, వినియోగంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలిని మంత్రి సూచించారు. నాచారం, చర్లపల్లి లాంటి ఇన్‌లీగల్ పరిశ్రలను తనిఖీలు చేపట్టడానికి అవసరమైన కార్యచరణ తయారు చేసుకోవాలని సూచించారు. తాడి, ఈత చెట్లను పెంపకంతోపాటు వాటిని ఎక్కి కల్లు గీచే వృతికి యువత దూరంగా ఉన్నారని, కల్లును బ్రోవరీగా తయారు చేసే కంపెనీలు ఏర్పాటుపై చర్యలు పెట్టాలన్నారు. ఒకే బార్ లైసన్స్ పై ఎక్కువ బార్లు నడుపుతున్న ఆరోపణలు వస్తున్నాయని, ఫామ్ హౌస్‌లపై కూడ ప్రత్యేక నిఘా పెట్టాలని, బ్రాండి షాపుల సిట్టింగ్ రైమ్‌లపై నిబంధనలు పాటించాలా చర్యలు చేపట్టాలని, ఖాళీగా ఉన్న రైస్ మిల్లులను, ఇతర ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. ఎక్సైజ్ ఆదాయం తగ్గిందని, ఈ విషయంతో అన్ని చర్యలు తీసుకోవడానికి ఎక్సైజ్ స్టేషన్ల వారిగా బేరీజ్ వేస్తున్నామని ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు.

రానున్న దసరా సందర్భంగా ఎక్సైజ్ సెల్స్ పెరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఎన్‌డిపిఎల్, నాటుసారా తయారీ అమ్మకాలపై కఠినంగా వ్యవహరించడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం మంత్రికి తెలియజేశారు. ఈ సమావేశంలో అన్ని జి ల్లా డిప్యూటి కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు , ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టిఎఫ్,డిటిఎఫ్, టీమ్‌లు సమావేశంలో పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో రాగల రెండు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాగల రెండు రోజులు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగాగరెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు గంటకు 30–40 కి.మీ. వీస్తాయన్నారు.

## బూర్గుల రామకృష్ణారావు చిరస్మరణీయుడు : సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్. బూర్గుల రామకృష్ణారావు చిరస్మరణీయుడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బహు భాషావేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజనీతిజ్ఞుడిగా రాష్ట్రానికి అందించిన సేవలను శనివారం ఆయన వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. రెవెన్యూ మంత్రిగా వినోబా భావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించి భూ సంస్కరణలకు నాంది పలికారన్నారు. బూర్గుల రాజకీయం, న్యాయ వ్యవస్థలపై అవగాహన, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో విశిష్టమైన సేవలందించారని ఆయనను గుర్తుచేసుకున్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో దిగేందుకు సిద్ధం

### మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అధికార పార్టీలో ఆసక్తికరంగా మారింది. రోజు రోజుకు ఆశావహుల సంఖ్య పెరిగిపోతోంది. ఇక్కడి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన మహ్మద్ అజహరుద్దీన్‌కు ఎమ్మెల్సీ కోటాలో భర్తీ చేయగా, నియోజకవర్గ సీనియర్ నాయకులు గుర్రం మురళీ గౌడ్, నవీన్ యాదవ్, కార్పొరేటర్ సివిఎన్ రెడ్డిలు జూబ్లీహిల్స్ స్థానం కోసం పోటీ పడుతున్నారు. తాజాగా మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్ తాను సైతం బరిలో ఉన్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లో శనివారం విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన, తాను సికింద్రాబాద్ ఎంపిగా రెండు సార్లు గెలిచి, ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేశానని తెలిపారు. ప్రత్యేక నిధులు కేటాయించి నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేశానన్నారు. తనకన్నా కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు లేరని స్పష్టం చేసిన అంజన్ కుమార్, ఈ ఉపఎన్నికలో పోటీ చేయడానికి తాను అర్హుడినని చెప్పారు. యాదవ సామాజిక వర్గానికి రేవంత్ రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవి ఇవ్వాలని, అందుకోసం జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తనకు కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని పార్టీ అగ్రనాయకత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో యాదవ వర్గానికి మంత్రి పదవి లభించిన విషయాన్ని గుర్తు చేశారు. తన కుమారుడు అనిల్ కుమార్ యాదవ్‌ను యూత్ కాంగ్రెస్ కోటాలో రాజ్యసభకు పంపిన విషయాన్ని ప్రస్తావించిన ఆయన, నిరుద్యోగ సమస్యలపై అనిల్ పోరాటం చేసినట్లు తెలిపారు. తాము 'పారాషూట్ లీడర్లు' కాదని, కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేశామని అంజన్ కుమార్ అన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన తను, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అగ్రనాయకత్వాన్ని కోరారు. ప్రజల అభిప్రాయ సేకరణలో కూడా తన పేరు ముందుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## సిఎం ఆర్‌టిసిపై సమీక్ష నిర్వహించాలి

### ఆర్‌టిసి బోర్డ్ మాజీ డైరెక్టర్ నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల సంఘాల మద్దతుతో అధికారంలోకి వచ్చి 21 నెలలో కేవలం ఒకసారి మాత్రమే ప్రభుత్వం సమీక్ష నిర్వహించిందని ఆర్‌టిసి బోర్డ్ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. ప్రతిరోజూ 70 లక్షల మంది ప్రయాణికులతో మమేకమై, పల్లెలకు, పట్టణాలకు రవాణా కల్పిస్తూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్న ఆర్‌టిసి ఆదాయం, వ్యయం, లాభనష్టాలు, రుణాలు, ప్రభుత్వ చెల్లింపులు, కార్మికులకు చెల్లించాల్సిన రూ.7 వేల కోట్ల బకాయిలు, వాటి వడ్డీలు, స్వంత బస్సుల కొనుగోళ్లు, ప్రభుత్వ ఆర్థిక సహాయం, 7 వేల ఖాళీల భర్తీపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. హక్కుల పునరుద్ధరణ, సమస్యల పరిష్కారానికి దోహదపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నాగేశ్వర్ రావు విజ్ఞప్తి చేశారు.

## కష్టపడి పని చేస్తే పదవులు అవే వస్తాయి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం దీశగా నాయకులు దిశగా చర్యలు తీసుకోవాలని బిసి, సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన యూత్ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దీశ నిర్ధేశనం చేశారు. యువతకు ఇటు ప్రభుత్వం అటు పార్టీలోను తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నా.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కష్టపడిన వారికి పదవులతో పాటు అవకాశాలు లభిస్తాయన్నారు. తను ఎన్‌ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ తర్వాతే మార్క్ ఫేడ్ చైర్మన్ గా, ఎంపీగా ,ఇప్పుడు మంత్రి గా అవకాశాలు వచ్చాయని తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ సైతం ఎన్‌ఎస్‌యుఐ నుండి కష్టపడి పని చేయడతో నేడు ఆయనపీసీసీ చీఫ్‌తో పాటు ఎంఎల్‌సి లభించిందన్నారు. ప్రభుత్వం బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని, ఆ బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. చేపట్టారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో యూత్ కాంగ్రెస్ నేతలకు పదవులు వరిస్తాయన్నారు.

## హోర్డింగ్ ఏజెన్సీల సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసి ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం జిఓ.68ని రద్దు చేసి, హోర్డింగ్ ఏజెన్సీల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సిపిఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విజ్ఞప్తి చేశారు ఈ మేరకు శనివారం ఆయన సిఎంకు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ఔట్ రోడ్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ బృందంవారి సమస్యలను వివరిస్తూ సిపిఐ(ఎం) పార్టీకి వినతి పత్రం సమర్పించారని అందులోని వారి సమస్యలను ఈ లేఖ ద్వారా తమ దృష్టికి తీసుకు వస్తున్నామని వాటిని పరిష్కరించాల్సిందిగా సిఎంను కోరారు. గత జిహెచ్‌ఎంసి ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో "జీవో 68ని రద్దు చేసి, హోర్డింగ్‌లపై గత అధికార పార్టీ గుత్తాధిపత్యాన్ని తొలగించి వాటిపై ఆధారపడిన కుటుంబాల వారిని రక్షించి, చేయూతనిస్తాం" అని పేర్కొన్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 21 నెలలు దాటినా, ఆ దీశగా ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.ఇప్పటికైనా తక్షణమే 68 జీవోను రద్దు చేసి చిన్న, పెద్ద అనే తేడా లేకుండా హోర్డింగ్ ఏజెన్సీలను పునరుద్ధరించేందుకు జిహెచ్‌ఎంసీతో పాటు, తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీలకు కొత్త ప్రకటనల విధానాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా చిన్నచిన్న ఏజెన్సీలు కూడా వ్యాపారం చేసుకునేలా టెండర్ల ప్రక్రియ ఉండేలా చూడాలని సిఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు.

## ప్రతిభావంతులకు ప్రోత్సాహం

### 'పొన్నం సత్తయ్య పురస్కారం' అభినందనీయం

### ఇద్దరికి అవార్డులిచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల, జూపల్లి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్రంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి, వారిని మరింతగా ప్రోత్సహించే దిశగా ప్రతి ఏటా 'పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం – 2025 అందజేయడం అభినందనీయమని మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పొన్నం సత్తయ్య గౌడ్ 15వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం–25లను ప్రముఖ నవల రచయిత అంపశయ్య నవీన్‌కు, ప్రముఖ జానపద గాయని అంతడుపుల రమాదేవికి మంత్రులు అందజేశారు. అనంతరం వీరికి రూ.51వేల చొప్పున నగదు, మెమోంటో ఇచ్చి, సన్మానించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పొన్నం సత్తయ్య కష్టపడి పనిచేసే తత్వం గలవారని, క్రమశిక్షణ, నిజాయితీ, విలువలకు ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టారని, అది చూసేందుకు పొన్నం సత్తయ్య బతికి ఉంటే ఆయనెంతో ఆనందపడేవారని తెలిపారు. పొన్నం సత్తయ్య ఆలోచనలు ముందుకు తీసుకెళ్లేందుకు ముగ్గురు కుమారులు పొన్నం ప్రభాకర్, పొన్నం రవిచంద్ర, పొన్నం అశోక్, అక్కాచెల్లెళ్లు, మనవళ్లు, మనువరాలు కృషిచేస్తున్నారని, వారి ఉమ్మడి కుటుంబం నేటి సమాజానికి ఆదర్శనీయమన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ పొన్నం సత్తయ్య ఎంతో కాయకష్టం చేసి భూమిని నమ్ముకొని, వ్యవసాయం చేసి,వారి కుమారులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. బిసి వర్గాల్లో వెలుగులు నింపేలా 42శాతం రిజర్వేషన్ల అమలుకు పొన్నం ప్రభాకర్ చేస్తున్న కృషికి తాము అండగా ఉంటామని తెలిపారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కొనసాగితే సమాజానికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. పొన్నం సత్తయ్య కుమారులు ప్రయోజకులుకావడమే ఆయన జీవితం సార్థకత అయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్‌లు జ్ఞానేశ్వర్, చల్ల నరసింహారెడ్డి, జేరిపాటి జైపాల్, ఇనగాల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ ఆరేపల్లి మోహన్, బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి , బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బాలగోని బాలరాజుగౌడ్, బలగం కొమురక్క తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల పెండింగ్ బోధన, ఉపకార వేతనాలను

## తక్షణమే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, బీఈడీ, ఫార్మా, పాలిటెక్నిక్ తదితర వృత్తి విద్యా కోర్సుల విద్యార్థుల బోధన, ఉపకార వేతన రూ.8వేలకోట్ల ఫీజు బకాయిలను సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీనుంచి రాష్ట్రంలోని కాంగ్రెస్ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్(టిపిడిపిఎం), ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్ (ఫతీ) వృత్తి విద్యా కళాశాలలు చేపట్టనున్న కళాశాలల బంద్ కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. విద్యార్థుల బోధన, ఉపకారవేతన రూ.8వేలకోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి వై జంక్షన్ కూడలి వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మేంద్ర హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. బాలకృష్ణ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించి, అమలు చేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం,ఇప్పుడు అదే ప్రభుత్వం ఈ పథకానికి తూట్లు పొడుస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1400 ఇంటర్ కళాశాలల్లో 9లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, 944 డిగ్రీ కళాశాలల్లో 6లక్షల మంది విద్యార్థులు, 262 ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒక లక్షా 20వేల మంది విద్యార్థులు, 200 పీజీ కళాశాలల్లో 20వేల మంది విద్యార్థులు ఉన్నారని వీరిలో ప్రధానంగా ఉపకార వేతనాల మీదే ఆధారపడి ఉన్నత విద్య అభ్యసిస్తున్నారన్నారు. గత 4 ఏళ్లుగా సంక్షేమ విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారని వారు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి విడనాడి దసరా పండగ లోపేపెండింగ్ ఫీజులను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్ చేశారు.లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు కె. కళ్యాణ్,రాజ్ కుమార్, మహేష్, విశాల్, నితిన్,కార్తీక్, భరద్వాజ్, రాణా, నదీమ్, కిషోర్,ప్రభాకర్, సుధీర్ లతో పాటు 20మంది పాల్గొన్నారు.

## మైదానాల్లో నిరంతర క్రీడా కార్యక్రమాలు

### తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మైదానాలు నిరంతరం క్రీడా కార్యక్రమాలతో కళకళలాడే విధంగా తెలంగాణ స్పోరట్స్ అథారిటీ చొరవ తీసుకుంటుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం ఏమికల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న మొదటి ఆసియన్ టైక్వాండో ఓపెన్ ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివసేనరెడ్డి మాట్లాడుతూ, భారత దేశంలో పుట్టిన అనేక ప్రాచీన క్రీడల నుండి ఏర్పడే మార్షల్ ఆరట్స్ క్రీడలని, ఆసియా దేశాల్లో మార్షల్ ఆరట్స్ గేమ్స్ కు అత్యంత ఆదరణ ఉందని అన్నారు. సెల్ ఫోన్, లాప్ టాప్లతో సామాజిక మాధ్యమాల ఓరవడిలో కొట్టుకుపోతున్న విద్యార్థులు యువత డ్రగ్స్ గంజాయి కి బానిసలుగా మారుతున్న నేపథ్యంలో మార్షల్ ఆరట్స్ లో శిక్షణ వారిలో యువతలో ఆత్మరక్షణకే కాకుండా ఆత్మవిశ్వాసము పెంపొందింప చేస్తాయని అన్నారు. ఆతిధ్యానికి మారుపేరైన హైదరాబాద్ నగరంలో జాతీయ అంతర్జాతీయ పోటీలు నిర్వహించే సంస్థలకు తెలంగాణ క్రీడా శాఖ అవసరమైన మద్దతు తెలుపుతుందని అన్నారు. ఒక స్పష్టమైన సమగ్రమైన నూతన క్రీడ విధానాన్ని ప్రకటించి దాని పటిష్టంగా అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు క్రీడల్లో భాగస్వామ్యం అయ్యే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 13, 14 తేదీల్లో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ క్రీడా పోటీల్లో ఆసియా కు చెందిన 8 దేశాల నుండి దాదాపు 1,000 మంది టైక్వాండో క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎమికల్ స్పోరట్స్ అకాడమీ చైర్మన్ వీణా వాహిని, ఇంటర్నేషనల్ టైక్వాండో మాస్టర్ జయంత్ రెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు రవికుమార్, నరేష్, చందు, ఖాన్ సాహెబ్, ప్రేమ్ కుమార్ గౌడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇవిఎం వ్యవస్థతో ప్రజాస్వామ్య పునాదులు బలహీనం

### రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఎన్నికల నిర్వహణలో ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) వ్యవస్థ ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరిచే ప్రమాదం ఉన్నదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో నిపుణుల హెచ్చరికలను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఇసిఐ )పట్టించుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో కాన్‌స్టిట్యూషనల్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ (సిఆర్‌పిసి) జాతీయ కన్వీనర్ సంగటి మనోహర్ అధ్యక్షతన ఇవిఎం వ్యతిరేక జాతీయ ఉద్యమంలో భాగంగా "ఇవిఎం వద్దేవద్దు.. బ్యాలెట్ పేపరే ముద్దు" అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ డా.గాలి వినోద్‌కుమార్, బిఎల్‌ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్, రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు వి.జి.ఆర్. నారగోని, సిఆర్‌పిసి న్యాయవాది అమిన్ పిరా, తెలంగాణ సమన్వయకర్త బి.ఎన్.రత్న మీడియాతో మాట్లాడారు. ఇవిఎం హ్యాకింగ్ ట్యాంపరింగ్ లాంటి అడ్డదారుల్లో, అనైతిక, అనాగరిక, అప్రజాస్వామిక పద్ధతుల్లో గెలిచే తీరుకు స్వస్తిపలకాలని సూచించారు. నిస్వార్థ, నిజాయితీ, పారదర్శకత జవాబుదారీతనంతో కూడిన బ్యాలెట్‌తో ప్రజలు, ప్రజాస్వామ్యం గెలిచే ఎన్నికల కోసం పట్టుపడదామని పిలుపునిచ్చారు. సంగటి మనోహర్ మాట్లాడుతూ ఇవిఎం వ్యతిరేక జాతీయ ఉద్యమం అన్ని సమస్యలకు ప్రత్యామ్నాయమని, దీనిని మహోద్యమంగా మార్చుతామని తెలిపారు. సమావేశంలో మాల మహనాడు అధ్యక్షులు చెన్నయ్య, అన్వర్‌ఖాన్, మాస్టర్‌జీ, మహేశ్వర్‌రాజు, వివిధ రంగాల, వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు.

## 500 మంది ఉంటేనే గ్రామ పంచాయతీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఏదైనా ప్రత్యేక గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలంటే కనీస జనాభా 500 మంది ఉండితీరాలని హైకోర్టు నిబంధనలను గుర్తు చేసింది. ఎక్కవ జనాభా ఉన్నట్లుగా తప్పుడు గణాంకాలతో మంచిర్యాల జిల్లా వందూర్‌గూడ గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. రికార్డుల్లో 317 మంది జనాభా ఉన్నట్లు ప్రభుత్వ మోమో చెబుతోందని చెప్పింది. ఈ విధంగా చేసిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వీళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. వెంకటాపూర్ గ్రామ పంచాయతీని విభజించి వందూర్‌గూడను ఏర్పాటు చేయడంపై పునః పరిశీలని చేయాలని కూడా ఆదేశించింది.500 మంది కంటే జనాభా తక్కువగా ఉంటే గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయరాదని ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చింది. వందూర్‌గూడ విభజన చట్టవిరుద్ధమంటూ వెంకటాపూర్ గ్రామానికి చెందిన మోకాసి దౌలత్ రావు వేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా కొత్త పంచాయతీ ఏర్పాటైందని జీపీ నివేదించారు. విభజన నాటికి కొత్త పంచాతీయ జనాభా 613గా చూపినట్లు చెప్పారు. అయితే అధికారులు కోర్టు సమర్పించిన మెమోలో జనాభా 317గా పేర్కొనడంతో న్యాయమూర్తి పైవిధంగా ఉత్తర్వులను వెలువరించారు.

## జూబ్లీహిల్స్ స్థల స్వాధీనంపై వివరణ ఇవ్వండి

### హైడ్రా, జీహెచ్‌ఎంసీలకు హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ దగ్గర రూ.100 కోట్ల విలువైన రెండు వేల గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం విచారించింది. హైడ్రా, జీహెచ్‌ఎంసీలకు జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి నోటీసులు ఇచ్చారు. కౌంటర్ వేయాలని ఆదేశించారు. 1991 ఏడాది నాటి లేఔట్ ప్రకారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద జీహెచ్‌ఎంసీ పరిధిలోని 4.66 ఎకరాల స్థలంలో పార్కు, టెన్నిస్ కోర్టు ఉన్నాయి. సత్యనారాయణ అనే వ్యక్తి కబ్జా చేసి 2002 నుంచి నర్సరీ బిజినెస్ చేస్తున్నాడు. ఇటీవల జీహెచ్‌ఎంసీ హైడ్రా సహకారంతో స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ చర్యను సవాల్ చేస్తూ సత్యనారాయణ పిటిషన్ వేశారు. చట్ట వ్యతిరేకంగా హెడ్రా స్థలంలోకి వచ్చిందని, జీహెచ్‌ఎంసీ స్వాధీనం చెల్లదన్నారు. విచారణ ఈ నెల 19కి వాయిదా పడింది.

## న్యాయవాది ప్రతాప్ రెడ్డికి హైకోర్టు నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీనియర్ న్యాయవాది కె. ప్రతాప్ రెడ్డి (94)కి హైకోర్టు శ్రద్ధాంజలి ఘటించింది. చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ అధ్యక్షతన హైకోర్టు జడ్జీలు, అడ్వొకేట్లు, కోర్టు ఆఫీసర్లు సమావేశమై ప్రతాప్ రెడ్డికి సంతాపం తెలియజేశారు. చీఫ్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రసంగిస్తూ, ప్రతాప్ రెడ్డి న్యాయవ్యవస్థకు ఎనలేని సేవలు చేశారన్నారు. ప్రతాపరెడ్డి ఆఫీసులో పనిచేసి అడ్వొకేట్లు ఉన్నత స్థాయికి చేరారని, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు స్థాయికి ఎదిగారన్నారు. సమావేశం రెండు నిముషాలు మౌనం పాటించింది. ప్రతాప్ రెడ్డి టుంబసభ్యులు, ఏజీ సుదర్శన్‌రెడ్డి బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ ఇతరులు పాల్గొన్నారు

## కౌంటర్ వేయకపోతే కోర్టుకు రండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పీపుల్స్ వార్ గ్రూప్ దళ మెంబర్‌నాగవెల్లి మోహన్ పోలీసులకు లొంగిపోయిన తరువాత అప్పటి ఉమ్మడి ఏపీలో ప్రకటించిన సహాయక చర్యలు అమలు చేయకపోవడంతో అతని భార్య అరుణ హైకోర్టులో వేసిన పిటిషన్‌లో మెదక్ జిల్లా కలెక్టర్ 10 ఏండ్లుగా కౌంటర్ దాఖలు చేయకపోవడంపై న్యాయమూర్తి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గతంలో ప్రకటించినట్లుగా పిటిషనర్‌కు 5 ఎకరాల భూమి కేటాయింపు వ్యవహారంపై కౌంటర్ వేయకపోతే ఈ నెల 24న జరిగే విచారణకు కలెక్టర్ స్వయంగా కోర్టుకు రావాలని ఆదేశించారు. స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇస్తారా లేక కౌంటర్ వేస్తారా అని మెదక్ జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించారు. లొంగిపోతేఐదు ఎకరాల భూమి కేటాయింపుతో సహ పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో 1989లో మోహన్ లొంగిపోయాడు. భూమి కేటాయింపు చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. సదాశివపేటలో కొంత భూమిని కేటాయింపు గుర్తింపు జరిగింది. ఈ దశలో నక్సలైట్ కాల్పుల్లో మోహన్ మరణించాడు. భూమిని అతని భార్య నాగవెల్లి అరుణకు కేటాయించాలని పోలీసులు కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ విషయం 2004 నుంచి నలుగుతూనే ఉంది. చివరికి ఆమె 2015లో హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కలెక్టర్ కౌంటర్ వేయలేదని ఆమె లాయర్ చెప్పడంతో పైవిధంగా న్యాయమూర్తి ఆదేశించారు.

## లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం తెలంగాణలోని మేజిస్ట్రేట్ కోర్టు నుంచి హైకోర్టు వరకు లోక్ అదాలత్‌లు జరిగాయి. 11.08 లక్షల కేసులు పరిష్కారం అయ్యాయి. (ప్రిలిటిగేషన్ కేసులు 3.63 లక్షలు, కోర్టుల్లో పెండింగ్ 7.43 లక్షల కేసులు) పరిహారం కావడంతో రూ.595 కోట్లను పరిహార చెల్లింపునకు ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వరంలో జరిగిన లోక్‌అదాలత్‌లో రోడ్డు ప్రమాద బాధితుడికి 1.20 కోట్ల పరిహార ఉత్తర్వులు వెలువడ్డాయి ట్రైబ్యునల్ ప్రకటించిన రూ. 98. 30 లక్షల పరిహారాన్ని 8 శాతం వడ్డీతో రూ.1.20 కోట్లు చెల్లించేందుకు న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ ఒప్పుకుంది... అని స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి. శ్యాంకోశీ, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జస్టిస్ మౌసమీ భట్టాచార్య ఆధ్వర్యంలో జరిగిందన్నారు. హైకోర్టులో మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జి వి సీతాపతి, జస్టిస్ జి శ్రీదేవి పాల్గొని 180 కేసులను పరిష్కరించారు. 110 మందికి పరిహారంగా రూ. 12.16 కోట్లు చెల్లింపులు ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు.



## బల్హార్షా -సికింద్రాబాద్ సెక్షన్ తనిఖీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ శనివారం బల్హార్షా సికింద్రాబాద్ సెక్షన్ మధ్య రియర్ విండో తనిఖీ నిర్వహించారు. ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ గోపాలకృష్ణన్ ఆర్ ఉన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను సమీక్షించారు. ఆ విభాగంలోని కొన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్‌లను కూడా తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ప్రయాణీకుల సౌకర్యాలు, వసతులను ఆయన సమీక్షించారు. ఈ సంధర్భంలో గౌరవ సిర్పూర్ కాగజ్‌నగర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు స్టేషన్‌లో జనరల్ మేనేజర్‌ను కలిసి ఈ ప్రాంతంలో రైలు అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు. ఆ తరుఆవత మంచిర్యాల్ రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ప్రయాణీకుల సౌకర్యాలను సమీక్షించారు మరియు అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించి, నిర్మాణ స్థలంలో అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటించాలని అధికారులకు సూచించారు. జనరల్ మేనేజర్ రామగుండం రైల్వే స్టేషన్‌ను కూడా పరిశీలించారు, ప్రయాణీకుల సౌకర్యాలు మరియు స్టేషన్ యొక్క సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని కూడా ఆయన సమీక్షించారు. ఆయన సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ సైట్‌ను సందర్శించారు. తరువాత సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు, అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. జనరల్ మేనేజర్ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.


## డీనోటిఫైడ్ వివరాలివ్వండి– హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే నంబర్ 181/1, 181/2, 181/3లకు సంబంధించిన డీనోటిఫైడ్ వివరాలను పిటిషనర్‌కు ఇవ్వాలని తహసీల్దార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను అందుకున్న 30 రోజుల్లో డీనోటిఫైడ్ భూముల సర్టిఫైడ్ కాపీలను ఇవ్వాలని లేనిపక్షంలో ఎందుకు ఇవ్వడం లేదో కారణాలను పిటిషనర్‌కు తెలియజేయాలంది. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 (ప్రస్తుతం భారతీయ సాక్ష్య అధినియం–2023) ప్రకారం డీనోటిఫైడ్ చేసిన భూముల వివరాల సర్టిఫైడ్ కాపీ కోసం గత ఆగస్టు 11న దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఇవ్వలేదంటూ అమీర్‌పేట్‌కు చెందిన బీర్ల మహేష్ పిటిషన్ దాఖలు చేశారు. సర్వే నంబర్ 181 భూదాన్ భూమి అని, అందులో సర్టిఫైడ్ కాపీలు ఇవ్వలేదని చెప్పారు. దీనిపై శుక్రవారం జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ విచారించి తహసీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. పిటిషన్‌పై విచారణ క్లోజ్ చేశారు.

## న్యూజిలాండ్‌లో 50 వేలమందితో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

**ఆక్లాండ్ :** న్యూజిలాండ్ అతిపెద్ద నగరం ఆక్లాండ్‌లో శనివారం ఉదయం వేలాదిమంది ప్రజలు పాలస్తీనా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై కఠినమైన ఆంక్షలు విధించాలని న్యూజిలాండ్‌లోన సెంటర్–రైట్ ప్రభుత్వ పాలకులను ప్రదర్శకులు డిమాండ్ చేశారు. గాజాలో తక్షణం యుద్ధం నిలిపివేయాలని, సైన్యం వెనక్కు వెళ్ళిపోవాలని, గాజా ప్రజలకు తగినంత ఆహార సరఫరా చేసేందుకు ఐక్యరాజ్యసమితి సంస్థలను అధికారికంగా అనుమతించాలని నినాదాలు చేస్తూ మానవతావాద ప్రదర్శన జరిపారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన తర్వాత న్యూజిలాండ్‌లో ఇంతభారీ ప్రదర్శన జరగడం ఇదే మొదటిసారి. దాదాపు 50వేలమంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నట్లు పాలస్తీనా సంఘీభావ 'ఆయోటెరోవా సమూహం" సంస్థ తెలియజేసింది. పోలీసులు మాత్రం 20 మంది ప్రదర్శనలో పాల్గొన్నారని పేర్కొన్నారు.





# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## తాజ్ ప్యాలెస్ హోటల్‌కు బాంబు బెదిరింపు

### ఢిల్లీలో కలకలం..

**న్యూఢిల్లీ :** బాంబు బెదిరింపు మెయిల్స్ గత రెండు రోజులుగా కలకలం రేపుతున్నాయి. తాజాగా ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌కు కూడా బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని తనిఖీలు చేయగా ఎలాంటి బాంబు దొరకలేదు. దాంతో అది కూడా ఆకతాయి మెయిలేనని ఢిల్లీ పోలీసులు నిర్ధారించారు. కాగా, శుక్రవారం ఉదయం ఢిల్లీ హైకోర్టుకు గుర్తు తెలియని వ్యక్తులు బాంబు బెదిరింపు మెయిల్ చేశారు. ఆ ఘటనను మరువక ముందే మధ్యాహ్నం బాంబే హైకోర్టు కు కూడా అదే తరహా మెయిల్ వచ్చింది. బాంబులతో కోర్టును పేల్చేస్తామని పేర్కొన్నారు. కానీ పై రెండు ఘటనల్లో కూడా అవి ఆకతాయిలు చేసిన బెదిరింపు మెయిల్‌లు అని పోలీసుల విచారణలో తేలింది. భద్రతా సిబ్బంది బాంబ్ స్క్వాడ్స్‌తో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి బాంబులు లభ్యం కాలేదు.

## మణిపూర్‌ను శాంతి, శ్రేయస్సుకు చిహ్నంగా మారుస్తాం



### హింసను విడనాడాలని పలు సంస్థలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి

### కల్లోలిత రాష్ట్రంలో తొలిసారిగా పర్యటన

**చురాచంద్‌పూర్:** రెండు జాతుల మధ్య ఘర్షణలతో కల్లోలితంగా మారిన మణిపూర్‌లో ప్రధాని నరేంద్రమోదీ శనివారం తొలిసారి పర్యటించారు. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌లో నిర్వహించిన ర్యాలీల్లో పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు చురాచంద్‌పూర్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ తరువాత కుకి ప్రాబల్యం ఉన్న చురచంద్‌పూర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూహింసనువిడనాడాలనివివిధ సంస్థలకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం మణిపూర్ ప్రజలకు అండగా ఉందని,కలహాలతో నిండిన రాష్ట్రాన్ని శాంతి, శ్రేయస్సుకు చిహ్నంగా మార్చే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. మణిపూర్‌ను ఆశ, ఆకాంక్షల నేలగా కొనియాడారు. అయితే దురదృష్టవశాత్తు ఈ అందమైన ప్రాంతం హింసాత్మకంగా మారిందన్నారు. ఎక్కడైనా అభివృద్ధి వేళ్ళూనుకోవాలంటే శాంతి అవసరమని, గత 11 సంవత్సరాలలో ఈశాన్య ప్రాంతంలో అనేక సంఘర్షణలు, వివాదాలు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకుని, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. జాతి హింస చాలా కాలంగా కొనసాగుతున్నప్పటికీ రాష్ట్రాన్ని సందర్శించకపోవడంపై ప్రతిపక్షాల నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ప్రధానమంత్రి, కేంద్రం చేసిన ప్రయత్నాలు ఇప్పటికే ఫలితాలను ఇస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల కొండలు,లోయలో వివిధ గ్రూపులతో ఒప్పందాల కోసం చర్చలు జరగడాన్ని చూశామని, సంభాషణ, గౌరవం, పరస్పర అవగాహనకు ప్రాముఖ్యత ఇస్తూ శాంతిని నెలకొల్పడానికి భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఇవి భాగమేనన్నారు. 'భారత ప్రభుత్వం మణిపూర్ ప్రజలతో ఉంది. మణిపూర్‌ను శాంతి, శ్రేయస్సు, పురోగతికి చిహ్నంగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాము' అని ఆయన అన్నారు. హింస కారణంగా నిరాశ్రయులైన కుటుంబాల కోసం 7,000 కొత్త ఇళ్లను నిర్మించడానికి కేంద్రం మద్దతు ఇస్తోందని మోదీ చెప్పారు. ఇటీవల సుమారు రూ. 3,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఆమోదించామని, నిర్వాసితులకు సహాయం చేయడానికి రూ. 500కోట్లు ప్రత్యేకంగా కేటాయించామని ఆయన చెప్పారు. మణిపూర్ అభివృద్ధి కోసం, నిర్వాసిత కుటుంబాల పునరావాసం కోసం, శాంతి స్థాపన కోసం, భారత ప్రభుత్వం మణిపూర్ ప్రభుత్వానికి సాధ్యమైన అన్ని విధాలుగామద్దతుఇస్తూనేఉంటుందని పేర్కొన్నారు. గతంలో, కొండలు, గిరిజన ప్రాంతాలలో మంచి పాఠశాలలు, ఆసుపత్రులు కేవలం కల మాత్రమేనని, నేడు కేంద్రం ప్రయత్నాలతో ఈ పరిస్థితి మారుతోందన్నారు. చురచంద్‌పూర్‌లో ఇప్పుడు ఒక వైద్య కళాశాల స్థాపించబడిందన్నారు. మణిపూర్ అనే పేరుకే 'మణి' ఉంది. మరియు ఇది రాబోయే కాలంలో మొత్తం ఈశాన్యానికి ప్రకాశించే రత్నంగా మారుతుందని కొనియాడారు. మణిపూర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కేంద్రం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రయత్నంలో భాగంగా తాను ఇప్పుడు మీ అందరి మధ్య ఉన్నానన్నారు. ఇంఫాల్ నుండి రోడ్డు మార్గంలో చురాచంద్‌పూర్‌కు దాదాపు 60 కి.మీ. దూరం ప్రయాణించి తనకు లభించినప్రేమనుతానుఎప్పటికీమరచిపోలేనని అన్నారు.

### హింస బాధితులకు మోదీ పరామర్శ

మణిపూర్ జాతి హింస కారణంగా నిరాశ్రయులైన ఒక వర్గం ప్రజలను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఇంఫాల్‌లో పరామర్శించినట్లు అధికారులు తెలిపారు. ఇంఫాల్‌లోని చారిత్రాత్మక కాంగ్లా ఫోర్ట్ కాంప్లెక్స్‌లో అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తుల (ఐడిపిఎస్) కుటుంబాల ఆందోళనలను మోదీ విని, రాష్ట్రంలో శాంతి, సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి కేంద్రం నిబద్ధత గురించి వారికి హామీ ఇచ్చారని వారు తెలిపారు. అంతకు ముందు కూడా చురాచంద్‌పూర్‌లోని శాంతి మైదానంలో నిరాశ్రయులైన ప్రజలతో ప్రధాని సంభాషించారని అధికారులు తెలిపారు. జాతి హింస 60,000 మందికి పైగా, కుకిజోకమ్యూనిటీకి చెందిన దాదాపు 40,000 మందిని, దాదాపు 20,000 మంది మెయిటీలను నిరాశ్రయులను చేసింది. చాలా మంది రాష్ట్రం వెలుపలకు వెళ్లినప్పటికీ, వారిలో ఎక్కువ మంది ఎటువంటి గోప్యత, ఆదాయ వనరులు లేకుండా పేలవమైన జీవన పరిస్థితులలో సహాయ శిబిరాల్లో నివసిస్తున్నారు. కొవ్వొత్తులు, ధూపం తయారీతో సహా నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని నిరాశ్రయులైన వారి జీవితాలను మెరుగుపరిచేందుకుప్రభుత్వం ప్రయత్నిస్తోందని అధికారులు తెలిపారు.

## మణిపూర్‌లో మోదీ పర్యటన 'టోకనిజం'

### రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** కల్లోలితమైన మణిపూర్‌లో ఇన్ని రోజులకు ప్రదాని మోదీ పర్యటించడంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది. మోదీ పర్యటనను 'పిట్ స్టాప్' అని అభివర్ణించింది. ఈ పర్యటన 'టోకనిజం', రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం అని ఆరోపించింది. మోదీ తనకు తానుగా గొప్ప స్వాగత వేడుకను నిర్వహించుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఈ చర్య ఇప్పటికే బాధపడుతున్న వారి గాయాలపై క్రూరంగా గుచ్చడంలాంటిదేనన్నారు. మోదీ మాటల్లోనే మాట్లడితే రాజధర్మం ఎక్కడిందని ఆయన పర్యటనకు ముందు ఖర్గే ఎక్స్ వేదికంగా ప్రశ్నించారు. 'నరేంద్ర మోదీ జీ, మణిపూర్‌లో మీ 3 గంటల పిట్ స్టాప్ కరుణ కాదు, ఇది ప్రహసనం, టోకనిజం, గాయపడిన రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం. ఇంఫాల్, చురాచంద్‌పూర్‌లలో మీరు నిర్వహిస్తున్న రోడ్‌షో సహాయ శిబిరాల్లోని ప్రజల కేకలు వినకుండా పిరికితనంతో తప్పించుకోవమే తప్ప మరొకటి కాదు!' అని కాంగ్రెస్ చీఫ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 864 రోజుల హింసలో 300 మంది ప్రాణాలు కోల్పోగా, 67,000 మంది నిరాశ్రయులయ్యారని, 1,500 మందికి పైగా గాయపడ్డారన్నారు. అప్పటి నుండి మోదీ 46 విదేశీ పర్యటనలు చేసారు కానీ, స్వదేశీ పౌరులతో రెండు మాటలు సానుభూతి వ్యక్తం చేయడానికి మణిపూర్‌లో పర్యటించలేకపోయారని ఖర్గే దుయ్యబట్టారు. ఎన్నికల కోసం 2022 లో మోదీ చివరిసారిగా పర్యటించారా? డబుల్ ఇంజిన్ సర్కార్ మణిపూర్ అమాయక జీవితాలను బుల్డోజర్ చేసిందని మండిపడ్డారు. మణిపూర్‌లో హింస ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత బిజెపిదేనని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మళ్ళీ దిగజారిపోతోందని విమర్శించారు. 'జాతీయ భద్రత, సరిహద్దు గస్తీ బాధ్యత మీ ప్రభుత్వానిదే అని మర్చిపోకూడదు. ఈ నిశ్శబ్దంగా ఆగడం పశ్చాత్తాపం కాదు. ఇది అపరాధ భావన కూడా కాదు. మీరు మీ కోసం ఒక గొప్ప స్వాగత వేడుకను నిర్వహిస్తున్నారు. మీరు ప్రాథమిక రాజ్యాంగ బాధ్యతలను విస్మరించడం వల్ల ఇప్పటికీ బాధపడుతున్న వారి గాయాలపై ఇది క్రూరంగా గుచ్చడమే' అని ఖర్గే అన్నారు.

### ఘర్షణ మొదలై రెండేళ్ల తరువాత పర్యటనా? : ప్రియాంక



మోదీ మణిపూర్ పర్యటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాకాగాంధీ కూడా విమర్శలు చేశారు. రెండు సంవత్సరాల మోదీ తర్వాత మణిపూర్ సందర్శించడం మంచిందని నిర్ణయించుకున్నందుకు సంతోషంగా ఉందని, అయితే ఆయన చాలా కాలం ముందే వెళ్లి ఉండాల్సింది ఉందన్నారు. ఆ రాష్ట్రంలో చెలరేగిన హింస చాలా కాలం పాటు కొనసాగడానికి, అనేక మంది ప్రాణాలు పోవడానికి అనుమతించడం దురదృష్టకరమన్నారు. భారతదేశంలో ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదని ప్రియాంక దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ కూడా ప్రధానమంత్రి పర్యటనను తీవ్రంగా విమర్శించారు. తనకు తానుగా ఉనికి కాపాడుకునే చర్యే అని ఆయన అభివర్ణించారు. ప్రస్తుతం మోదీ మణిపూర్ పర్యటన ఒక నాయకుడిలో ఎంత సానుభూతి, కరుణ లోపించిందో అవగతమవుతుందన్నారు. 2023 నుండి మణిపూర్ మండుతుంటే రెండున్నర సంవత్సరాల తరువాత ఇప్పుడు మోదీకి పర్యటించడానికి సమయం దొరికిందా అని ఎద్దేవా చేశారు. అయితే ఇప్పుడు కూడా సంపూర్ణంగా పర్యటించలేదని, ఎదే హడావిడిగా పని కానిచ్చారన్నారు. అంతర్యుద్ధానికి కారణాలను కనుగొని సమస్యను పరిష్కరించడానికి మోదీ ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపలేదని, ఘర్షణ పడుతున్న రెండు జాతులను ఏకతాటిపైకి తెచ్చే ధైర్యం చేయలేకపోయారన్నారు. శాంతి కోసం నిజమైన ప్రయత్నం చేయలేదని ఆయన అన్నారు. అయితే ఈ పర్యటనను ఇతర ప్రజా సంబంధాల కార్యక్రమం లాగానే చూస్తున్నారన్నారు.

## ఓటు బ్యాంకు రాజకీయాలతో 'ఈశాన్యం'కు తీవ్ర నష్టం

### మిజోరాం నేడు దేశ వృద్ధి ఇంజిన్‌గా రూపాంతరం చెందింది : ప్రధాని

**ఐజ్వాల్ :** గతంలో ఈశాన్య ప్రాంతం ఈశాన్య ప్రాంతం 'ఓటు బ్యాంకు' రాజకీయాల వల్ల తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కానీ ఇప్పుడు కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ కృషి కారణంగా దేశ వృద్ధి ఇంజిన్‌గా రూపాంతరం చెందిందన్నారు. శనివారం మోదీ మిజోరాంలో పర్యటించారు. 2014లో ప్రధానమంత్రి అయిన తర్వాత మోదీ మిజోరంలో పర్యటించడం ఇది రెండవసారి. కాగా, శనివారం ఆయన రూ.9,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. భారీ వర్షం కారణంగా నగరం నడిబొడ్డున ఉన్న లామ్మువల్ గ్రౌండ్‌కు చేరుకోలేకపోయినందున ఐజ్వాల్ సమీపంలోని లెంగ్‌పుయ్ విమానాశ్రయం నుండి వర్చువల్‌గా ప్రజా ర్యాలీలో పాల్గొన్నారు. ఐజ్వాల్, ఢిల్లీ మధ్య తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను, రైలు, రహదారులు, ఇంధనం, క్రీడా మౌలిక సదుపాయాలను పెంపొందించే ఇతర వ్యూహాత్మక ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు అనుసరించే ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా ఈశాన్య ప్రాంతం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అయితే గతంలో అణగదొక్కబడిన ప్రాంతాలు ప్రస్తుతం ప్రధాన స్రవంతిలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. గత 11 సంవత్సరాలుగా ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కేంద్రం కృషి చేస్తున్నందున మిజోరం ఇప్పుడు దేశ వృద్ధికి కీలక చోదకంగా ఉద్భవించిందని మోదీ పేర్కొన్నారు. కేంద్ర'యాక్ట్ ఈస్ట్' విధానంలో మిజోరం ప్రధాన పాత్ర పోషిస్తుందని, కలడాన్ మల్టీమోడల్ ట్రాన్సిట్ ప్రాజెక్ట్, రైల్వే లైన్లు రాష్ట్రాన్ని ఆగ్నేయాసియాతో కలుపుతాయని చెప్పారు. మిజోరంను పూర్తిగా దేశ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించిన రూ. 8,070 కోట్ల బైరాబి–సైరాంగ్ లైన్‌ను ఆవిష్కరించిన ప్రధాని, 51.38 కి.మీ. పొడవైన మార్గం రాష్ట్ర రాజధాని ఐజ్వాల్‌ను ప్రధాన మహానగరాలతో అనుసంధానిస్తుందని, ఇది రాష్ట్రానికి చారిత్రాత్మక రోజు అని అన్నారు. ఐజ్వాల్‌ను ఢిల్లీ, గువహాడి, కోల్‌కతాతో అనుసంధానించే మూడు కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా ప్రధాని ప్రారంభించారు.

## హిమాచల్‌లో మళ్లీ క్లౌడ్‌బరస్ట్

### శిథిలాల్లో చిక్కుకుపోయిన వాహనాలు

### దెబ్బతిన్న పంటలు



**సిమ్లా :** గత కొన్ని రోజులుగా క్లౌడ్ బరస్ట్ ఘటనలతో హిమాచల్ ప్రదేశ్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కోలుకోలేని స్థితిలోకి చేరుకుంటోంది. తాజాగా శనివారం కూడా రాష్ట్రంలో మరోసారి మేఘా విస్పోటనం సంభవించింది. బిలాస్‌పూర్ జిల్లాలో శనివారంతెల్లవారుజామున సంభవించిన మేఘాల విస్ఫోటనం కారణంగా అనేక వాహనాలు శిథిలాల కింద కూరుకుపోయాయని, పంటలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. అయితే నైనా దేవి అసెంబ్లీ నియోజకవర్గంలోని గుత్రాహన్ గ్రామంలో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సంభవించిన మేఘాల విస్పోటనంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. వ్యవసాయ భూములపై చెల్లాచెదురుగా ఉన్న చెత్త వరదలతో కొట్టుకుపోయిందని తన భూమి, పంటలు పూర్తిగా దెబ్బతిన్న ఓ గ్రామస్థుడు కాశ్మీర్ సింగ్ తెలిపారు. నాలుగు వాహనాలు శిథిలాల కింద కూరుకుపోయాయని, పంట నష్టాన్ని అంచనా వేస్తున్నామని,నివేదిక అందిన తర్వాత సహాయం అందిస్తామని బిలాస్‌పూర్ డిప్యూటీ కమిషనర్ రాహుల్ కుమార్ తెలిపారు. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వీలైనంత త్వరగా ట్రాఫిక్‌ను పునరుద్ధరించడానికి ప్రజా పనుల శాఖ శిథిలాలను తొలగించడం ప్రారంభించింది. చంబా జిల్లాలో ఉన్న భట్టియాట్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మామల్, కమ్లారి గ్రామాల్లో వరద నీరు, శిథిలాలతో ఇళ్లు దెబ్బతిన్నట్లు నివేదికలు అందాయన్నారు. సిమ్లా రాష్ట్ర రాజధానిలో పొగమంచు కారణంగా కొన్ని మీటర్ల వరకు దృశ్యాలు కనిపించలేదు. దీంతో వాహనదారులకు తీవ్ర అసౌకరం కలిగింది. శని, ఆదివారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కార్యాలయం ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మితమైన వర్షాలుకురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం నుండి పాలంపూర్‌లో 86 మి.మీ వర్షం కురిసింది.మురారి దేవిలో 69.2 మి.మీ, కాంగ్రా 58.2 మి.మీ, జోగిందర్‌నగర్ 45 మి.మీ, అఘర్ 16.8 మి.మీ, నైనా దేవి 16.6 మి.మీ, ధర్మశాల 14.8 మి.మీ, మండిలో 13.6 మి.మీ. వర్షం పడింది. జాతీయ రహదారి–3లోని అట్టారిలేహ్ స్ట్రెచ్, ఎన్‌హెచ్ 305లోని ఔట్‌సైంజ్ సెక్షన్, ఎన్‌హెచ్–503ఎలోని అమృత్‌సర్–భోటా స్ట్రెచ్‌తో సహా మొత్తం 577 రోడ్లు శనివారం ఉదయం మూసివేయబడ్డాయి. ఇటీవల వరదలుష కొండ చరియలు విరిగిపడటం కారణంగా రాష్ట్రంలో దాదాపు 389 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లుష 333 నీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఒసి) తెలిపింది.జూన్20నరాష్ట్రంలోరుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుండి వర్ష సంబంధిత ఘటనలు, రోడ్డు ప్రమాదాలలో మొత్తం 386మంది మరణించారు.ఇప్పటివరకు, రాష్ట్రం రూ.4,465 కోట్ల నష్టాన్ని చవిచూసిందని అధికారులు తెలిపారు.

## సొంతింటి కల కాపాడేందుకు 'ప్రత్యేక నిధి' ఏర్పాటుపై యోచన చేయండి

### అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్ని పరిశీలించండి

### కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన



**న్యూఢిల్లీ :** పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించి, దాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది.

### మౌన ప్రేక్షకుడిగా ఉండొద్దు..

రెరాను కోరలు తీసిన పులిగా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలు అవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది. గృహ కొనుగోలుదారులు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ లేదా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో ఓ సంస్థను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.

## కొండచరియల బాధితులను పునరావాస జాబితాలో చేర్చేందుకు కృషి

**వయనాడ్ :** కేరళలో 2024లో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగి పడిన విషయం తెలిసిందే. అయితే ముందక్కై–చూరల్‌మలలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కొందరని తుది పునరావాస జాబితాలో చేర్చకపోవడంపై జిల్లా అధికారులతో చర్చలు జరిపినట్లు కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం తెలిపారు. గురువారం నుంచి తన నియోజకవర్గంలో పర్యటిస్తున్న ప్రియాంకా గాంధీ శనివారం వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తనను కలిసిన బాధితులు లేవనెత్తిన సమస్యలు నిజమైనవని, జిల్లా కలెక్టర్ మేఘశ్రీ డిఆర్‌కు కూడా ఆ విషయం తెలుసునన్నారు. డిసికి సమస్యల గురించి బాగా తెలుసని, ఆమె తన వంతు కృషి చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. తాను కూడా ప్రయత్నిస్తున్నట్లు ప్రియాంక చెప్పారు. అధికార యంత్రాంగం ద్వారా వారు ఏమి చేయగలరో, ఏది సాధ్యం కాదో దానికి తాము సహాయం చేస్తామన్నారు. జీవించి ఉన్నవారు చాలా నిర్దిష్టమైన ప్రత్యేక సమస్యలను లేవనెత్తారన్నారు. ఉదాహరణకు భూమిని కోల్పోయిన వారు, తుది జాబితాలో చేర్చబడని వారు, మునుపటి జాబితాలో ఉన్నప్పటికీ, వారు ఏదో ఒక కారణం లేదా నిర్దిష్ట ప్రమాణాల కారణంగా తుది జాబితాలో లేకుండా పోయారన్నారు. తుది జాబితాలో నుండి మినహాయించబడిన వారిని కాంగ్రెస్ పార్టీ నిర్మిస్తున్న వంద ఇళ్లలో చేర్చుతామని ప్రియాంక హామీ ఇచ్చారు. జూలై 2024లో వయనాడ్‌లోని ముందక్కై–చూరల్‌మల ప్రాంతంలో సంభవించిన కొండచరియలు విరిగిపడటం 200 మందికి పైగా ప్రాణాలను బలిగొంది. వందలాది ఇళ్ళను ధ్వంసం చేసింది.

## చైనా–రష్యాలపై 100 శాతం సుంకాలు వేద్దాం రండి

### నాటో మిత్రులకు ట్రంప్ పిలుపు

### రష్యాను తిడుతూ వాళ్ళ చమురు కొంటారెందుకు?

**బాస్కింగ్ రిట్జ్ :** రష్యా–చైనాలపై 50 నుండి 100 శాతం మేరకు సుంకాలు వేద్దామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాటో కూటమి దేశాలకు సాహసోపేతమైన ప్రతిపాదన చేశారు. కొన్ని నాటో దేశాలు రష్యా నుండి చమురు కొనుగోలు చేయడం ఆపినప్పుడే ఉక్రేన్‌లో జరుగుతున్న ప్రాణాంతకమైన యుద్ధాన్ని నివారించగలమని అన్నారు. నాటో దేశాలు ఐక్యంగా స్పందించేందుకు సిద్ధంగా ఉండి కలిసొస్తే భారీ సుంకాలు విధించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. చమురు కొనుగోళ్ళు నిలిపివేత, సుంకాలు–ఆంక్షల ఒత్తిడి రెండూ కలిస్తే యుద్ధం ఆపేందుకు చాలా గొప్ప సహాయకారిగా ఉంటాయన్నారు. నాటో దేశాలు త మ బలహీనతల నుండి బయట పడాలని కోరారు. చైనా, భారత్ తర్వాత రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్న మూడో అతిపెద్దదేశం టర్కీ, నాటో కూటమిలో సభ్యదేశంగా ఉంది. తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా శనివారం ఉదయం ట్రంప్ ఒక పోస్టింగ్ పెడుతూ, కొన్ని నాటో సభ్యదేశాలు భారీగా రష్యా చమురు కొనుగోలు చేయడం తనకు దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారు. రష్యా నుండి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ట్రంప్ ఇప్పటికే భారత్‌పై 25 శాతం పెనాల్టీ సుంకం వేశారు. ఉక్రేన్‌పై దాడులు ఖండిస్తూ, రష్యాపై నిత్యం విమర్శలు చేస్తున్నాగానీ ఆ దేశం నుండి చమురు కొనుగోళ్ళను ఆపేందుకు ఎందుకు ఇష్టపడటం లేదని నిలదీశారు. ఆంక్షలు విధించేందుకు తాను సిద్ధంగా ఉన్నాననీ, కానీ నాటో మిత్రదేశాలు కలిసి వచ్చినప్పుడు మాత్రమే ఆ చర్యలు తీసుకోగలుగుతానని తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ఈ వైఖరి నాటో వాదనను అంతర్జాతీయంగా బలహీనపరుస్తుందన్నారు. ఇలాంటి ఆటంకాలవల్ల రష్యాతో సంప్రదింపులు చేసేటప్పుడు బలహీన స్థితికి దిగజారిపోవాల్సివస్తుందని, చర్చల్లో పైచేయి సాధించడం కష్టమవుతుందని హెచ్చరించారు. తన కంటే ముందు అధ్యక్షుడుగా పనిచేసిన డెమోక్రాట్లకు చెందిన జో బైడెన్‌తో పాటు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపైన కూడా యుద్ధ బాధ్యతలు పడ్డాయని తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు తప్ప రష్యా అధ్యక్షుడు పుతిన్ పేరును మాత్రం ప్రస్తావించలేదు. ఉక్రేన్‌పై రష్యా సంధించిన డ్రోన్లు పొరపాటున పోలెండ్ దేశ సరిహద్దులోకి దూసుకురావడంతో ఆ దేశ సైన్యం రష్యా డ్రోన్లను కూల్చివేసింది. ఉద్దేశపూర్వకంగానే రష్యా తమ దేశంలోకి డ్రోన్లు ప్రయోగించిందని పోలెండ్ ఆరోపిస్తుండగా, పొరపాటు జరిగిందని, కావాలని డ్రోన్లు ప్రయోగించలేదని రష్యా వివరణ ఇచ్చినప్పటికీ నాటో కూటమి దేశాలు రష్యాపై విమర్శలు చేయడం ప్రారంభించాయి. ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్ పైవిధంగా స్పందించారు. ''రష్యాపై చైనాకు చాలా గట్టి ఆధిపత్యం ఉంది, అంతేకాకుండా రష్యాను చైనా తన పిడికిట్లో బిగించి ఉంచింది, ఈ పిడికిలి బంధం విడదీసి ఈ రెండు దేశాలను బలహీనపరచాలంటే ఈ సాహసోపేత చర్యలు తీసుకోక తప్పదని అన్నారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగిసే వరకూ రష్యా–చైనా దేశాలపై యాభై నుండి 100 శాతం వరకూ పూర్తిస్థాయి సుంకాలు విధిద్దాం, యుద్ధం ముగిశాక, సరైన ఒప్పందాలు కుదిరిన తర్వాత ఆ సుంకాలు ఉపసంహరించుకుందాం అని ప్రతిపాదించారు. రష్యా–చైనాలను అదుపుచేసే విషయంలో నాటో దేశాలకున్న చిత్తశుద్ధి నూటికి నూరుశాతం కంటే చాలా తక్కువగా ఉందన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని సవరించే ముసాయిదా బిల్లుకు... కేరళ రాష్ట్ర కేబినెట్ ఆమోదం

### వన్యప్రాణి దాడి విషయం నివేదిస్తే చంపే ఆదేశాల జారీ అధికారం చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌కే

### కేంద్ర చట్టానికి ఒక రాష్ట్రం సవరణ చేయడం దేశంలోనే ఇది మొదటిసారని 'సిఎంఒ' ప్రకటన




**తిరువనంతపురం :** రాష్ట్రంలో పెరుగుతోన్న మానవజంతు సంఘర్షణలను తగ్గించే లక్ష్యంతో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని సవరించే ముసాయిదా బిల్లును కేరళ రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక మంత్రి మండలి సమావేశం జనావాస ప్రాంతంలోకి ప్రవేశించి ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపరిచే ఏ వన్యప్రాణిని అయినా వెంటనే చంపమని ఆదేశించడానికి చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌కు అధికారం ఇచ్చే ముసాయిదా చట్టానికి ఆమోదం తెలియజేసిందని అధికారవర్గాలు వెల్లడించాయి. 'కేంద్ర చట్టానికి ఒక రాష్ట్రం ఇలాంటి సవరణ చేయడం ఇదే మొదటిసారి' అని ముఖ్యమంత్రి కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. 'వన్య ప్రాణుల సంరక్షణ (సవరణ) బిల్లు2025ముసాయిదాను కేబినెట్ ఆమోదించింది. ఈ బిల్లు కేంద్ర వన్యప్రాణుల (సంరక్షణ) చట్టానికి సవరించడానికి ప్రయతిస్తోంది. ఒక కేంద్ర చట్టానికి ఒక రాష్ట్రం ఇలాంటి సవరణ తీసుకురావడం దేశంలోనే ఇది మొదటిసారి' అని ఆ ప్రకటన తెలిపింది.అనంతరం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఎ.కె.శశీంద్రన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక విధానాలలో, కేంద్ర చట్టంలో అసాధ్యమైన, సమయం తీసుకునే విధానాలను నివారించడానికి బిల్లులోని విధానాలుసహాయపడతాయన్నారు.ముసాయిదా బిల్లు ప్రకారం వన్యప్రాణుల జాతులను రక్షించడానికి ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేవని మంత్రి ససీంద్రన్ వెల్లడించారు. వన్యప్రాణుల దాడిలో ఎవరైనా గాయపడినప్పుడు ఆ విషయాన్ని చీఫ్ వైల్డ్‌లైఫ్‌వార్డెన్‌కు నివేదించినట్లయితే, వారు ఇతర పనులకు సమయాన్ని వృథా చేయకుండా వన్యప్రాణులను చంపడం వంటి అవసరమైన చర్యలు చేపట్టే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. ప్రస్తుతం షెడ్యూల్IIలో ఉన్న ఏదైనా జంతువు సంఖ్య అదుపులేకుండా ఉన్నట్లు తేలితే దానిని ఒక క్రిమికీటకంగా ప్రకటించే అధికారం కేంద్ర చట్టానికి ఉందని కేరళ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ససీంద్రన్ చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం కల్పించడానికి ప్రస్తుత ముసాయిదా బిల్లులో ఒక నిబంధన జోడించబడిందని ఆయన వివరించారు. ఒకసారి క్రిమికీటకంగా ప్రకటించబడిన తర్వాత ఆ నిర్దిష్ట వన్యప్రాణిని ఎవరైనా తమకు కావాల్సిన విధంగా చంపవచ్చు అని ససీంద్రన్ ముసాయిదా బిల్లులోని నిబంధనను మరింతగా విపులీకరించారు. దాని మాంసం తినడానికి కూడా ఎటువంటి అడ్డంకి ఉండదని మంత్రి ససీంద్రన్ చెప్పారు. మానవ ఆవాసాలలోకి అడవి జంతువులుచొరబడటాన్నిఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లను ఉదహరిస్తూ కేంద్ర చట్టాన్ని సవరించాలని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చిన కొన్ని నెలల తర్వాత కేరళ మంత్రివర్గం వన్యప్రాణుల (రక్షణ) చట్టాన్ని సవరించడానికి ముసాయిదా బిల్లును ఆమోదించింది. మానవ ప్రాణాలను కాపాడటం, వన్యప్రాణులతో సంఘర్షణలను నివారించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాముఖ్యతను ఇస్తుందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ బిల్లు రాజకీయ ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సమస్యను శాశ్వత పరిష్కారంగా పరిగణించవచ్చు. సమస్య చాలాకాలంగా రాష్ట్రంలోని ఉన్నతస్థాయి ప్రజలు పెండింగ్‌లో ఉంచుతున్న నేపథ్యంలో పినరయి విజయన్ మంత్రిమండలి తీసుకున్న నిర్ణయం రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయనుంది.

## నిరంకుశత్వం, మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు

# విస్తృత వామపక్ష ఐక్యత

### చండీఘడ్‌లో జరిగే సిపిఐ 25వ మహాసభలో ఎజెండా రూపొందించే అవకాశం



డి. రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

2014 సార్వత్రిక ఎన్నికలలో బిజెపి సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి రావడం అనేది కేవలం ఒక ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం నుండి మరొక ప్రభుత్వానికి అధికార మార్పిడి మాత్రమే కాదు. ఇది మన రాజకీయ వ్యవస్థ స్వభావంలో ఒక గుణాత్మక మలుపును సూచించింది. బిజెపి అనేది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) రాజకీయ విభాగం. ఈ సంస్థ భారత రాజ్యాంగం, దాని సమ్మిళిత విలువ పట్ల వ్యతిరేకతను కలిగి ఉంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర లేకుండా, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్ట్ నమూనాల నుండి స్ఫూర్తి పొంది, మన ప్రజాస్వామ్య గణతంత్రాన్ని మతం, కులం, వర్గం, లింగ అసమానతలు ప్రాతిపదికగా మతపరమైన హిందూ రాజ్యంగా మార్చాలని బహిరంగంగానే కోరుకుంటుంది. ఈ వినాశకర ప్రణాళికకు వ్యతిరేకంగా, కమ్యూనిస్టు, విస్తృత వామపక్ష ఉద్యమం నిరంతరం సైద్ధాంతిక ప్రతిఘటనకు, ప్రత్యామ్నాయానికి ఆధారంగా నిలిచింది. అయినప్పటికీ, వామపక్షాలలో ఐక్యత, గట్టి బంధం లేకపోవడం పూర్తి స్థాయి ప్రతిఘటన శక్తిని కొన్నిసార్లు బలహీనపరిచింది.

నిరంకుశ ధోరణులు పెరగడం, వినాశకరమైన నయాఉదారవాద ఆర్థిక విధానాలు కదం తొక్కడం, మత విభజనలకు ఉద్దేశ్యపూర్వకంగా పదునుపెట్టడం, ఫాసిస్ట్ పోకడలు పెరగడంతో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వానికి విలువ ఇచ్చే వారందరికీ ఇది ఒక ఆందోళనకరమైన రాజకీయ పరిస్థితిని సృష్టించింది. వనరులు, వ్యవస్థలపై పాలక వర్గం పట్టును బిగిస్తున్న సమయంలో పేదలు, కార్మిక వర్గం, రైతులు, అణగారిన వర్గాలు తీవ్రమైన అభద్రతను ఎదుర్కొంటున్నాయి.

### ఐక్యత చారిత్రక ఆవశ్యకత

ఇలాంటి సమయంలో వామపక్ష ఐక్యత అనే ప్రశ్న మరోసారి కొత్తగా ఆవశ్యకత సంతరించుకుంది. భారతదేశంలో వంద సంవత్సరాల పోరాట, త్యాగాల వారసత్వం కలిగిన కమ్యూనిస్టు ఉద్యమానికి వామపక్ష ఐక్యత అనేది ఒక ఎత్తుగడ సౌలభ్యం కాదు, ఇదొక చారిత్రక ఆవశ్యకత. ఈ ఐక్యత అవసరం వివిధ రాష్ట్రాలలోని కార్యకర్తల గొంతులలో, అలాగే సానుభూతిపరులు, మేధావుల ఆకాంక్షలలో స్పష్టంగా కనిపిస్తుంది. వారందరూ, తమ తమ మార్గాలలో వామపక్షాలు దగ్గరవ్వాలని కోరుతున్నారు.

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ మూలాలు జాతీయ విముక్తి పోరాట కాలం నాటివి. రష్యాలో అక్టోబర్ విప్లవం నుండి ప్రేరణ పొంది, వలస పాలనలో ప్రత్యక్ష దోపిడీకి గురైన అనుభవం నుంచి, యువ విప్లవకారులు, కార్మికులు, వారి నాయకులు తామంతా సంఘటితమై ఒక శక్తిగా మారి కేవలం రాజకీయ స్వాతంత్ర్యమే కాకుండా తీవ్రమైన ఆర్థిక, సామాజిక పీడన వ్యవస్థలకు పరిష్కారం చూపాలని కోరుకున్నారు. సమసమాజ దృక్పథం, మార్క్సిజం – లెనినిజం అనే అంతర్జాతీయ పతాకంతో దేశంలోని వివిధప్రాంతాలకు చెందిన విప్లవకారులను ఒక్క దగ్గరకు చేర్చి, 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కాన్పూర్‌లో భారత గడ్డపై లాంఛనంగా స్థాపించబడింది.

ఇది భారతదేశంలో నిర్మాణాత్మకంగా కమ్యూనిస్టు రాజకీయాలకు నాందీ పలికింది. మొదటి నుంచే కమ్యూనిస్టులు రెండు పాత్రలను పోషించారు. ఒకవైపు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ, మరోవైపు కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళల సంఘాలను నిర్మించారు.

బొంబాయి, కలకత్తాలోని కార్మికుల వీరోచిత పోరాటాలు, తెలంగాణలో రైతుల తిరుగుబాట్లు, పుదుచ్చేరిలో ఫ్రెంచ్ పాలకులకు వ్యతిరేకంగా కార్మికుల సమీకరణ, కేరళలో పున్నప్ర–వయలార్, బెంగాల్‌లో తెభాగ పోరాటాలు, తంజావూరు డెల్టాలో భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా రైతుల ప్రతిఘటన, సంస్థానాలలో స్వేచ్ఛ, పౌర హక్కుల కోసం జరిగిన ఉద్యమాలు, ఇవన్నీ స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య, సోషలిస్టు భారతదేశం కావాలనే కమ్యూనిస్టు ఆలోచనా ముద్రను కలిగి ఉన్నాయి. ఈ పోరాటాలతో పాటు కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, కళాకారులు, రచయితలు, మేధావులను వేర్వేరు ప్రజా సంఘాల ద్వారా సమీకరించడం ప్రజా ఉద్యమాలు లోతుగా వేళ్ళూనుకునేందుకు దోహదం చేసింది. అభ్యుదయ సాంస్కృతిక, మేధోపరమైన స్రవంతులను పురోగమింపజేసింది.


### చీలిక తెచ్చిన హాని

అయితే, చారిత్రక కల్లోలాల మధ్య పెరిగిన ప్రతి ఉద్యమం మాదిరిగానే భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం భావజాల స్పష్టత, రాజకీయ వ్యూహం అనే సవాళ్లను ఎదుర్కొంది. వీటిలో అత్యంత నిర్ణయాత్మకమైనది 1964 చీలిక. ఇది భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆవిర్భావానికి దారి తీసింది. అంతర్జాతీయ, జాతీయ సవాళ్ళపై చర్చలలో ఈ చీలిక మూలాలు ఉన్నాయి. వాటి పర్యవసానాల ప్రభావం ప్రజా పోరాటాల క్షేత్రమంతటిపై తీవ్రంగా పడింది.

ట్రేడ్ యూనియన్ ఉద్యమం వేర్వేరు కేంద్రాలుగా విడిపోయింది. విద్యార్థి, యువజన సంఘాలు ముక్కలయ్యాయి. ఎన్నికల పోటీలలో వామపక్ష శక్తులు పరస్పర వ్యతిరేకంగా తలపడడాన్ని చూసాం. కాలక్రమంలో మరిన్ని విభజనలు భారతదేశంలో పెక్కు వామపక్ష గ్రూపులను తయారు చేశాయి.

అనేక రాష్ట్రాలు, రంగాలలో వామపక్షాలు తమ ప్రభావాన్ని కొనసాగించినప్పటికీ, ఈ విభజన జాతీయ రాజకీయాలలో నిర్ణయాత్మకంగా జోక్యం చేసుకునే వామపక్షాల సామర్థ్యాన్ని బలహీనపరిచింది. అనేక ప్రజా ఉద్యమాలలో వామపక్షాలు అగ్రభాగాన ఉన్నప్పటికీ ఐక్య సంఘటన లేకపోవడంతో సమ్మిళిత శక్తి బలహీనపడింది. పాలక వర్గాలు భారీ వనరులు, ప్రభుత్వంపై నియంత్రణ కారణంగా ఈ చీలిక నుంచి ప్రయోజనం పొందగలిగారు. సంక్షోభ సమయాలలో సంఘటిత ప్రత్యామ్నాయాన్ని ముందుకు తేగలిగిన సైద్ధాంతిక, నిర్మాణపరమైన పునాదులు వామపక్షాలకు




ఉన్నప్పటికీ అవి ఆ పని చేయలేకపోయాయి.

### 1991 నుంచి కొత్త సవాళ్లు

1991లో భారత ప్రభుత్వం నయాఉదారవాద విధానాల వైపు మొగ్గడం తాజా సవాళ్లను సృష్టించింది. అంతర్జాతీయ పెట్టుబడి, భారతీయ బడా వ్యాపార సంస్థలు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను ధ్వంసం చేసి, ప్రైవేటీకరణవైపు నెట్టటం జరిగింది. వ్యవసాయ సంక్షోభం తీవ్రతరమైంది. పెట్టుబడుల ఉపసంహరణ, విదేశీ పెట్టుబడుల పెత్తనం, సామాజిక భద్రతపై దాడికి వ్యతిరేకంగా లక్షలాది మందిని సమీకరిస్తూ, వామపక్షాలు అత్యంత నిలకడైన ప్రతిపక్ష గొంతుగా నిలిచాయి.

అనేక చారిత్రాత్మక జాతీయస్థాయి కార్మిక సమ్మెలు, మిలిటెంట్ రైతాంగ సమీకరణలు, మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక ప్రచారాలు వామపక్షాలను భారత



సమగ్ర వామపక్ష ఐక్యతను ఆకాంక్షించిన సిపిఐ 11వ మహాసభ (బటిండా–1978) దృశ్యం

ప్రజాస్వామ్య అంతరాత్మ పరిరక్షకులుగా చాటిచెప్పాయి. ఇంత జరిగినప్పటికీ, వామపక్షాల పార్లమెంటరీ బలం క్షీణించింది. ప్రజాబలం వాస్తవ శక్తిని పార్లమెంటరీ బలం ప్రతిబింబించనందున వామపక్షం బలహీన పడిన భావనను అది ప్రజల్లో కలుగజేసింది.

**ఈ సవాళ్లను గుర్తించిన సిపిఐ 1978లో బటిండా మహాసభ నుండి ఎత్తిపట్టిన సమగ్రమైన వామపక్ష ఐక్యత పతాకాన్ని నిలకడగా కొనసాగిస్తోంది. ఆ పిలుపు అప్పటికప్పుడు ఇచ్చిందో లేదా అవకాశవాదమైనదో కాదు. ఉమ్మడి నేల, ఉమ్మడి త్యాగాల నుండి పుట్టిన భారతదేశంలోని కమ్యూనిస్టు ఉద్యమం నిరవధికంగా చీలిపోయి ఉండడాన్ని భరించలేదనే లోతైన అవగాహనలో ఆ పిలుపు మూలం ఉంది. అడ్డంకులను అధిగమించాలని, దేశంలోని వామపక్ష శక్తుల నడుమ ఐక్య కార్యాచరణ సాధించాలని దాదాపు ఐదు దశాబ్దాలుగా సిపిఐ కోరుతోంది.**

### కార్పొరేట్–మతోన్మాదుల బంధం

కార్పొరేట్– మతోన్మాదుల కూటమి బంధం బలోపేతమైందని ప్రస్తుత పరిస్థితినుండి స్పష్టమవుతోంది. ఒక వైపు, సంపద, వనరులు కొద్దిమంది గుత్తాధిపతుల చేతుల్లో పోగుపడుతున్నాయి, మరొక వైపు అసమ్మతిని అణిచివేయడానికి మత విద్వేషం, తీవ్రమైన జాతీయవాదాలు ఆయుధాలుగా ఉపయోగించబడుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడ్డాయి. సమాఖ్య సూత్రాలు క్షీణించాయి. కార్మికులు, రైతులు, విద్యార్థులు, మైనారిటీలు, మహిళల గొంతులు క్రమపద్ధతిలో అణిచివేయబడుతున్నాయి. భారతరాజ్యం మూల స్వభావాన్నే మార్చి, ఫాసిజం వైపు నెట్టేందుకు క్రమపద్ధతిలో ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో వామపక్ష ఐక్యత కోసం వాదన ఎన్నడూ లేనంత బలంగా మారింది. ఇది కేవలం గత చీలికల వారసత్వాన్ని అధిగమించడం గురించి మాత్రమే కాదు. అనైక్యత కేవలం పాలక వర్గాల ప్రయోజనాలను నెరవేరుస్తున్న పరిస్థితుల్లో ఐక్యత అనేది మనుగడకు, పురోగమనం కోసం కూడా అవసరం.

ఐక్యత కోసం వాదన అనివార్యమైనది. వామపక్ష పార్టీలన్నీ మార్క్సిజం–లెనినిజం అనే ఉమ్మడి భావజాల పునాదిని, కార్మికవర్గం, రైతాంగం పట్ల నిబద్ధతను, సామ్రాజ్యవాదం, మతోన్మాదం, కుల అణచివేత పట్ల రాజీలేని వ్యతిరేకతను కలిగి ఉన్నాయి. అనుసరించే వైఖరిలో ఎత్తుగడల పరమైన తేడాలు ఉండవచ్చు, కానీ ఉన్నత లక్ష్యాలు మాత్రం ఒకటే. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు సమ్మె చేసినప్పుడు, కార్పొరేట్ భూకబ్జాకు వ్యతిరేకంగా రైతులు నిలబడినప్పుడు, ఫీజుల పెంపు, నిరుద్యోగాన్ని విద్యార్థులు, యువత ప్రతిఘటించినప్పుడు, వారు ఈ పోరాటాన్ని వామపక్షంలోని ఏ వర్గం నడిపిస్తుందని అడగడం లేదు. వారు సంఘీభావం, మద్దతు, బలం కోరుకుంటారు. వర్గపరమైన అడ్డంకులను అధిగమించి, ఒక ఐక్య సంఘటనగా ముందు కు వచ్చేలా చూసే కచ్చితమైన బాధ్యత వామపక్ష నాయకత్వంపై ఉం ది.

ఇలాంటి ఐక్యత కేవలం ఎన్నికల పొత్తుల (దీనికి ప్రాధాన్యత ఉన్నప్పటికీ) కోసమే పరిమితం కాకూడదు. ప్రజా పోరాటాల లోతులలో, ఉమ్మడి ప్రచారాలలో, పాలక శక్తుల ప్రచారానికి వ్యతిరేకంగా భావజాల పోరాటాలలో వామపక్ష ఐక్యత ను నిర్మించాలి. ఐక్య వామపక్షం వర్గ సంఘాల బలాన్ని పునరుద్ధరించగలదు. కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, మహిళా ఉద్యమాలు, విద్యార్థి, యువజన సమాఖ్యలు కలిసి పనిచేయడం ద్వారా ప్రయోజనాలను బలోపేతం చేసి, పలుకుబడిని విస్తృతపరచవచ్చు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల పరమైన దాష్టీకాలు, లింగ హింస, పర్యావరణ విధ్వంసం వంటి వాటికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటాల ద్వారా సంఘీభావ బంధాలు తక్షణ ఎన్నికల గణితశాస్త్ర లెక్కలను దాటి పెరుగుతాయి.


### ఉమ్మడి కార్యాచరణ అంశాలు

అటువంటి ఐక్య విధాన రూపాలు స్పష్టంగా ఉన్నాయి. మొదటిది, ప్రజలను నేరుగా ప్రభావితం చేసే సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, విద్య , ఆరోగ్యం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రచారాలు, భూమి, వేతనాల కోసం పోరాటాలు, మతపరమైన విభజనలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టాలి. రెండవది, పాలక వర్గాల కథనాలకు వ్యతిరేకంగా, భారతదేశ పరిస్థితులలో పాతుకుపోయిన సోషలిస్టు ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకురావడంలో ఉమ్మడి సైద్ధాంతిక కార్యాచరణ. మూడవది, విశాల ప్రజాస్వామ్య, లౌకిక శిబిరంలో ఐక్యతను పునరుద్ధరించడం. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ప్రగతిశీల శక్తులను ఒకచోట చేర్చడంలో వామపక్షాలు ప్రధాన పాత్ర పోషించగలవు. **సిపిఐ 25వ మహాసభ ముసాయిదా రాజకీయ తీర్మానంలో మావోయిస్టు గ్రూపులు తమ సాయుధ పోరాట మార్గాన్ని పునఃపరిశీలించి, ప్రధాన స్రవంతి కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాలని మనస్ఫూర్తిగా మేము విజ్ఞప్తి చేసాము.** తద్వారా ప్రజల ప్రయోజనం కోసం ఐక్య ప్రజా ఉద్యమ కార్యాచరణ దిశగా సకల శక్తులను వినియోగించవచ్చు.

పరిణామం చెందిన ఈ వాస్తవికతను ప్రతిబింబించేందుకు, పురోగమనానికి మార్గాన్ని రూపొందించుకునేందుకు భారతీయ గడ్డపై కమ్యూనిస్టు ఉద్యమ శతాబ్ది ఉత్సవం, సిపిఐ 25వ మహాసభ సరైన సందర్భాన్ని కల్పిస్తుంది. గడిచిన శతాబ్ద అనుభవంలో ఉద్యమం అధిరోహించగలిగిన ఎత్తులను, విడిపోవడంతో సంభవించిన ఎదురుదెబ్బలు – రెంటినీ తెలియజేస్తున్నది. అందువల్ల మన వైఖరిలో మూలాంశం స్పష్టంగా ఉండాలి : అది **సూత్రబద్ధ ప్రాతిపదికన కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ నేటి తక్షణ ఆశ్యకత. కార్యక్రమ పరమైన తేడాలను పదే పదే ప్రస్తావించే వారు ముందుకు వచ్చి, విస్తృత స్థాయి చర్చల్లో పాల్గొనాలి; మనల్ని ఏకం చేసేది మనల్ని విభజించే దాని కంటే ఎంతో గొప్పదని గుర్తించాలి.**

ఈ పని కష్టమైనది. కానీ, దేశం అత్యంత క్లిష్టమై సవాళ్లను ఎదుర్కొనప్పుడు భారతదేశంలో వామపక్షాలు ఎల్లప్పుడూ ఆ సందర్భానికి తగినట్లు నిలబడ్డాయని చరిత్ర చెబుతోంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో, అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా ప్రతిఘటన సమయంలో, నయాఉదారవాద విధానాలతో నిరంతర దాడుల సమయంలో కమ్యూనిస్టులు ప్రజలతో నిలబడ్డారు. నేడు ప్రజాస్వామ్యమే ముప్పు ఎదుర్కొంటున్నప్పుడు, వామపక్షాలు చీలికలు పీలికలుగా ఉండలేవు. ఐక్యత అనేది ఒక విలాసం కాదు. అది మనుగడకు, పురోగతికి ఒక ఆవశ్యకత. గొంతు లేని వారికి గొంతుగా, ప్రజాస్వామ్యానికి పరిరక్షకుడిగా, సోషలిజానికి దివిటీగా ఉండేందుకు భారతదేశ ప్రజలకు ఒక ఐక్య వామపక్షం అవసరం. అటువంటి ఐక్యతకు ఇదే తగిన సమయం.

---



చలో చండీఘడ్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

25వ కాంగ్రెస్

21–25 సెప్టెంబర్, 2025

చండీఘడ్ (పంజాబ్)

### 12వ కాంగ్రెస్ (వారణాసి, 1982)

జనతాపార్టీలో భాగస్వామిగా ఉన్న జనసంఘ్ ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వాన్ని వదులుకోవటానికి నిరాకరించటంపై జనతాపార్టీ ప్రభుత్వంలో ఆరంభమైన సంక్షోభం పెరిగి పెద్దదై 1979 జులైలో ఆ ప్రభుత్వం కూలిపోయింది. 1980లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఇందిరాగాంధి కాంగ్రెస్ పార్టీ పెద్ద మెజారిటీతో (353 సీట్లు) తిరిగి అధికారంలోకి వచ్చింది. 1980లో జనసంఘ్ భారతీయ జనతాపార్టీగా రూపాంతరం చెందింది. గాంధేయ సోషలిజం అనే ముసుగు కప్పుకుంది.

ఈ నేపథ్యంలో 1982 మార్చి 22–28 తేదీల్లో వారణాసిలో జరిగిన సిపిఐ 12వ కాంగ్రెస్‌కు 1223 మంది ప్రతినిధులు, 188 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు హాజరైనారు. గత మహాసభ, ఈ మహాసభ మధ్యకాలంలో దేశ ఐక్యతకు ప్రమాదకరంగా అన్ని రకాల మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులు తలెత్తాయని మహాసభ పేర్కొన్నది. ''అన్ని ప్రతిపక్షాల ఐక్యత'' అనే భావనను మహాసభ తిరస్కరించింది.

పార్టీ వ్యూహం, ఎత్తుగడలపై విభేదాలతో డాంగే 1980 చివర్లో పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. 1981 ఏప్రిల్‌లో పార్టీ జాతీయసమితి ఆయనను బహిష్కరిస్తూ తీర్మానం ఆమోదించింది. 1982లో వారణాసి మహాసభ చైర్మన్ పదవిని రద్దు చేసింది.

చంద్ర రాజేశ్వరరావు పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకోబడినారు.

### కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యతకు పిలుపు
### 13వ కాంగ్రెస్ (పట్నా, 1986)

ఈ మహాసభకు ముందు సంవత్సరాల్లో ఖలీస్థానీ వేర్పాటువాద టెర్రరిజం పెచ్చరిల్లింది. టెర్రరిజాన్ని అణచివేసి దేశ ఐక్యత పరిరక్షణకై ప్రధాని ఇందిరాగాంధి 1984 జూన్ ప్రారంభంలో 'ఆపరేషన్ బ్లూ స్టార్' పేరుతో అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలోకి సైనికులను పంపారు. జూన్ 6న అక్కడ జరిగిన కాల్పుల్లో సిక్కు మిలిటెంట్ జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలె సహా పలువురు ఖలీస్థానీ టెర్రరిస్టులు హతులైనారు. ఖలీస్థానీ ఉద్యమం దాదాపు రూపుమాసినా అనేకమంది సిక్కుల్లో ఆ మనోభావాలు కొనసాగుతున్నాయి. ప్రధాని ఇందిరాగాంధీపై 1984 అక్టోబర్ 31న న్యూఢిల్లీలోని ఆమె నివాసగృహం ఆరుబయట తోటలో ఆమె సిక్కు బాడీగార్డులు – బియాంత్‌సింగ్, సత్వంత్‌సింగ్ తుపాకులతో కాల్పులు జరిపారు. ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కాంగ్రెస్(ఐ) అగ్రనాయకులు ఆమె పెద్దకుమారుడు (పైలెట్) రాజీవ్‌గాంధీ చేత ప్రధానమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. 1984 డిసెంబర్ 24, 27, 28 తేదీల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అస్సాం, పంజాబ్‌లలో తిరుగుబాటు ఆందోళనల కారణంగా అక్కడ ఎన్నికలు తర్వాత జరిగాయి. చరిత్రలో మొట్టమొదటిసారి కాంగ్రెస్ పార్టీ 48.1 శాతం ఓట్లతో 414 సీట్లు గెలుచుకుంది. జనతాపార్టీకి 10, బిజెపికి 2, చరణ్‌సింగ్ లోక్‌దళ్‌కు 3 సీట్లు లభించాయి. సిపిఐ 6, సిపిఐ(ఎం) 22 సీట్లు గెలుపొందాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.రామారావు నాయకత్వాన 1983 జనవరిలో కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ 30 సీట్లతో లోక్‌సభలో రెండవ పెద్ద పార్టీ, ప్రధాన ప్రతిపక్షపార్టీగా ఆవిర్భవించింది.

ఈ నేపథ్యంలో సిపిఐ 13వ మహాసభ 1986 మార్చి 12–17 తేదీల్లో పట్నాలో జరిగింది. 1027మంది ప్రతినిధులు, 71 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు హాజరైనారు. ''సూత్రబద్ధ ప్రాతిపదికపై కమ్యూనిస్టు ఉద్యమ పునరైక్యతను సిపిఐ కోరుకుంటున్నదని'' ఆ మహాసభ ప్రకటించింది. దానికి ఎటువంటి స్పందన రాలేదు.

పార్టీ ప్రధాన కార్యదర్శిగా సి.రాజేశ్వరరావు తిరిగి ఎన్నికైనారు.

### 14వ కాంగ్రెస్ (కలకత్తా, 1989)

సిపిఐ 14వ కాంగ్రెస్ 1989 మార్చి 6–12 తేదీల్లో కలకత్తాలో జరిగింది. 956 మంది డెలిగేట్లు, 91 మంది ప్రత్యామ్నాయ డెలిగేట్లు పాల్గొన్నారు. ఈ మహాసభ నాటికి, సోవియట్ యూనియన్‌లో మిఖాయిల్ గోర్బచేవ్ సిపిఎస్‌యు ప్రధాన కార్యదర్శిగా వచ్చారు. సోవియట్ ఆర్థిక వ్యవస్థను సంస్కరించే, సమాజాన్ని ప్రజాస్వామికీకరించే ధ్యేయంతో 1988 జూన్‌లో సిపిఎస్‌యు 27వ కాంగ్రెస్‌లో పెరిస్త్రోయిక (ఆర్థిక, రాజకీయ సంస్కరణలు), గ్లాస్‌నాస్త్ ( ఇతోధిక ప్రజాస్వామ్యం) ప్రవేశపెట్టారు. అది ప్రశంసలు, విమర్శలు రెండూ పొందింది.

1991 నాటికి సోవియట్ యూనియన్ కూలిపోయింది. ఆయనకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. సిపిఐ కలకత్తా కాంగ్రెస్ నాటికి గోర్బచెవ్ సంస్కరణలు కమ్యూనిస్టు ఉద్యమంలో ఆసక్తిదాయక చర్చనీయాంశంగా ఉన్నాయి. అవి మహాసభ ప్రతినిధులను ఆకర్షించాయి. ''ఈ సంస్కరణల ప్రధాన దిశ సరిగ్గా ఉందని మా పార్టీ విశ్వసిస్తున్నది, దాన్ని మేము బలపరుస్తున్నాం. అయితే అంతా సవ్యంగా ఉందని కాదు'' అని మహాసభ తీర్మానం చెప్పింది.

భారత ప్రభుత్వ విదేశాంగ విధానం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉందని సిపిఐ భావించింది. అయితే దేశంలో మతోన్మాద శక్తుల పెరుగుదలను గమనంలోకి తీసుకుంది. అయితే అప్పటికే ప్రధాని రాజీవ్‌గాంధీపై బోఫర్స్ శతఘ్నుల కొనుగోలు కుంభకోణం ఆరోపణలు బయలుదేరాయి. రక్షణ మంత్రిగా ఉన్న వి.పి.సింగ్ రాజీనామా చేశారు. ప్రత్యామ్నాయశక్తిగా రంగంలోకి దిగారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శిగా సి.రాజేశ్వరరావు తిరిగి ఎన్నికైనారు.

### 'నేషనల్ ఫ్రంట్' ప్రభుత్వం
### 15వ కాంగ్రెస్ (హైదరాబాద్, 1992)



ఈ మహాసభ (1992 ఏప్రిల్ 10–16) నాటికి దేశంలో, అంతర్జాతీయంగా పెనుమార్పులు జరిగాయి. రాజీవ్‌గాంధీపై బోఫర్స్ కుంభకోణం నేపథ్యంలో 1989లో నవంబర్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. డిసెంబర్ 2న వి.వి.సింగ్ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. వెలుపల నుంచి – ఒకవైపు నుంచి కమ్యూనిస్టులు, మరోవైపు నుంచి బిజెపి తోడ్పాటుతో, 'నేషనల్ ఫ్రంట్' ప్రభుత్వంగా అది ఏర్పడింది. ఒబిసిలకు విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్ సిఫార సు చేస్తూ మండల్ కమిషన్ 1980లో సమర్పించిన నివేదికను వి.పి.సింగ్ 1990 ఆగస్టులో దుమ్ముదులిపి అమలుచేస్తున్నట్లు ప్రకటించటంతో అగ్రవర్ణాల పార్టీ అయిన బిజెపి ఆ ప్రభుత్వానికి తోడ్పాటు ఉపసంహరించటంతో ప్రభుత్వం మైనారిటీలో పడింది. అద్వానీ రామ జన్మభూమి రథయాత్రకు అనుమతి నిరాకరించింది. అవిశ్వాస తీర్మానం నెగ్గటంతో వి.పి.సింగ్ 1990 నవంబర్ 7న రాజీనామా చేశారు. మండల్ ఉద్యమానికి వ్యతిరేకంగా బిజెపి రామజన్మభూమి ఆందోళన మొదలు పెట్టింది. అందుకే దానికి మండల్ – కమండల్ ఉద్యమంగా పేరు. అంతర్జాతీయంగా, యుఎస్‌ఎస్‌ఆర్, తూర్పు యూరప్‌లలో కమ్యూనిస్టు ప్రభుత్వాలపై ప్రజా తిరుగుబాటుతో సోవియట్ యూనియన్ కూలిపోయింది. అది ప్రజాస్వామ్యం, సోషలిజంపై చర్చను లేవదీసింది.

''సోవియట్ యూనియన్, తూర్పు యూరప్‌లో పరిణామాలు''పై సిపిఐ రూపొందించిన వివరమైన నివేదికపై పార్టీ కాంగ్రెస్‌కు ముందే పార్టీలో సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. ఆ చర్చల పూర్వరంగంలో ఆ నివేదికను పార్టీ కాంగ్రెస్ ఆమోదించింది. పార్టీ కాంగ్రెస్ ఆమోదించిన మరో ముఖ్యమైన పత్రం 'పార్టీ కార్యక్రమ పత్రం'. భారతదేశం, ప్రపంచ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల కారణంగా సవివరమైన కార్యక్రమం ఆమోదించాల్సిన అవసరం ఏర్పడింది.

ఆరోగ్య కారణాలతో సి.రాజేశ్వరరావు ప్రధానకార్యదర్శి పదవికి 1990లో రాజీనామా సమర్పించటంతో, పార్టీ జాతీయసమితి ఇంద్రజిత్‌గుప్తాను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. 15వ కాంగ్రెస్ ఇంద్రజిత్ గుప్తాను ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకుంది.

### ఆర్గనైజేషన్ మహాసభ
### (త్రిసూర్ 1993)

పార్టీ నిర్మాణ మహాసభ త్రిసూర్ (కేరళ)లో 1933 మార్చి 11–14 తేదీల్లో జరిగింది. ''కొన్ని ఆర్గనైజేషనల్ (నిర్మాణ సంబంధ) కర్తవ్యాలు'', ''ప్రజా సంఘాలు – పార్టీ'' అనే రెండు పత్రాలను ఈ మహాసభ చర్చించింది. పార్టీ నాయకత్వ కమిటీల దొంతర్లను మూడు నుంచి రెండు తగ్గించింది. ఇది పనివిధానంలో డూప్లికేషన్ తగ్గిస్తుందని భావించబడింది. కార్యదర్శివర్గం రద్దు చేయబడింది. కేంద్ర కార్యవర్గ కమిటీ (సిఇసి) పేరు జాతీయ కార్యవర్గంగా మార్పు చేయబడింది. పార్టీ నాయకత్వ స్థానాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విభాగాలు మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని తీర్మానించింది.

అయితే రెండు దొంతర్ల ఏర్పాటు పనిచేయలేదు. అందువల్ల కొద్దికాలం తర్వాత పార్టీ తిరిగి మూడు దొంతర్ల పద్ధతికి మారింది.

## 42శాతం రిజర్వేషన్ తర్వాతనే ఎన్నికలు

**ప్రజాపక్షం/వంగూరు :** బిసిలకు 42శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతనే స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈనెల 20న హైదరాబాద్ శ్రీశైలం ప్రధాన రహదారి వంగూరుగేటు సమీపంలోని వైవి ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్న బిసి హక్కుల శంఖారావం సమావేశం విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. శనివారం మండలపరిధిలోని తుమ్మలపల్లి సర్వారెడ్డి , పోల్కంపల్లి, కోనాపూర్ గ్రామాలలో సమావేశంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బిసిసంఘాల నాయకులు పుల్లయ్య యాదవ్, సురేష్‌యాదవ్, రజకసంఘం నాయకులు కృష్ణయ్య, యాదయ్య, మల్లయ్య, రామస్వామి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మాజీ మంత్రులకు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రులు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాజీ మంత్రి లక్ష్మారెడ్డిలకు జడ్చర్ల బిఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. శనివారం నాడు జడ్చర్ల జాతీయ రహదారిపై వారికి స్వాగతం పలుకుతూ శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. హైదరాబాదు నుండి గద్వాల బహిరంగ సభకు వెళ్తున్న వారికి స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సంతోషం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్ నాయక్, హాఫీజ్, ఇంతియాజ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## కోతుల బెడద నుండి కాపాడాలని సిపిఎం ప్రజాసంఘాల ధర్నా

**ప్రజాపక్షం/మద్దూర్ :** కోతుల బెడద నుండి కాపాడాలని మున్సిపల్ కేంద్రంలోని పాత బస్టాండ్‌లో శనివారం రోజు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అశోక్, తెలంగాణ విజ్ఞాన రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అలీ పాల్గొని మాట్లాడుతూ గత నెల రోజుల నుండి కోతులు తీవ్రంగా ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఈ అంశంపై స్థానిక కమిషనర్‌కి అటవీశాఖ అధికారులకు కట్టడి చేయాలని గతంలో వినతి పత్రం ఇచ్చినా కూడా ఇప్పటివరకు స్పందన లేదు. నిన్ననే మల్లి కోతులు ముగ్గురిపై దాడి చేసింది అయిన ఇప్పటికైనా స్పందించి కోతుల బెడద నుండి ప్రజలను రక్షించాలని అన్నారు.ఇలాగే ఉంటే కోతులు , కోనంగలు ఉక్కడి నుండి వస్తున్నాయో దాడి చేసే దాక తెలియని పరిస్థితులు నెలకోన్నాయి. పట్టణవాసులు ఇంట బయట కూర్చోవాలన్నా పనుల మీద బయటకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. కోతులను కట్టడి చేయాలన్నారు. ఇంత జరుగుతున్నా ఏ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. మున్సిపల్ అధికారులు, పోలీసు యంత్రాంగం, ఫారెస్టు ఆఫీసర్లు ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించి ప్రజలను రక్షించాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోతుల దాడికి గురైనవారు, స్థానిక సిపిఎం,ప్రజాసంఘాల నాయకులు భరత్, సుక్కప్ప, నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాయుధపోరాటాన్ని కమ్యూనిస్టుల నుండి దొంగిలించే ప్రయత్నం చేస్తున్న బిజెపి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ప్రపంచ పోరాట చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట త్యాగాలను, వీరచరిత్రను కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నుండి ఏ చరిత్ర లేని బిజెపి దొంగిలించే ప్రయత్నం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తీవ్రంగా విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ జిల్లా సమితి పిలుపులో భాగంగా తెలంగాణ సాయుధపోరాటం వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొదట పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం తెలంగాణ సాయుధ పోరాట వీరులు రావినారాయణరెడ్డి, మక్దూం మోయినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డికి నివాళులర్పించిన అనంతరం బహిరంగ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే తెలంగాణ ప్రాంతం నిజాం నిరంకుశ దేశ్‌ముఖ్‌లు జాగీర్దారులు రజాకారుల కబంధహస్తాలలో నలుగుతుందని, ఆవెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఎర్ర జెండా పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్, సిపిఐజిల్లా కార్యవర్గసభ్యులు ఈర్ల చంద్రమౌళి, మండల కార్యదర్శి పి.కృష్ణాజి, మండల సహాయ కార్యదర్శి మధుగౌడ్, జిల్లాకార్యవర్గ సభ్యులు చంద్రమౌళి, జిల్లా కౌన్సిల్ మెంబర్ తప్పెట కిరణ్, విద్యార్థి సంఘం నాయకులు మంగంపేట శ్రీనివాస్, జిల్లాసమితి సభ్యులు కిరణ్‌కుమార్, చందు, మధు, కృష్ణ, రవి, నారాయణ, సాయిలు, పోచమ్మ పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

పిడిఎస్‌యు విద్యార్థి సంఘం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రెండో శనివారం ప్రభుత్వసెలవు అయినప్పటికీ పట్టణ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు సెలవు ఇవ్వకపోవడంతో పిడిఎస్‌యు విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో పాఠశాలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండో శనివారం రోజు పాఠశాల తెరిచినందుకుగాను ప్రైవేట్ పాఠశాలలపై స్థానిక ఎంఇఓ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు విద్యార్థిసంఘం నాయకులు లక్ష్మణ్ ఉన్నారు.



## స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** బిఆర్ఎస్‌పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌ను కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులు, పార్టీబలోపేతంపై ఈసందర్భంగా విస్తృతంగా చర్చించారు. పార్టీని నియోజకవర్గంలో మరింతపటిష్టంచేయాలని, రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా పనిచేయాలని కేటిఆర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషిచేస్తామని కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేస్తే విజయాన్ని సాధించడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, మాజీ జడ్పిటిసి డాక్టర్ విజితారెడ్డి, ఆమన్‌గల్ మండలబిఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావు, పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# జీవితంలో విజయ సాధనకు విద్య కీలకం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ఉత్తమ కరస్పాండెంట్లకు, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేత




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఎవరైనా తమ జీవితంలో విజయం సాధించడానికి విద్యనే కీలకం అన్నారు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి. మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ట్రస్మా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌నగరంలోని ఎఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆచార్యదేవోభవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రైవేటు విద్యాసంస్థల ఉత్తమ కరస్పాండెంట్లకు ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి, ఘనంగా సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 శాతం విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, మీ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తనకు ఉందన్నారు. అందుకే అన్నింట్లో వెనుకబడి లేబర్ జిల్లాగా, వలసల జిల్లాగా పేరుగాంచిన ఈ జిల్లాలో అనతికాలంలోనే పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాలను తీసుకుని వచ్చామని ఆయన గుర్తుచేశారు. రానున్న పది సంవత్సరాలలో సుమారు 10వేల మంది విద్యార్థుల వరకు ఇంజనీరింగ్ పూర్తిచేసుకునే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించే కంపెనీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన రాష్ట్రంలో కొత్తగా ఎలాంటి కంపెనీలు ఏర్పాటు చేయడానికి వచ్చినా, ముందుగా మహబూబ్‌నగర్ జిల్లా చుట్టుపక్కల ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆరోగ్య బీమా మీ అందరికీ ఎంతో అవసరం ఉందన్నారు. ఆపదలో మిమ్మల్ని ఆదుకునేందుకు ఉద్దేశించి, ఆరోగ్య సమస్యలకు పరిష్కరించేందుకు ప్రైవేటు స్కూల్ వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటుచేసుకోవాలని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రతి నెల 250 రూపాయలను చెల్లించాలని, అంతే మొత్తంలో ఆయా పాఠశాల యాజమాన్యం కూడా చెల్లించాలని సూచించారు. ఆపత్కాలంలో ఈ వెల్ఫేర్ ఫండ్ మిమ్మల్ని రక్షిస్తుందన్నారు. ఈ మొత్తం కూడా రానున్న ఐదు సంవత్సరాలు కాలంలో మన మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యాయులు, వారి మేనేజ్మెంట్ కలిసి సుమారు 13 కోట్లు రూపాయలు వెల్ఫేర్ ఫండ్‌కు 10 లక్షల రూపాయలను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం రాష్ట్రం మొత్తం విస్తరించేందుకు ట్రస్మా ప్రయత్నం చేయాలన్నారు. తెలంగాణ హక్కుల కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మధుసూదన్, గౌరవ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు జి.వంశీమోహన్, కిరణ్‌మై, రిషి విద్యాసంస్థల డైరెక్టర్ చంద్రకళ, వెంకటయ్య, లుంబిని లక్ష్మణ్‌గౌడ్, విజేత డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, అక్షర విజయ్ కుమార్, ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు, జలజం రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి : సిపిఐ



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి జిల్లాలో సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీరాం, వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రహితంగా పోరాటం చరిత్రలో మహోజ్వల ఘట్టమన్నారు. భూమి కోసం భుక్త కోసం వెట్టిచాకిరి, నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. గ్రామాల్లో ప్రజలను పిడిస్తున్న నిజాం తాబేదారులైన దొరలను తరిమికొట్టి 3వేల గ్రామాలను విముక్తం చేసి ఎర్ర జెండాలు పాతారన్నారు. 10 లక్షలు ఎకరాల భ ఊమిని పేదలకు పంచారని ఈ పోరాటంలో దొడ్డి కొమరయ్యతో సహా 4500 మంది అమరులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సిఎన్ శెట్టి, ఎఐఎస్ఎఫ్ , డివిజన్ కార్యదర్శి వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కొరత తీర్చకుంటే ఆందోళన బాట : సిపిఐ

**ప్రజాపక్షం/వనపర్తి :** జిల్లాలో యూరియా కొరత తీర్చకుంటే సిపిఐ రైతులకు మద్దతుగా ఆందోళన బాట పడుతుందని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ హెచ్చరించారు. శనివారం సిపిఐ ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన యూరియా సకాలంలో విడుదల చేయకపోవటమే కారణమన్నారు. కాని కాంగ్రెస్ బీజేపీ ఆదిపత్య పోరాటంలో రైతులు నష్టపోతారని గుర్తించాలన్నారు. కేటాయించిన యూరియా మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్, ఆత్మకూర్, గోపాల్‌పేట, ఘణపురం మండలంలో రైతులు రొడ్డెక్కారని గుర్తుచేశారు. పిఎసిఎస్‌లు ప్రైవేట్ షాపుల వద్ద రైతుల క్యూలు కనిపిస్తూనే ఉన్నాయన్నారు. సకాలంలో యూరియా వేయకపోతే పైరు పెరగక దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పైరుకు అవసరానికి మించి యూరియా వాడుతున్నారని ప్రభుత్వం ప్రచారం చేస్తుందని రైతులకు అవగాహన మాత్రం కల్పించటం లేదన్నారు. తగినంత మోతాదు వాడేట్లుగా చైతన్యం చేయాలన్నారు. సమస్య పరిష్కరించకపోతే సిపిఐ ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరాం, సిఎన్ శెట్టి, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ఖీమ్యా నాయక్

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** విద్యార్థులు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ఖీమ్యా నాయక్ ఆదేశించారు. శనివారం వనపర్తి మండలం, పెద్దగూడెంలోని మహాత్మా జ్యోతిబా పూలే వ్యవసాయ మహిలా డిగ్రీ కళాశాలను అదనపు కలెక్టర్ రెవెన్యూ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ప్రిన్సిపల్ , సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వంట గది, నిల్వ గది పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు వంట గదిని, నిల్వ గదిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వంట చేసేవారు వంటకు ముందు చేతులను శుభ్రంగా కడుక్కొని వంటలు ప్రారంభించాలన్నారు. వంట సిబ్బందికి మైడల్ పరీక్షలు చేయించారా లేదా అని వివరించారు. కూరగాయాలు,వంట నూనె నాణ్యత, బియ్యం, సన్న రకమా కాదా అని స్వయంగా పరిశీలించారు. తాగునీటి సౌకర్యాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డిసిఓ శ్రీవేణి, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రశాంతి, ఫుడ్ సూపర్వైజర్ స్టెల్లా తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.





## మహిళా రైతులకు స్వయం ఉపాధిపై అవగాహన

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** మండల పరిధిలోని మల్లాయిపల్లి గ్రామంలో రైతు వేదికలో కెవికె (వైఎఫ్ఏ) మహబూబ్‌నగర్ 1 ఆధ్వర్యంలో మహిళా రైతులు,గ్రామీణ యువత కోసం ప్రభుత్వ పథకాలు శిక్షణా అవకాశాలపై శనివారం అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా కేవికే వ్యవసాయ విస్తారణ శాస్త్రవేత్త డా. భవాని మాట్లాడుతూ మహిళా రైతులు, గ్రామీణ యువత శక్తి వంతం కావడానికి ఈ కార్యక్రమం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ సహజ , సేంద్రీయ వ్యవసాయ ప్రాధాన్యతను వివరించారు. అదనంగా ప్రభుత్వ పథకాలు పీఎంఎఫ్ఎంఈ, పిఎంఈజిపి, డిఆర్డిఓ, ఆర్ఎస్ఈటీఐ, కార్యకలాపాలను పరిచయం చేస్తూ గ్రామీణ మహిళా రైతులు శాస్త్రీయ సాంకేతికతను ఎలా వినియోగించుకోవచ్చో వివరించారు. పాన్‌గల్ మండల ఏపిఎం వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాల ప్రాధాన్యతను వివరిస్తూ , మహిళా రైతులు , గ్రామీణ యువత కోసం అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం , పొందగలిగే ప్రయోజనాలను సవివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిలలు, విఓఏ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ప్రజాపక్షం/పాన్‌గల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పాన్‌గల్ మండల కార్యదర్శి ఎం. బాల్యానాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చిక్కేపల్లి గ్రామాన్ని సిపిఎం బృందం సందర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం బృందం ప్రజల వద్దకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలు నుండి తెలుసుకున్నారు. బాల్యానాయక్ మాట్లాడుతూ చిక్కేపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ విఫలమైందన్నారు. గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రజా పాలనలో వందల మంది ఇండ్లు కావాలని 80 మంది రేషన్ కార్డు కావాలని, 40 మంది పింఛన్లు కావాలని ప్రజల దరఖాస్తులు పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం లెక్క ప్రకారం 19 ఇండ్లు మంజూరు కావడం జరిగిందని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏ ఒక సమస్య కూడా పరిష్కారం చేయలేదని విమర్శించారు. రైతు భరోసా 48 మందికి ఇవ్వలేదని సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబు నాయక్, మండల వ్యవసాయ రాములు, రవి నాయక్ పాల్గొన్నారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుంది

సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు



**ప్రజాపక్షం / అమరచింత :** దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కె. విజయరాములు ఆరోపించారు. శనివారం అమరచింత మండల కేంద్రంలో సిపిఐ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ రాములు మాట్లాడుతూ యూరియా కొరత వల్ల రైతులు ఆగమవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా ఎరువులను సక్రమంగా పంపిణీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన చెందారు. రైతులకు అవసరమైన యూరియాను తక్షణమే ప్రభుత్వాలు సరఫరా చేసేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. తెలంగాణ రైతాంగ పోరాటం ను నడిపింది ఒక కమ్యూనిస్టులే అని గుర్తు చేశారు. గత ప్రభుత్వం సెప్టెంబర్ 17న అధికారికంగా జరిపిస్తామని హామీనిచ్చి విస్మరించారని విజయరాములు బిఆర్ఎస్ పార్టీపై ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది, సెప్టెంబర్ 17న అధికారికంగా జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ప్రజలను జాగృతం చేసి ప్రజా సమస్యలపై పోరాటం సిపిఐ పార్టీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్, నాయకులు శ్యాంసుందర్, కుతుబ్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.



## విలేకరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

జడ్చర్ల సిఐ కమలాకర్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్లలో విలేకరులకు ఎల్లప్పుడూ అండగా ఉండి సేవలందిస్తామని జడ్చర్ల సిఐ కమలాకర్ హామీ ఇచ్చారు. శనివారం జడ్చర్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్లో నూతనంగా ఏర్పడిన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులను ఆయన పూలమాలలు శాలువాలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరులకు ఎల్లప్పుడూ అండగా ఉండి సేవలందిస్తామని తెలిపారు. పగలనక, రాత్రనక వార్తలు సేకరించి ప్రజలకు తగిన సమాచారం అందించేందుకు విలేకరులు ఎంతగానో కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పోలీసులకు విలేకరులకు దగ్గర సంబంధాలు ఉన్నాయని ఒకరిపై ఒకరు నమ్మకం ఉంచి ప్రజలకు సేవ చేసేందుకు సరైన సమాచారం అందించేందుకు తోడ్పాటునందించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు జయప్రకాష్ మల్లేష్ ఖాదర్ విలేకరుల సంఘం నాయకులు కృష్ణ శేఖర్ సుల్తాన్ ప్రభాకర్ మల్లేష్ శ్రీనివాస్ కిరణ్ మై లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వసతులు ఎలా ఉన్నాయి?

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ ఐఐఐటి కళాశాలలో వసతులు ఎలా ఉన్నాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం ఆకస్మికంగా ఐఐఐటి కళాశాలను సందర్శించి, హాస్టల్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎక్కడి నుంచి వచ్చారని, పదవ తరగతిలో మార్కులు ఎన్ని వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో భోజనం మాదిరిగా ఉందని వారు చెప్పారు. లెక్చరర్స్ పాఠ్యాంశాలు ఎలా బోధిస్తున్నారు? అర్థం అవుతుందా? అని ఆయన అడిగారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ఐఐఐటి కళాశాల ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్, ఖాద్రీ, నాయకులు లీడర్ రఘు, యాదిరెడ్డి, సేవా సంఘం సభ్యులు సురేందర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుంజునార్ ఆంజనేయులు

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సి ఆర్ గోవింద్ రాజ్

**ప్రజాపక్షం/మక్తల్ :** ప్రీప్రైమరీ, పిఎం విద్యను అంగన్వాడీ కేంద్రాలకే అప్పగించాలని, ఫేస్ రికగ్నైజ్ సిస్టం ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో పేర్కొన్న హామీ మేరకు కనీస వేతనం 18 వేల రూపాయలు అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 15న మంత్రుల ఇండ్ల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మక్తల్ పట్టణ కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఒ మక్తల్ ప్రాజెక్ట్ అధికారి సరోజినికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ అంగన్ వాడీ టీచర్ హెల్పర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలో పశుసంవర్థక, క్రీడల యువజన శాఖ మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఇంటి ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూరు ఆంజనేయులు , సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిఆర్ గోవింద్ రాజ్ తెలిపారు. అంగన్వాడీల అపరిష్కృత సమస్యలు పరిష్కరిచకుండా పనీ భారం పెంచుతూ అనేక కొత్త సమస్యలకు కారణమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఆందోళనకు రాష్ట్ర యూనియన్ పిలుపునిచ్చిందని తెలియజేశారు.

సెప్టెంబర్ 25న చలో సెక్రటేరియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలింగమ్మ, శోభారాణి, మంజుల, శ్రీలత, రాజేశ్వని, చంద్రకళ, వెంకటమ్మ, రాధిక, నరసింగమ్మ, దురదన బేగం, వాయిదా బేగం , భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 15, 16 డిగ్రీ స్పాట్ అడ్మిషన్స్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 15,16 తేదీలలో స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయని అ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె శ్రీనివాస రాజు, కళాశాల దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థినిలు వారి యొక్క సంబంధింత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు ఒక సెట్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, మీరు ఏదైతే కోర్సులో జాయిన్ కాదలచుకున్నారో ఆ కోర్స్ యొక్క ఫీజు తీసుకొని రావాలని తెలిపారు . మొదటగా లోకల్ అభ్యర్థులకు సీటు అవకాశం లభించిన తర్వాత నాన్ లోకల్ అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని ఈ స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందిన విద్యార్థినులు స్కాలర్షిప్,రియంబర్స్మెంట్ సౌకర్యము పొందలేరన్నారు.



## సురవరం జీవితం ఆదర్శం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహానుభావుడని,ఆయన జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమరవరంలో సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన కోదాడలోని కాశీనాథ్ ఫంక్షన్ హాల్‌లో సుధాకర్ రెడ్డి సంతాపసభను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంతాపసభలో రాష్ట్ర, జిల్లా నాయత్వం పాల్గొంటున్నట్లు తెలిపారు. పేదప్రజల కోసం ఆయన చేసిన కృషిని గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు,గ్రామ కార్యదర్శి పడిగపాటి సైదిరెడ్డి,శ్యామ్ సన్,పగిళ్ళ సుందరయ్య,లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవాలను వక్రీకరిస్తున్న బిజెపి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని యాదగిరిపల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటా వారోత్సవాల్లో భాగంగా స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నిజాంకు వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం దొరల భూస్వాముల పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగిందని, అలాంటి మహత్తర పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తుందన్నారు. దున్నేవాడికి భూమి కావాలనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు 10లక్షల ఎకరాలను పంచడం జరిగిందన్నారు. మతాల పేరుతో బీజేపీ పబ్బం గడుపుకోవడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు మద్దిరాల రంగారెడ్డి, మండల కార్యదర్శులు జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, రైతు సంఘం నాయకుడు బిల్లా కనకయ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు వల్లంపట్ల వెంకన్న, యాదగిరి, ఎర్రబోతు పద్మ, శాంతి, షమీం, మట్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఆశమ్మ, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు శిధిలావస్థకు వచ్చిన భవనాలను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులు నూతన భవనాల ఏర్పాటుకు కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్సి బాలుర పాఠశాల, కళాశాల వసతి గృహాలని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు అర కోర వసతులతో నడుస్తున్నాయని చెప్పారు. కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. నిన్న రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఇన్వార్డులో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు ప్రభుత్వ పాఠశాలలకు కొత్త భవనాలు నిర్మించాలని వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు. వెంటనే జిల్లాలో శిధిలావస్థకు చేరుకున్న సంక్షేమ వసతి గృహాలకు కొత్త భవనాలు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ డైట్ అమలు అవుతుందా లేదా అని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, నాయకులు గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 491 కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేట కోర్టు పరిధిలో లోక్‌అదాలత్ ద్వారా మొత్తం 491కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్నకుమారిలు కలిసి కోర్టు హాల్‌లో నేషనల్ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబందించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగూడూరు స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు 107, ప్రీ లిటిగేషన్ కేసులు 32, భూవివాద కేసులు 04, ఇతర పిట్టి కేసులు 348 పరిష్కరించుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో అప్పటి పరిస్థితుల్లో కేసులు పెట్టుకోని కోర్టుల చుట్టు తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజీమార్గమే రాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్‌అదాలత్ వినియోగించుకోని సమస్యలను పరిష్కరించుకోవడానికి కక్షిదారులు మందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్‌లు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.7 లక్షల విలువైన బెంచీలు బహూకరణ

**ప్రజాపక్షం/మునుగోడు:** గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక్కొక్క రోజు ఒక్క గ్రామాన్ని ఎంచుకొని మార్నింగ్ వాక్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మండలంలోని పలివెల గ్రామంలో గత నెలన్నర క్రితం మార్నింగ్ వాక్ చేస్తూ ఆ గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సందర్భంలో ఆ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు బెంచీలు సరిగా లేవని కూర్చోవడానికి చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే కొత్త బెంచీలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తన సొంత ఖర్చులతో ఏడు లక్షల విలువగల 110 బెంచీలను శనివారం ఆ పాఠశాలకు బెంచ్ లను అందజేశారు. అడిగిన వెంటనే బెంచీలు అందజేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆ పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




## బిరబిరా కృష్ణమ్మ పరుగులు...

### సాగర్ ప్రాజెక్టుకు భారీ వరద: 288511 క్యూసెక్కుల ఇన్ ఫ్లో : 26 గేట్లు ఓపెన్

**ప్రజాపక్షం/నందికొండ:** ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం కు భారీగా వరద వచ్చి చేరుతూ ఉండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కు శ్రీశైలం నుంచి 288511క్యూసెక్కుల నీరు మొత్తం ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతోంది. ఇప్పటికే నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తూ ప్రాజెక్టు నీటిమట్టం 589.90 అడుగులుగా ఉండటం ఇన్ ఫ్లో భారీ స్థాయిలో వస్తూ ఉండటంతో శనివారం ఉదయం 8 గేట్లను, తర్వాత ఒక గంట వ్యవధిలో 14 గేట్లను, మధ్యాహ్నం 18 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి నీటిని దిగకు విడుదల చేస్తున్నారు అయితే వరద ఉధృతి భారీగా పెరుగుతూ ఉండటంతో సాయంత్రం మొత్తం 26 గేట్లను 5 అడుగులు మేర పైకి లేపి 209508 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఆరు వారాల వ్యవధిలో ప్రాజెక్టు మొత్తం 26 గేట్లు తెతెరుచుకోవడం ఇది నాలుగవసారి. అయితే శ్రీశైలం క్రస్ట్ గేట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి సాగర్ ప్రాజెక్టుకుమొత్తం 288511 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వచ్చి చేరుతూ ఉంటే కుడి ఎడమ, కాలువలు, క్రస్ట్ గేట్లు,జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి, 260844 క్యూసెక్కుల నీటిని మొత్తం అవుట్ ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు శనివారం సాయంత్రానికి 589.60 అడుగులుగా ఉన్నది. నీటి నిల్వ 312.0450 టిఎంసిలకు 310.8498 టిఎంసీలుగా ఉన్నది.



# మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అభివృద్ధి

### మహిళా శక్తి పెట్రోల్ పంపు పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన






**ప్రజాపక్షం/నల్లగొండ:** పురుషులతో పాటు, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్‌బిసి కాలనీ సమీపంలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి పెట్రోల్ పంపు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందుకొస్తున్నారన్నారు. ఎస్ఎల్‌బిసి వద్ద ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్ భవిష్యత్తులో బాగా నడుస్తుందని, మెడికల్ కళాశాల పక్కనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల, ఇటు హైదరాబాద్ రహదారికి ,నాగార్జునసాగర్ రహదారికి చేరువలో ఉండటం, పెట్రోల్ పంపు తో పాటు, ఏవి చార్జింగ్ మిషన్,కేఫ్, సూపర్ మార్కెట్ వంటివి ఇక్కడ బాగా నడుస్తాయని అన్నారు. సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయ సంఘాలకు 20వేల కోట్ల రూపాయల రుణాలు ఇస్తున్నామని,మహిళల్లో ధైర్యం వస్తుందని, ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే మహిళ ముందడుగు వేస్తుందన్నారు. పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలను మహిళలకు అప్పగించగా,రాష్ట్రవ్యాప్తంగా 30 కోట్ల ఆదాయం వస్తే నల్లగొండ జిల్లాలో కోటి 40 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. గ్రామాలలో గృహహింసకు వ్యతిరేకంగా మహిళలకు తోడు గా నిలవాలని, ఆరోగ్యం, సామాజిక భద్రత చూసుకోవాలని పిలుపునిచ్చా రు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన పెట్రోల్ పంపును సక్రమంగా నిర్వహించుకోవాలని జిల్లాలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపు మూడవదని, మరో మూడు పెట్రోల్ పంపులు జిల్లాకు మంజూరు అయ్యాయని తెలిపారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపుకలెక్టర్. జె. శ్రీనివాస్, ఇన్చార్జి డిఆర్ఓ అశోక్ రెడ్డి ,ఐఓసిఎల్ జనరల్ మేనేజర్ సుదీప్ రాయ్, డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ హాజరయ్యారు.

### కుక్కల దత్తత, వ్యాక్సినేషన్ ప్రారంభం

దేశంలో ఇటీవల కుక్క కాట్లు పెరిగిపోతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రజలలో అప్రమత్తతతో పాటు కుక్కలకు వాక్సినేషన్, స్టెరిలైజేషన్ వంటి కార్యక్రమాలు అవసరమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని రాంనగర్ పార్కులో కుక్కల దత్తత, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద కుక్కల దత్తత కార్యక్రమాన్ని నల్లగొండ జిల్లాలో నిర్వహించడం పట్ల ఆయన అభినందించారు. జిల్లాలో సుమారు 40 వేల కుక్కలు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తున్నదన్నారు. కుక్కలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చిన వారిని ఆయన అభినందించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో 92000 గృహాలు ఉండగా, సుమారు 5000 కుక్కలు ఉన్నాయని ఒక్కొక్కరు ఒక్కో కుక్కను దత్తత తీసుకుంటే కుక్కల బెడద ఉండదని తెలిపారు. శనివారం నిర్వహించిన కుక్కల దత్తత కార్యక్రమంలో 49 కుక్కలను దత్తత ఇచ్చినట్లు ఆమె తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ఎస్పి శరత్‌చంద్ర పవర్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్,డిఎఫ్ఓ రాజశేఖర్, దేవరకొండ ఏసీపీ మౌనిక, ఏసీపీ రమేష్, ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి,డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

## సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

### వారోత్సవాల్లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ:** నైజాంను తరిమికొట్టి ప్రజలకు స్వేచ్ఛా,స్వాతంత్ర్యాలను అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బిజెపి వక్రీకరిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా శనివారం సిపిఐ దేవరకొండ మండల సమితి ఆధ్వర్యంలో దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో ఉన్న అమరవీరుల స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పడమటిపల్లి నుండి దేవరకొండ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట యోధుల చిత్రపటాలకు, ప్రజా పోరాటంలో భాగస్వాములైన అమరుల స్మారక స్తూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ దేవరకొండలో 77వ తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సభ నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఈనెల 17న విమోచన దినోత్సవం పేరిట బిజెపి చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టెందుకేనని అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తానని, ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నర వేల కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో ఎర్రబారిన తెలంగాణ నేల నిజాం నిరంకుశ పాలనను కూలదోసింది కమ్యూనిస్టులేనని, పటేల్ సైన్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కా ర్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యు లు రంగారెడ్డి, యాదయ్య, రాంరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, మైనోద్దీన్, సీనియర్ నాయకులు పాండు రంగారెడ్డి, మండల కౌన్సిల్ సభ్యులు, పట్టణ శాఖ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, జ్యోతిబస్, బుచ్చయ్య, భూపాల్‌రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

## వర్ష ప్రభావానికి పూర్తిగా దెబ్బతిన్న జల్లాపురం బిటి రోడ్డు



**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం జల్లాపురం గ్రామం బిటి రోడ్డు భారీ వర్షాల వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన డంతో ఈ గ్రామం నుండి నేషనల్ హైవే కు వెళ్లే స్టేజి ప్రధాన రహదారి అంతర్గతంగా గుంతలమయంగా మారి ప్రయాణానికి నరకప్రాయంగా మారింది. మూడు నర కిలో మీటర్ల మేర ఈ రహదారి పూర్తిగా దెబ్బతినడంలో అనేక చోట్ల పెద్దపెద్ద గుంతలు పడటం వంటివి జరిగాయి. దీనివల్ల ఆటోలు బైకులు ట్రాక్టర్ల వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారని 9/10/2024 ఈ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్తలు శాంతకుమార్ బోరెడ్డి రామ్ ప్రసాద్ రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు పూర్ ప్రజావాణిలో వినతి పత్రం దరఖాస్తు ఇవ్వగా వెంటనే ఇట్టి పిర్యాదుకు స్పందించి పిఆర్ పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్‌కు రాయగ నూతన బిటి రోడ్డు నిర్మాణం కొరకు ఒక కోటి ఇరువై ఆర్ లక్షల రూపాయల బడ్జెట్ ను కేటాయించడం జరిగింది. కానీ ఇంత వరకు టెండర్లు వెయ్యక పోవడంతో ప్రతి నిత్యం ఈ రోడ్డు పైన ప్రయాణం చెయ్యాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రజావాహన దారులు, సామాజిక కార్యకర్తలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## దీర్ఘకాలిక కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తొమ్మిదేళ్లుగా పరిష్కారం కాని కేసును జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో పరిష్కారమైంది. శనివారం స్తానిక కోర్టు సముదాయంలో 5వ అదనపు జిల్లా జడ్జి, న్యాయ అధికార సేవా సంస్థ చైర్మన్ జి.వేణు అధ్యక్షతన జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్ మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలో రైస్ మిల్లు వివాదాన్ని రాజీమార్గం ద్వారా పరిష్కరించారు. లోక్‌అదాలత్‌ను ప్రారంభిస్తున్న జడ్జి వేణు మాట్లాడుతూ ఏండ్ల తరబడి కోర్టు చుట్టు తిరిగి ఆర్థికంగా నష్టపోవడం, మానసికంగా, ఆరోగ్యపరంగా కృశించి పోకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. లోక్‌అదాలత్ అవార్డు, తీర్పు అంతితమమని అన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి న్యాయ అధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అదనపు జిల్లా కోర్టులో జడ్జి వేణు, సబ్ కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్య రాణి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌తేజ్‌లు వారి కోర్టులో లోక్‌అదాలత్ సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకు కేసులు 62, పెట్టి కేసులు 25 పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, ఎ.భూపతిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురామారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దీపారాణి, సుధాకర్, అదాలత్ సభ్యులు ప్రభాకర్, రాజశేఖర్, మల్లేష్, వెంకన్న, మల్లేష్, రామకృష్ణ, గంగాభవాని, కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుష్మిత, న్యాయవాదులు వేణుగోపాల్, శ్రీనివాస్, పద్మయ్య, మంద సైదులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వైటిడిలో రూ.కోట్లు వృథా

### నిధుల లేమితో నిరుపయోగంగా దుకాణ సముదాయాలు

### వర్తకులకు అప్పగించడంలో మరింత ఆలస్యం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** విశ్వక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి రూ.కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆలయ పునరుద్ధాటన తర్వాత కూడా నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం చేత స్థానికులు, వ్యాపారులు, భక్తులకు కొంత అసంతృప్తి మిగిలింది. పాలకులు, అధికారులు సరైన దృష్టి సారించకపోవడం చేత భక్తులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వ పాలకులు, దేవాదాయ శాఖ అధికారులు వీటి నిర్మాణాలు కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఏటా రూ.కోట్లల్లో హుండీ ఆదాయం సమకూరిన రూ.కోట్లతో నిర్మించిన దుకాణాల సముదాయాలు నిరుపయోగంగా మిగిలాయి. కానీ, భక్తుల బాధలు మాత్రం తీరడం లేదు. వర్తక సంఘం దుకాణాలు టెండర్లు నిర్వహించకుండా ప్రభుత్వ పాలకులు, అధికారులు ఎందుకు వదిలేస్తున్నారో ఎంతకి అంత చిక్కడం లేదు. దేవస్థానానికి చెల్లించాల్సిన మొత్తంలో రెన్యువల్ చేయాల్సిన ప్రతిసారి 30 శాతం పెంచుతూ ఆ దుకాణాలను వర్తకులే సొంతం చేసుకుంటున్నారు. కాగా, ఆలయ పునర్నిర్మాణ సమయంలో దుకాణ సముదాయాల కోసం ప్రత్యేకంగా నిర్మాణాలు చేసినప్పటికీ పైరవీల ద్వారా కొండపైనే తాత్కాలికంగా వర్తకులు దుకాణాలను కొనసాగిస్తున్నారు. తాత్కాలికం పేరుతో ఏళ్ల తరబడి కొండపైనే వర్తకులు తిష్ట వేశారు. వీరికి సంబంధించిన దుకాణాలకు తక్షణమే టెండర్ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తూ దేవాదాయ శాఖ, యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులకు స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. వర్తక సంఘంలోని దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తేనే ఔత్సాహికులకు అవకాశం ఉంటుంది. ఎందుకంటే వర్తక సంఘంలోని దుకాణదారులే మిగతా దుకాణాలకు టెండర్ నిర్వహిస్తే ఔత్సాహికులకు దక్కకుండా అవకాశం రాకుండా అడ్డు తగులుతారు. దేవస్థానంలోని అన్ని దుకాణాలకు టెండర్ నిర్వహించి ఔత్సాహికులు, స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ పెరుగుతుంది. అయినప్పటికీ ఆలయ అధికారులు మాత్రం వాటి రెన్యువల్ కే ముగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ దేవస్థానంలో ఆదాయానికి గండి కొడుతున్న వర్తక సంఘం వ్యాపారులు పైరవీలు చేసి దుకాణాల టెండర్లు జరగకుండా ప్రభుత్వ పాలకుల చుట్టూ తిరుగుతూ కోట్లల్లో ఆదాయానికి గండి కొడుతున్నారు. అయినప్పటికీ అధికారులు సొమ్ము చేసుకొని పైరవీల బూచి చూపుతూ వర్తకులను గట్టెక్కిస్తూ వస్తున్నారు. ఈ వర్తకులే దేవస్థానంలో మిగతా విభాగాల్లో నిర్వహించే టెండర్లల్లో ఔత్సాహికులకు అవకాశం రాకుండా అడ్డు తగులుతున్నారు. అయితే వర్తకులు నిర్వహించే దుకాణాలకు ఏటేటా టెండర్లు నిర్వహిస్తే దేవస్థానానికి రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు గాను దేవస్థాన అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తూ వర్తక సంఘంలోని దుకాణాలకు తక్షణమే టెండర్లు నిర్వహించాలని స్థానికులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

# క్రీడ

## మెరిసిన షమీమ్, జకీర్..

### శ్రీలంకను ఊరిస్తున్న టార్గెట్..?

ఆసియా కప్ రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాపార్డర్ కుప్పకూలింది. శ్రీలంక పేసర్ల విజృంభణతో ఓపెనర్లు డకౌట్ అవ్వడంతో మిడిలార్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకున్నారు. 38కే నాలుగు వికెట్లు పడిన దశలో షమీమ్ హొసేన్(42 నాటౌట్), జకీర్ అలీ(41 నాటౌట్)లు క్రీజులో పాతుకపోయి ఏడో వికెట్‌కు 81 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో, బంగ్లా ప్రత్యర్థికి 140 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్‌కు ఆదిలోనే షాకిచ్చారు లంక పేసర్లు. ఓపెనర్లు తంజిద్ హసన్(0)ను తుషార బౌల్డ్ చేయగా.. పర్వేజ్ హొసేన్(0)ను చమీర వెనక్కి పంపాడు. సున్నాకే రెండు వికెట్లు కోల్పోయిన జట్టును కెప్టెన్ లిటన్ దాస్(28), తౌహిద్ హ్రిదోయ్(9)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, హసరంగ ఓవర్లో లిటన్ దొరికిపోగా.. కమిల్ మిషరా మెరుపు త్రోకు తౌహిద్ రనౌట్‌గా వెనుదిరిగాడు. అంతే.. 38కే నాలుగు కీలక వికెట్లు పడడంతో వందలోపే బంగ్లా ఇన్నింగ్స్ ముగిసేలా కనిపించింది. కానీ, ఆ దశలో షమీమ్ హొసేన్(42 నాటౌట్), జకీర్ అలీ(41నాటౌట్)లు ఆచితూచి ఆడారు. కాస్త నిలదొక్కుకున్నాక గేర్ మార్చిన ఇద్దరూ డెత్ ఓవర్లలో బౌండరీలతో చెలరేగారు. చివరి రెండు ఓవర్లలో 26 రన్స్ పిండుకుంది ఈ జోడీ. హొసేన్, జకీర్‌లు ఆరో వికెట్‌కు అజేయంగా 81 పరుగులు రాబట్టడంతో.. బంగ్లా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేయగలిగింది.





## టీ20లో ఇంగ్లాండ్ సరికొత్త రికార్డ్


బజ్‌బాల్ గేమ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే ఇంగ్లాండ్ టీ20ల్లో సరికొత్త చరిత్ర లిఖించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లిష్ ఆటగాళ్లు తమ విధ్వంసక బ్యాటింగ్‌తో జట్టు స్కోర్‌ను 300 దాటించారు. దీంతో రెండు టెస్టు జట్ల మధ్య జరిగిన అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక స్కోర్‌ను నమోదు చేశారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఓల్ ట్రఫర్డ్‌లో సౌతాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో 2 వికెట్లు మాత్రమే కోల్పోయిన ఇంగ్లాండ్ జట్టు 304 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (141 నాటౌట్, 60 బంతుల్లో 15x4, 8x6), జోస్ బట్లర్ (83; 30 బాల్స్‌లో 8x4, 7x6) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. ఈ జంట తొలి వికెట్‌కు 47 బంతుల్లోనే 126 పరుగులు జోడించారు. బట్లర్ ఔట యినప్పటికీ.. బెతెల్ (26), బ్రూక్ (41)ల అండతో జట్టు స్కోరును 300 దాటించాడు. సాల్ట్ 39 బంతుల్లోనే సెంచరీ చేయడం గమనార్హం. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా వెంటవెటనే వికెట్లు కోల్పోయింది. తీవ్ర ఒత్తిడికి గురైన సఫారీ బ్యాట్స్‌మెన్ 17 ఓవర్లలో 158 పరుగులకే ఆలౌట్ అయ్యారు. ఆ జట్టులో కెప్టెన్ మార్క్‌రమ్ (41) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. దీంతో 146 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి చవి చూసింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ టీ20ల్లో భారీ తేడాతో గెలిచిన జట్టుగా ఇంగ్లండ్ రికార్డు సృష్టించింది. కాగా, టీ20ల్లో ఇది మూడో అత్యధిక స్కోరు. అంతకు ముందు 344 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా జింబాబ్వే రికార్డు నెలకొల్పింది. గతేడాది గాంబియాపై 4 వికెట్ల నష్టానికి 344 రన్స్ చేసింది. 2023లో మంగోలియాతో జరిగిన మ్యాచ్‌లో నేపాల్ 314/3 రన్స్ చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇక భారత్ కూడా ఒకసారి 300 మార్క్‌కు దగ్గరగా వచ్చింది. 2024లో హైదరాబాద్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 297/6 పరుగులు చేసింది.

## ఎయిర్ పిస్తోల్ ఈవెంట్‌లో 'గోల్డ్' కొట్టిన ఇషా సింగ్



**నింగ్‌బో:** భారత షూటర్ ఇషా సింగ్ అద్భుత ప్రదర్శన ఇచ్చింది. చైనాలోని నింగ్‌బోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ ఈవెంట్ లో .. షూటర్ ఇషా సింగ్ గోల్డ్ మెడల్ సొంతం చేసుకున్నది. నింగ్బో ఒలింపిక్ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన ఈవెంట్‌లో.. హోం ఫేవరేట్ యావో క్వియాన్‌జున్‌ను మట్టికరిపించిందామె. ఫైనల్ ఉత్కంఠభరితంగా జరిగింది. దక్షణి కొరియాకు చెందిన క్రీడాకారిణి ఓహ్ యెజిన్ బ్రాంచ్ మెడల్ గెలుచుకున్నది. ఇషా సింగ్ 242.6 పాయింట్లు సాధించి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నది. గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉన్నట్లు ఇషా పేర్కొన్నది.

## హంగ్‌కాంగ్ ఓపెన్ ఫైనల్లోకి సాత్విక్-చిరాగ్ జోడి



**న్యూఢిల్లీ:** హాంగ్ కాంగ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లోకి ఇండియన్ మెన్స్ జోడి ప్రవేశించింది. పురుషల డబుల్స్ కేటగిరీలో సాత్విక్‌సాయిరాజ్ రాంకి రెడ్డి, చిరాగ్ శెట్టి(Satwik Chirag) వరుస గేమ్‌ల్లో గెలిచి ఫైనల్లోకి అడుగుపెట్టారు. వరల్డ్ నెంబర్ 9 జోడి .. సెమీస్‌లో చైనీస్ తైపికి చెందిన బింగ్ వెయి లిన్, చెన్ చెంగ్ కౌన్‌పై 2117, 2115 స్కోరుతో విజయం సాధించారు. ఆరు సార్లు సెమీఫైనల్లో ఓడిన ఈ జంట ఎట్టకేలకే తొలిసారి ఓ టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించారు. ఈ టోర్నీలో భారత డబుల్స్ జోడి 8వ సీడెడ్‌గా బరిలోకి దిగింది. గతంలో సాత్విక్ జోడి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నది. సైనా నెహ్వాల్, పీవీ సింధు తర్వాత పలు ఈవెంట్లలో మెడల్స్ సాధించిన ప్లేయర్స్‌గా నిలిచారు.

# ఫోకస్

# బిజినెస్

## లాభాల హవా కొనసాగుతుందా?

ప్రస్తుతం స్టాక్ మార్కెట్‌లో ఇప్పుడు అందరినీ తొలిచివేస్తున్న ప్రశ్నకు సరైన సమాధానం లేదు. శరవేగంగా మారుతున్న జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు స్టాక్ మార్కెట్లపై ప్రత్యక్ష లేదా పరోక్ష ప్రభావం చూపనున్నాయి. కాబట్టి, ముందస్తు అంచనాలు సాధ్యంకాదని నిపుణులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. ఈవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ) కొంత మెరుగైన లావాదేవీలను నమోదు చేసింది. గత వారాంతంలో మార్కెట్లు ఊరటనిచ్చిన నేపథ్యంలో, సెన్సెక్స్ 80,718.01 పాయింట్లు, నిఫ్టీ 24,734.30 పాయింట్లతో ముగియగా, ఈ వారాంతంలో పరిస్థితి మరికొంత మెరుగుపడింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,186.69 పాయింట్లు పెరిగి, 81,904.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. అదే విధంగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్)లో నిఫ్టీ ఈవారం 379.70 పాయింట్లు మెరుగుపడి, 25,114.00 పాయింట్లుగా ముగిసింది. ఈ మార్పు వచ్చే వారం కూడా స్టాక్ మార్కెట్‌లో బుల్‌రన్ కొనసాగుతుందనే ఆశలు కలిగిస్తున్నాయి. అయితే, స్టాక్ మార్కెట్లను పలు అంశాలు ప్రభావితం చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. ముఖ్యం గా అమెరికాలో ఫెడ్ రిజర్వ్ రేట్లు తగ్గే అవకాశా ఉందని అంటున్నారు. అదే జరిగితే, ప్రపంచ స్టాక్ మార్కెట్ లాభాల బాటలో పరుగులు తీయవచ్చు. మార్కెట్ సంచలనాలకు ప్రేరణ కావచ్చు. కాగా, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ఇతర దేశాల మార్చబడుతున్న వడ్డీ రేట్లు, వాణిజ్య నియమాలు మార్కెట్లో ట్రేడింగ్ మార్పులను పెంచవచ్చు. భారత స్టాక్ మార్కెట్లను నియంత్రించే 'సెబి' ఇటీవల ఐపిఒ నిబంధనలను సులభతరం చేసింది. ఇది పెద్ద కంపెనీలు ఐపిఓలను వేగవంతంగా మార్కెట్‌లోకి విడుదల చేసే అవకాశాలను మెరుగుపరచింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం కూడా స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశాలున్నాయని అంటున్నారు. గత నెల రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతం పెరిగింది. ఇది మరింత మెరుగుపడితేగానీ, స్టాక్ మార్కెట్లకు ప్రోత్సాహకరంగా ఉండదు. మార్కెట్లపై ప్రభావం చూపే మరకీలక అంశంగా విదేశీ మారక నిల్వలను పేర్కోవాలి. రూపాయి మార్పిడి రేటు. రూపాయి/డాలర్ మార్పిడి ధర, విదేశీ పెట్టుబడి ప్రవాహం వంటి అంశాలు వచ్చే వారం మార్కెట్ భావా న్ని ప్రభావితం చేస్తాయి. మొత్తం మీద వచ్చే వారం సస్సెక్స్ 85,000, సిఫ్టీ 26,000 పాయింట్ల వరకూ చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఖచ్చితమైన అంచనాలకు రావడం, సరైన అధ్యయనం చేయకుండానే పెట్టుబడులు పెట్టడం మంచిదికాదని హెచ్చరిస్తున్నారు.



## వారాంతంలో తగ్గిన బంగారం ధరలు



సుమారు రెండు నెలలుగా ఆకాశంలో విహరిస్తున్న బంగారం ధరలు, గత వారం మాదిరిగానే ఈవారం కూడా చివరిలో కొంత తగ్గాయి. ఈనెల 13వ తేదీ శనివారం 10 గ్రాముల బంగారం ధర రూ. 110 తగ్గింది. అయితే, పండుగ సీజన్ సమీపిస్తున్న కారణంగా, వచ్చే ఏడాది బంగారం ధర 4,500 డాలర్ల వరకు వెళ్లే అవకాశం ఉందని గోల్డ్‌న్ సాచ్స్ నివేదిక సూచించింది. నిపుణుల అంచనా ప్రకారం దీపావళి నాడు బంగారం 10 గ్రాముల ధర 1.25 లక్షలకు చేరవచ్చని ఈ నివేదిక తెలిపింది. కాగా శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాములు బంగారం ధర రూ. 1,11,170 వద్ద ట్రేడ్ అయింది. 100 గ్రాములు బంగారం ధర రూ. 1,100 తగ్గి రూ. 11,11,700గా ఉంది. శుక్రవారం నాటి ధరలతో పోలిస్తే, 24 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ. 11 తగ్గింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ. 11,117 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ. 10,190గా ఉంది. ఇక 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.8,337 పలుకుతున్నది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,100 తగ్గి రూ. రూ. 11,11,700 వద్ద ట్రేడ్ అయింది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ. 10,19,000గా కొనసాగుతున్నది. 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.8,33,700 వద్ద ట్రేడ్ అయింది. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను పరిశీలిస్తే.. 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,11,170, 22 క్యారట్ల బంగారం ధర రూ.1,01,900 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.83,370 గా నమోదైంది.

## జిఎస్‌టి తగ్గినా.. ధరలు తగ్గవు!

వినియోగదారుడిని ఏదో ఒక రకంగా ఆకర్షించి, మభ్యపెట్టి, దోచుకోవడమే బడా కంపెనీల నైజం. అదే వాటి వ్యాపార రహస్యం. ఫాస్ట్‌మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసిజి) రంగానికి వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) తగ్గింపు అమల్లోకి వచ్చినా, ధరలు మాత్రం తగ్గే అవకాశం లేదు. ఈ రంగంలోని కంపెనీలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎఫ్ఎంసిజి రంగం ఎప్పటికప్పుడు మారుతున్న పన్ను విధానాలకు, మార్కెట్ ధోరణులకు తగినట్టుగా తన వ్యూహాలను సర్దుబాటు చేసుకుంటూ వస్తోంది. తాజాగా జిఎస్‌టి కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంతో, సాధారణ వినియోగ వస్తువులపై పన్ను భారీగా తగ్గింది. బిస్కెట్లు, సబ్బులు, టూత్‌పేస్ట్‌లు వంటి అవసరమైన వస్తువులపై పన్ను రేటు 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం వినియోగదారులకు ఒక శుభవార్తగా కనిపిస్తోంది. కానీ ఈ లాభం వినియోగదారులకి ఏ రూపంలో అందుతుంది అన్నది చర్చనీయాంశంగా మారింది. దేశంలో వినియోగదారులు ప్రత్యేకంగా రూ.5, రూ.10, రూ.20 ధరల ప్యాక్‌లకు బలమైన అలవాటు పడ్డారు కాబట్టి, ప్రస్తుతం ఉన్న అలాంటి ప్యాక్‌ల ధరలను తగ్గించడానికి కంపెనీలు సుముఖత వ్యక్తం చేయడం లేదు. వినియోగదారుల మనస్తత్వంతో కంపెనీలు ఆటలాడుతున్నాయి. పలు ఎఫ్ఎంసిజి కంపెనీల వాదన ప్రకారం, ఈ ధరలు కేవలం ఆర్థిక పరిమితులు కాదు, ఒక రకమైన సైకాలజికల్ ప్రైస్ పాయింట్స్. ఉదాహరణకు, ఒక చిన్న పిల్లవాడు రూ.5 బిస్కెట్ ప్యాక్‌కి అలవాటు పడ్డాడు అంటే, దానిని రూ.4.50 లేదా రూ.6 చేయడం గందరగోళానికి దారి తీస్తుంది. అదే విధంగా, గిరాకీ ఎక్కువగా ఉన్న రిటైల్ దుకాణాల్లో కూడా చిన్నచిన్న నాణేలతో లావాదేవీలు జరగడం సౌకర్యంగా ఉండదు. అందుకే ధరను తగ్గించడం కష్టం. అయితే, అదే ధరకు ఎక్కువ వస్తువు ఇవ్వడం ద్వారా వినియోగదారులకి జిఎస్‌టి తగ్గింపు లాభం అందించవచ్చు. కానీ, అంతటి ఉదారంగా కంపెనీలు వ్యవహరిస్తాయా అన్నది అనుమానమే.

## పది లక్షల ఎకరాలను పంచిన ఘనత సాయుధ పోరాటానిది




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** నిజాంను మట్టి కరిపించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నాలుగువేల గ్రామాలను విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని పంచి, నాలుగు వేల అమరవీరులను అందించిన విప్లవ వీర చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. శనివారం హసన్‌పర్తి మండల కేంద్రంలో మెట్టు శ్యాం సుందర్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిథిగా కర్రె బిక్షపతి, నేదునూరి జ్యోతి మాట్లాడారు. హసన్‌పర్తి ప్రాంతంలో తోకల కొమురరెడ్డి, పాడి మల్లారెడ్డి, పాడి చంద్రారెడ్డి, గంగిల్ల లింగారెడ్డి, రేణికుంట్ల ఐలయ్య, పురేడి మల్లయ్య తదితరులు పేద ప్రజల విముక్తి కోసం కుటుంబాలను త్యాగం చేసి అమరత్వం పొందిన వీరులని కొనియాడారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదిరి శ్రీనివాస్ మాట్లాడారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సిపిఐ సీనియర్ నాయకులు,భారత్ బచావో నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్, షేక్ బాబు, రేణిగుంట్ల రాజయ్య, నేదునూరిసాంబయ్య, గోప రాజు భద్రయ్య, బందెల తిరుపతి, వడ్లూరి సుధాకర్ ముజీగా అజయ్ లక్ష్మ య్య,క్షరాశాల,ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## చొక్కారావు ఆశయ సాధనకు కృషి

### పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** సిపిఐనాయకులు, మాజీ ఎమ్మెల్యే చామనపల్లి చొక్కారావు విగ్రహాన్ని ఆయన స్వగ్రామంలో ఏర్పాటు చేయుటకు సిపిఐ జిల్లా సమితి కృషి చేస్తుందని, చొక్కారావు ఆశయాలను, లక్ష్యాలను నెరవేర్చడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా శనివారం కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో సిపిఐ జెండాను ఆవిష్కరించి చొక్కారావు చిత్రపటానికి పంజాల శ్రీనివాస్ నివాళులర్పించారు. సీనియర్ నాయకులు బుర్ర రాజమల్లును ఘనంగా సన్మానించారు.శ్రీనివాస్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, బానిసత్వంలో మగ్గుతున్న ప్రజల మానప్రాణాలను రక్షించేందుకు ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాల అగ్రనాయకులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మక్దుం మొహియుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. చొక్కారావులాంటిఎంతోమంది నాయకులు సాయుధ పోరాటంలో పాల్గొని ప్రజలకుఅండగా ఉన్నారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి,జిల్లాకౌన్సిల్‌సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, గ్రామశాఖ కార్యదర్శి మెరుగు కొమురయ్య, మాజీ సర్పంచ్ బొగొండ అయిలయ్య, నాయకులు నెల్లి రాజేశం, నాంపెల్లి రాజు, రాజమల్లు, తదితరులున్నారు.

## నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జనగామ:** నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర ముమ్మాటికి కమ్యూనిస్టులదే అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి ఏమాత్రం లేదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను పురస్కరించుకొని శనివారం జనగామలోని తెలంగాణ టైగర్ నల్లా నర్సింహులువిగ్రహానికిపూలమాల వేసి జాతాను ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సిపిఐనే నాయకత్వం వహించదని, ఆ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు లేదని మండిపడ్డారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాముల ఆరాచకాలు, ఆగడాలు సహించలేని సాధారణ ప్రజలు సైతం బందూకులు చేతబట్టి సాయుధ పోరాటం చేసి భూస్వాముల మెడలు వంచారని గుర్తు చేవారు. మహత్తరమైన సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాలుగు వేల మంది ప్రాణాలు అర్పించారన్నారు. ఇంతటి సాహసం, అమరత్వంతో కూడిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఉద్యమంలో పాల్గొనని బిజెపి ఈ రోజు ఇది హిందు, ముస్లీంల మధ్య జరిగిన సంఘర్షణగా చిత్రీకరించి భవిష్యత్తు తరాలకు తప్పుడు చరిత్రను అందిస్తే తెలంగాణ ప్రజలు సహించరని అగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నైజాం ముష్కరులను ఓడించి, ప్రజల్ని కాపాడి ఎర్రజెండా గెలిచిందన్నారు. అనాటి నుండి నేటి వరకు పేదల పక్షాల సాగు భూమి, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, రేషన్ కార్డులు వంటి అనేక సమస్యపై ఎర్రజెండాయే పోరాటం చేస్తుందన్నారు. అబద్దాలతో అధికారంలోకి వచ్చిపోయేవి కొన్ని పార్టీలైతే ఎర్రజెండా చివర వరకు ప్రజల పక్షాల నిలబడుతుందని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, నాయకులుల కావటి యాదగిరి, చామకూర యాకూబ్, చింతకింది అరుణ, పోపా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మచ్చ బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రను చెరిపితే చెదిరిపోయేది కాదు..

### ఎం.బాల నరసింహ




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్ట్ లేనని, పోరాట చరిత్ర చేరిపితే చెరిగి పోనిదని, అదే స్ఫూర్తితో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేయాలనీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నర్సింహా పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ రైతాంగసాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని సురవరం వెంకట్రామారెడ్డి, భవన్లో సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాల కిషన్ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహా మాట్లాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం 1947ఆగస్టు 15న వచ్చినా, హైదరాబాద్ సంస్థా నం మాత్రం నిజం పరిపాలనలోఉండేదన్నారు.భారతదేశంమొత్తంలో అత్యంత పెద్దది నిజాం నవాబు పరిపాలిస్తున్న హైదరాబాద్ సంస్థానమని, తెలుగు జిల్లాలు 8 మహా రాష్ట్ర జిల్లాలు 5 కర్ణాటక జిల్లాలు, 2 దీని విస్తీర్ణం దాదాపు 90 వేల చదరపు కిలోమీటర్లు ఇక్కడ 50% తెలుగు, 25% మరాఠి,12%కన్నడ ఇతర భాషలు మాట్లాడేవారు కానీ అధికారిక భాష ఉర్దూగానే ఉండేద న్నారు. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని 1947 సెప్టెంబర్ 11 న తెలంగాణ సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, మఖ్దూమ్ మోయునోదిన్ బద్ధం ఎల్లారెడ్డి, పిలుపునిచ్చారు. బిజెపి మాతృ సంస్త ఆర్ఎస్ఎస్‌కు పాత్ర లేదు కానీ నేడు మారేడు కాయకు మసిబూసి నట్టు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నిజం నవాబ్ మెడలు మంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలోకలిపినట్టు చెప్తున్నారన్నారు. ప్రత్యేక తెలంగాణ వచ్చి నేటికి 13 సంవత్సరాలు అవుతున్న సెప్టెంబర్ 17న తెలంగాణవిమోచనదినత్సోవం అధికారికంగా జరపడానికి బిఆర్ఎస్ కానీ, ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్ కానీ ఎందుకు ప్రకటించలేకపోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభు త్వం తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. సిపిఐ మహబూబ్ నగర్ మాజీ జిల్లా కార్యదర్శి పరమేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు రాము, పద్మావతి కృష్ణ, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ఏఐవైఫ్ జిల్లాకోకన్వీనర్‌మహేష్ చాంద్ బాషా, ఏఐటీయూసీ నాయకులు ఆంజనేయులు, సుందర్‌రాజ్,ప్రజాసంఘాల నాయకులు ఇందిరమ్మ, మాధవి, అంజనమ్మ, మంజుల ఉన్నారు.

## సాయుధ పోరాటం దేశానికి దిక్సూచి

### ఎస్‌కే. సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి నిజాం ప్రభుత్వాన్ని కూలగొట్టిన ఘనత కమ్యూనిస్టులదే అని, మట్టి మనుషులను పోరాట యోధులుగా మార్చింది ఎర్రజెండాయేనని, కమ్యూనిస్టులతో మమేకమట నాటి మట్టి మనుషులు సాగించిన వీరోచిత పోరాట ఫలితమే నేటి ప్రజాస్వామ్య తెలంగాణ రాష్ట్రమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. ఈ నెల 11 నుండి 17 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలలో భాగంగా సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ప్రదర్శన చేపట్టారు. చంద్రా రాజేశ్వరరావు భవన్ నుండి సాగిన ప్రదర్శన అమరజీవులు వృషారావు, నాదెండ్ల రామకోటయ్య, ఉప్పుశెట్టి ఖాదర్‌బాబు స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి పాత ఆర్‌డిఓ కార్యాలయం రోడ్‌లో గల అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ సాయుధ పోరాట నాయకులునల్లమల్ల గురుప్రసాద్, సిపిఐ మాజీ జిల్లా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధి వెంకటేశ్వర్లు విగ్రహాలకు నివాళులర్పించి సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటం నేటికి ప్రజలకు స్ఫూర్తినిస్తున్నదని దున్నేవాడికే భూమి నినాదం దేశ వ్యాప్తంగా చేసిందని కొనియాడారు.మహత్తరమైన, త్యాగపూరితమైన సాయుధ పోరాటన్ని మత పోరాటంగా చిత్రీకరిస్తూ నేటి ఆర్ఎస్ఎస్ వారసులుగా చలామని అవుతున్న బిజేపి లబ్ధిపొందే కుట్ర చేస్తోందని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బిజేపి పాత్ర ఎంత మాత్రం లేదని, కానీ చరిత్రను వక్రీకరించి పోరాటాన్ని తామే చేసినట్లుగా చెప్పుకొనే ప్రయత్నాలు చేస్తున్నదని సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు ముత్యాల విశ్వనాథం ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సబ్యులు ఉప్పుశెట్టి రాహుల్ అధ్యక్షన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సబ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా సమితి సబ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సాయుధపోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

### బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/చింతకాని:** నైజాం నిరంకుశపాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు. చింతకానిమండలంప్రొద్దుటూరులోతెలంగాణ సాయుధ పోరాటయోధులు తాళ్ళపల్లి రాములు స్థూపం వద్ద వారోత్సవాల్ని ప్రారంభించారు. తొలుత జెండా ఆవిష్కరించిన భాగం అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయనమాట్లాడుతూ నాటి మహత్తర పోరాటాన్ని బీజేపీ హైజాక్ చేసేందుకు యత్నిస్తుందని,రాచరికానికి నిర్బాంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ముస్లీం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందన్నారు. సాయుధపోరాటంలో నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారని బీజేపీ, ఎంఐఎం గుర్తుంచుకోవాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయకార్యదర్శిఅబ్బూరిమహేష్,రైతు సంఘం మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, వ్యకాస జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పగిళ్లపల్లి ఏసు, నాయకులు తాళ్ళపల్లి అజయ్, పెంట్యాల చలమయ్య,వేల్పులకోటయ్య,శాఖ కార్యదర్శి తుళ్లూరు శ్రీనువాసరావు,తుడుం గోపాలరావు, చేబ్రోలు ఇంద్రసేన,టీడీపీ నాయకులు పెంట్యాల రామారావు,బారాస నాయకులు పాపినేని రంగారావు, సీపీఎం నాయకులు పులి యజ్ఞనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఫిజిక్స్, కెమిస్ట్రీల బోధనకు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/వికారాబాద్ :**సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల బాలికలు మోమిన్‌పేట్, బూర్గుపల్లి, పాత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడమైనదని కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఎస్సి, బిఇడి చేసి ఉండాలని తెలిపారు. 16న ఇంటర్వ్యూ, డెమోస్ నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ ఉషాకిరణ్ తెలిపారు. ఇతర సమాచారం కోసం ఈ క్రింద ఫోన్ నంబర్స్ 6301013028, 7981718918ను సంప్రదించాలని తెలిపారు.



## క్రమశిక్షణ, ఆరోగ్యం ఉంటే సూపర్ సక్సెస్ సొంతం

### పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ప్రతీరోజు ఒక గంట వ్యాయమం చేస్తే ఆరోగ్యంగా ఉంటామని, క్రమశిక్షణ ఆరోగ్యం ఉన్న మనిషి సూపర్ సక్సెస్ అవుతాడని అనడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తాలోని గుడ్‌విల్ హోటల్ పైన నూతనంగా ఏర్పాటు చేసిన బెల్ పిట్‌నెస్ స్టూడియోను పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్ పిట్‌నెస్ స్టూడియోను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, బెల్ ఫిట్నెస్ స్టూడియో యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత సమాజంలో వ్యాయామం కేవలం శారీరక దారుఢ్యం కొరకే కాకుండా మనషి ఆరోగ్యానికి ఎంతైనా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, ఫిట్నెస్ స్టూడియో యాజమాన్య కుటుంబ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చిలుకానగర్ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం


**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకొని వైద్య నిపుణులను సంప్రదించటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. చైల్డ్ వికాస్ ఫౌండేషన్ సౌజన్యంతో చిలుకానగర్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. కేర్ ఆస్పత్రి, స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి, క్లోవ్ డెంటల్, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులతో ఉచిత వైద్య సేవలందించారు. చైల్డ్ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ విజయ రమేష్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో వచ్చిన వారికి అవసరం ఉన్న రోగులకు శస్త్ర చికిత్సలుఉ సైతం ఉచితంగా జరిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, బలరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## మీసేవా ఆపరేటర్ల సంక్షేమమే టిఎంఒఎ ధ్యేయం : బత్తుల జీవన్ ప్రసాద్

### మీసేవా ఆపరేటర్ల రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్ ప్రసాద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మీ సేవా ఆపరేటర్ల సంక్షేమమే టిఎంఒఎ ద్యేయమని మీ సేవా ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర అద్యక్షుడు బత్తుల జీవన్‌ప్రసాద్ అన్నారు. శనివారం శామీర్‌పేటలోని బృందావన్ హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీసేవా ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే టిఎంఒఎ లక్ష్యమని ఆయన అన్నారు. 2017లో మాత్రమే చివరి సారిగా మీ సేవా కమిషన్ పెంచడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పెంపు ఫైల్ సెక్షన్‌లో పెండింగ్‌లో ఉందని వెంటనే క్లియర్ చేసి ఆపరేటర్లను ప్రభుత్వ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతిరోజు 8 నుంచి 12 గంటలు వరకు శ్రమిస్తు ఆపరేటర్లు ప్రభుత్వ సేవలను నేరుఆ ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. దీంతో ఆపరేటర్లు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఇట్టి సమస్యలు ఎదుర్కొంటున్న ఆపరేటర్లకు, మీ సేవా కుటుంబాల సంక్షేమానికి ముందుకు వచ్చి మద్దతు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరన్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్, వర్కింగ్ ప్రసిడెంట్లు అశ్విన్‌గౌడ్, జగదీశ్వర్, లక్ష్మి నారాయణ, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అద్యక్షుడు సాగర్‌బాబు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌గౌడ్, శివకుమార్, పలు జిల్లాల బాద్యులు పాల్గొన్నారు.



## దుర్గామాత ఆలయానికి రూ.50వేలు విరాళం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:**గతంలో దీన్ దయాల్ నగర్ కాలనీలోని దుర్గామాత అమ్మవారి గుడి ప్రతిష్టకు రూ. 50వేల రూపాయలను విరాళంగా అందజేస్తానని మాట ఇచ్చిన బండి రమేష్ బస్తీకి వచ్చిన సందర్భంగా బస్తి, ఆలయ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డికి చెక్కును అందజేశారు. శనివారం ఫతేనగర్ డివిజన్ పర్యటనలో భాగంగా దీన్ దయాల్ నగర్ కాలనీలో టిపిసిసి ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడు తూ దీన్ దయాల్ నగర్‌లో గత కొన్ని నెలలుగా రోడ్డు డ్రైనేజీ పైపులు వేయలేదని వాటివల్ల బస్తీ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన జిహెచ్ఎంసి ఇఇకి ఫోన్ చేసి మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో రోడ్డు వేయడం జరుగుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షులు కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ తయారీ, సరఫరా కేంద్రాలతో

# మసక బారుతున్న మేడ్చల్ జిల్లా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పలుపారిశ్రామిక ప్రాంతాలతో వేలాది పరిశ్రమలతో రకరకా ల వస్తువులు, మందులు, కెమికల్స్, , పరిశ్రమల తయారీ యంత్రాలు, యంత్ర సామగ్రి, తిను బండారాలు, ఎలక్ట్రానిక్ లాంటి రకరకాల తయారీలతో రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నేడు నిషేధిత మత్తు పదార్థాల తయారీ కేంద్రాలుగా మారి మసకబారి పోతోం ది. వివిధ రసాయనాలు, మందుల తయారీ పేరిట లైసెన్సులు పొంది సంబంధిత అధికారులు తమ వైపు కన్నెత్తి చూడకుండా మామూళ్లతో ముంచెత్తి గుట్టు చప్పుడు కాకుండా ఇక్కడ తయారీ అవుతున్న మత్తు పదార్థాలు దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నారు.

ముంబయి పోలీసులకు చిక్కిన ఓ బంగ్లాదేశీ మహిళ ద్వారా వచ్చిన సమాచారంతో జిల్లాలోని చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని వాగ్దేవి లాబొరెటీజ్ పరిశ్రమపై దాడి చేసి 5 కిలోల 790 గ్రాముల మెఫోడ్రోన్ అనే డ్రగ్‌తో పాటు డ్రగ్స్ తయారీకి వినియోగించే 36 వేల లీటర్ల కెమికల్స్, 950 కిలోల పౌడర్‌ను స్వాధీనం చేసుకొన్న ఘటనే కాకుండా గతంలో ఇదే జిల్లాలోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న పెడ్లర్ల అరెస్టులు ఈ విషయాన్ని నిజం చేస్తున్నాయి. రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలన్న దురాశతో భారీ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి ప్రభుత్వం నిషేధించిన మత్తు పదార్థాలను తయారీ చేస్తూ దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నారు. దీని కోసం జిల్లాలోని మూతబడిన పరిశ్రమలు, సిక్ పరిశ్రమలను నిర్వాహకులు లీజ్‌కు తీసుకొని కెమికల్స్, మందుల తయారీ మాటున డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు.

ఇలాంటి పరిశ్రమలపై ఎవరి దృష్టి పడదన్న ఆలోచనతో డ్రగ్స్ తయారీకి వీటిని ఎంచుకొంటున్నారు. పైగా ఇలంటి చోట ఎలాంటి ఉత్పత్తులు పయారీ అవుతున్నాయన్న విషయాలను రసాయన నిపుణులు, సంబంధిత శాఖ అధికారులకు తప్ప సామాన్య జనాలకు కానీ, ఇక్కడ పనిచేసే కార్మికులకు కానీ తెలిసే అవకాశం లేదు, దీని కోసం నిర్వాహకులు పథకం ప్రకారం చదువు రాని వారినే కార్మికులుగా ఏర్పాటు చేసుకొంటున్నారు. డ్రగ్స్ లాంటి విషయాలు తెలుసుకోగలిగిన కెమిస్టులాంటి సాంకేతిక నిపుణులకు పెద్ద మొత్తాల్లో జీతాలు ఇచ్చి వారి నుండి ఎలాంటి సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జీడిమెట్ల, బాలానగర్, ఉప్పల్, నాచారంలాంటి పారిశ్రామిక ప్రాంతాల్లో వే (ఐడిఏ) లాది పరిశ్రమలు కొనసాగుతూ స్థానికులతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది పని చేస్తూ కుటుంబాలను పోషించుకొంటున్నారు.

**తాజా బోయినపల్లి ఉదంతం సైతం మేడ్చల్ జిల్లా పరిధే**

డ్రగ్స్ తయారీ అవుతున్న చర్లపల్లిలోని వాగ్దేవి లాబొరెటీస్‌పై ముంబయి పోలీసులు దాడి చేసి పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకొన్న ఉదంతం చోటు చేసుకొని పది రోజులు గడవక ముందే ఇదే జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే పాత బోయినపల్లిలోని మేధా పాఠశాల భవనంలో డ్రగ్స్ తయారీ కేంద్రం గుట్టు రట్టు చేసారు. భవనం మొదటి అంతస్తులో విద్యార్థుల తరగతి గదులు నిర్వహిస్తున్న పాఠశాల యజమాని గుట్టు చప్పుడు కాకుండా తయారీ చేసిన కిలోల కొద్దీ ఆల్ఫాజోలం అనే మాదకద్రవ్యాన్ని ఈగల్ టీం స్వాధీనం చేసుకొంది.


## సీనియర్ నాయకుడు సత్యనారాయణను కలిసిన బండారు దత్తాత్రేయ



**ప్రజాపక్షం/నాగారం:** బిజెపి సీనియర్ రాష్ట్ర నాయకులు మందార సత్యనారాయణ(98)ను మాజీ కేంద్ర సహాయ మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయన నివాసం నాగారంలో మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ దేశం ఫస్ట్, పార్టీ నెక్ట్స్, కుటుంబం లాస్ట్ అనే సిద్ధాంతాన్ని సత్యనారాయణ అనుసరించారని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా రెండు పర్యాయాలు, సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎంఎల్ఏగా పోటీ చేశారని, జాతీయ కార్యవర్గ సభ్యునిగా సేవలందించారని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,నాయకులు మర్రి మోహన్‌రెడ్డిమాజీ జెడ్‌పిటిసి సురేష్,వెంకట్‌రెడ్డి,బిజ్జ శ్రీనివాస్‌గౌడ్,నాగరాజ్‌యాదవ్,రవీందర్‌రెడ్డి,కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యతో నిజాం షుగర్ కాలనీ వాసుల ఆవేదన



- అవుట్‌లెట్ లేని డ్రైనేజీ, నిల్వ నీటితో వ్యాధుల ముప్పు
- దుర్వాసన కారణంగా ప్రజలు ఊపిరి తీసుకోవడమే కష్టం
- పాములు, క్రిమికీటకాలు విపరీతంగా రావడం



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** నారపల్లి పరిసరాల్లో ఉన్న నిజాం షుగర్ కాలనీ కాలనీ ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు.కాలనీలోని రోడ్ నెంబర్ 1, 2, 3, హరివిల్లు హోమ్స్, బాబా నగర్ కాలనీలకు డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చినప్పటికీ అవుట్‌లెట్ ఏర్పాటు చేయకుండా డమ్మీ పైపులు వేశారు. ఈ పైపుల ద్వారా వచ్చే మొత్తం మురుగు నీరు రెండు ఎకరాల ఓపెన్ ప్లాట్‌లో నిల్వ వుతోంది. నిల్వ నీటి కారణంగా మురికి వాసనతో ప్రజలు ఊపిరి తీసుకోవడమే కష్టమైపోతోంది. దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వ్యాధుల బారిన పడుతున్నారు. అంతేకాదు పాములు, అనేక రకాల క్రిమికీటకాలు రాకపోకలు చేస్తుండటంతో ప్రజలు రాత్రిళ్లు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేశాం. స్థానిక కౌన్సిలర్, మున్సిపాలిటీకి తెలియజేశాం. కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. డ్రైనేజీ సమస్య వల్ల మాకు జీవనమే కష్టమైపోతోంది అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు డిమాండ్ చేస్తూ తక్షణమే ఓపెన్ ప్లాట్‌లో నిల్వ నీటికి శాశ్వత పరిష్కారం చూపించి, సరైన అవుట్‌లెట్ ఏర్పాటు చేయాలి. లేకపోతే ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. ప్రజల ప్రాథమిక సౌకర్యాల పట్ల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి అని విన్నవిస్తున్నారు. అనేకసార్లు స్థానిక కౌన్సిలర్, పోచారం మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశాం. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక మేము మౌనంగా ఉండం, సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం అని వాసులు స్పష్టం చేశారు. కాలనీ వాసులు పై అధికారులను వేడుకుంటూ, వెంటనే డ్రైనేజీకి సరైన అవుట్‌లెట్ ఏర్పాటు చేసి నిల్వ నీరు తొలగించాలి. మా ఆరోగ్యం, జీవనమే ప్రశ్నార్థకం అవుతోంది అని విజ్ఞప్తి చేశారు.




## కార్పొరేట్ రంగానికి భవిష్యత్ నాయకులు విద్యార్థులే..

* శామీర్‌పేటలోని నల్సార్‌లో కార్పొరేట్ గవర్నెన్స్ 2025
* ముగింపు వేడుకలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భారతదేశ కార్పొరేట్ భవిష్యత్తును రూపొందించడంలో కీలకమైన స్తంబాలుగా నీతి, భాద్యతలు స్థిరంగా ఉంటాయని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. శనివారం శామీర్‌పేటలోని నల్సార్‌లో ఈ నెల 12, 13న నల్సార్ జస్టిస్ క్యాంపస్‌లో ఇన్సిట్యూట్ ఆఫ్ కంపెని సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ), నల్సార్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల వార్షిక కార్యక్రమం కార్పొరేట్ గవర్నెన్స్ 2025 (కార్ప్‌కార్న్) ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ విచ్చేశారు. నల్సార్ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ కృష్ణదేవరావు, ఐసిఎస్ఐ మాజి అద్యక్షుడు, అధ్యాపకులు, ప్రముఖులు గవర్నర్‌కు స్వాగతం పలుకుతు మొక్కలను అందజేశారు. అనంతరం 2016 ఇన్సాల్వేన్సి అండ్ బ్యాంక్రప్సి కోడ్ వంటి మైలురాయి సంస్కరణలో ఒకటి ఇది నిశ్చయతను తీసుకవస్తుందన్నారు. రుణదాతల విశ్వాసాన్ని పునరుద్ధరిస్తుందని, జవాబుదారితనాన్ని నిర్ధారిస్తుందని ప్రతి పౌరుడిలాగే కార్పొరేట్ పౌరులు కూడ న్యాయంగా పారదర్శకంగా, సుస్థిర అభివృద్ధి ప్రకృతి సమతుల్యత పట్ల బాధ్యతను కలిగి ఉంటుందని గుర్తు చేశారు. స్థానిక గిరిజన సమాజాల నుంచి కూడ కార్పొరేట్ నిపుణులు పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. మనం భూమి యజమానులం కాదని మనం గుర్తించాలని చెప్పారు. ఆ భూమిని పంచుకోవడానికి, నిలబెట్టడానికి మనం ఇక్కడ ఉన్నామని అన్నారు. నల్సార్ వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ ఐబిఎల్ మాస్టర్స్ ప్రోగ్రామ్ (2023) పరిచయం మరియు విద్యలో నాణ్యత ప్రాముఖ్యతను వివరించారు. సహజ వనరులను సంరక్షించడం మరియు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాదించడానికి కృషి చేయడం పారిశ్రామిక ఉత్పాదక రంగం బాద్యత అని ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేవారికి గుర్తు చేశారు. అనంతరం సిఎస్ఆర్ వెంకటరమణ, సిఎస్‌బి నర్సింహాన్‌లు ముఖ్యమైన ప్రసంగాలు చేశారు.

ప్రోఫెసర్ శ్రీనివాస సుబ్బారావు కాన్ఫరెన్స్ నివేదికను సమర్పించారు. అనంతరం ముఖ్య అతిదిగా విచ్చేసిన గవర్నర్‌ను సిఎస్‌బి నర్సింహాన్, సిఎస్ఆర్ వెంకటరమణలు ఘనంగా సత్కరించారు. వైస్ చాన్సలర్ మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్సార్ న్యాయవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వాసంతి, విద్యార్థులు, వాలంటీర్లు, నిర్వాహక కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## మనలోని భావాలకు భాష్యం చెప్పే కళ ఫోటోగ్రఫీ

**కుత్బుల్లాపూర్/ప్రజాపక్షం :** మనలోని భావాలకు భాష్యం చెప్పే కళ ఫోటోగ్రఫీ అని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. శనివారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరినగర్ నందు కె.అభిషేక్ రెడ్డి, జి.రాకేష్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ.ఆర్.క్యాప్చర్ స్టూడియోను బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు అభిషేక్‌రెడ్డి, రాకేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఏ.ఆర్.క్యాప్చర్స్ మరిన్ని శాఖలకు విస్తరిస్తూ దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మాధవరం రోజాదేవి రంగారావు, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, నాయకులు మల్లేష్‌గౌడ్, అజమ్, మెట్ల శ్రీను, శశిధర్, బండ మహేందర్, వెంకటేష్, మహిళల నాయకురాలు త్రివేణి, తదితరులు పాల్గొన్నారు

## జాతీయ లోకాదాలత్‌లో 27000కేసులు పరిష్కారం

### వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/వికారాబాద్:**వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా లోకాదాలత్‌లో 27000 కేసులు పరిష్కరించడం జరిగింది అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వికారాబద్ కోర్టులోని సివిల్ కేసులు 14, ప్రిలిటిగేషన్ కేసులుకేసులు 94,వికారాబాద్,తాండూర్, పరిగి,కొడంగల్ కేసులను పరిష్కరించడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ భారతదేశ న్యాయ వ్యవస్థలో చాలా మంచి గొప్ప సుగుణాలు ఉన్నాయని భారత న్యాయ వ్యవస్థలపై ప్రపంచ వ్యాప్తంగా గొప్పగా చెప్పుకుంటారన్నారు. న్యాయ వ్యవస్థలో కోర్టులపై పని భారం ఎక్కువ అవడమో లేదా సరైన న్యాయ మూర్తులు లేకపోవడం లేదా మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇవన్నీ కారాణాల వల్ల సత్వర న్యాయం అందించలేకపోతున్నాం అన్నారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీ పడితే కొన్ని కేసుల్లో అయినా సత్వర న్యాం అందితే కోర్టుల మీద పనిభారం తగ్గుతుంది. ప్రజల్లో కోర్టులపై నమ్మకం పెరుగుతుంది. ప్రజల్లో కూడా శాంతిసామరస్యాలు నెలకొల్పేందుకు అవకాశం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం 1987లో న్యాయ సేవా అధికార చట్టం తీసుకురావడం జరిగింది అని అన్నారు. దీనివల్ల రాజాపాదర్గ కేసులన్నీ రాజీకుదుర్చే అవకాశము ఉంటుందనే లోక్‌దాలత్‌ను ఏర్పాటు చేసి దీని ద్వారా చిన్న చిన్న కేసులను సాగదియ్యకుండా రాజీపడితే వారి ఇరువురి సత్వర న్యాయం జరుగుతుంది అని అన్నారు భార్యభర్తల కేసు లు, కుటుంబ తాగదాల కేసులు అన్నాదమ్ముల కొట్లట కేసులు,పొలాల గట్ల పంచాయతీ కేసులు చెక్ బౌన్స్ కేసులు మోటార్ ఆక్సిడెంట్ కేసులు ఇలాంటివి రాజీ పడదగ్గ కేసులు పరిష్కరించబడుతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయ మూర్తి చంద్రకిశోర్ , సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు ,శాంతిలత, వైష్ణవి ,జిల్లా ఎస్‌పిలు, తదితరులు పాల్గొ

## విద్యార్థుల పేరుతో రాజకీయం చేయడం సిగ్గుచేటు

### తాండూరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు




**ప్రజాపక్షం/తాండూరు:** విద్యార్థుల పేరుతో ప్రతిపక్షాలు రాజకీయం చేయడం సిగ్గు చేటరని తాండూరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు ఘాటుగా విమర్శించారు. శనివారం తాండూరు పట్టణ శివారులోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు గత పాలకులే కారణమని, అవసరం కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తి పోస్తున్నారని తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో బిఆర్ఎస్ అనుబంధంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపిల కళాశాలలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించిన ఘనత ఆ ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. ఉద్యమ నాయకులుగా తాండూరులో తిరుగుతున్న ఉద్యమ నాయకుడికి పదేళ్ళ మీ బిఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులకు సంబంధించిన కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచే ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్, మెస్‌చార్జీలను పెంచిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. పదేళ్ళలో ఒక్కరోజు కూడా యూనివర్శిటీలను సందర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సమయం దొరక లేదని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం సంకేళ్ళులేని రాజ్యంను నడిపిస్తుందని, దీనికి నిదర్శనం యూనివర్సిటీలలో సిఎం రేవంత్‌రెడ్డి సందర్శనే నిదర్శనమన్నారు. వచ్చే డిసెంబర్‌లో ఒయులో భారీ బహిరంగ సభను పెట్టి యూనివర్సిటీలకు భారీ నిధులు కేటాయించ బోతుందని కాంగ్రెస్ ప్రభుత్వమని తెలిపారు. పదేళ్ళ బిఆర్ఎస్ బిజెపి పాలనలో దేశం, రాష్ట్రంలో ఇరుద్యోగులను మోసం చేస్తూ న్నే వస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రంలో 60 వేల నిరుద్యోగ కుటుంబాల్లో ఉద్యోగాలు ఇచ్చి వారి జీవితాల్లో వెలుగు నింపిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. తాండూరు అభివృద్ధి గూర్చి మాట్లాడే నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ పత్రికా సమావేశంలో అగ్గనూరు వీరేశం, మహేష్ అల్తాఫ్, సుధాకర్, రాఘవేందర్‌రెడ్డి, శ్రీహరి, రఫిక్, ప్రశాంత్, నవీన్ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు

### ఆహ్వానించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** ప్రజావ్యతిరేక పాలన అంతం కావాలంటే రాష్టం లో మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నవాబుపేట మండల మాజీ వైస్ ఎంపిపి కౌకుంట్ల బందయ్య గౌడ్ ఆయనతోపాటు మండలంలోని ఆయా గ్రామాల మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మండల నాయకులతో కలిసి సుమారు 100 మంది నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రె స్ ప్రభుత్వం ప్రజాపాలనలో వైఫల్యం చెందిందని గ్రామగ్రామాన నేడు అందరూ బీఆర్ఎస్ వైపు చూస్తుంది.

యూరియా కోసం రైతన్నలు అవస్థలు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా కావటం లేదన్నారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రైతులను పట్టించుకోవడం లేదని ప్రజలు గమనిస్తున్నారని అందుకే తెలంగాణకు కెసిఆర్ శ్రీరామ రక్ష అందుకే అందరూ నేడు బిఆర్ఎస్ లో పెద్ద ఎత్తున చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో మళ్ళీ రాబోయేది కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నాగేందర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు భరత్ రెడ్డి, మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి, విజయ్ కుమార్, శాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పెండింగ్‌లో ఉన్న రూ.8300కోట్ల బకాయి చెల్లించాలి

ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే ప్రభుత్వం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశంలో పవన్ చౌహాన్ మాట్లాడారు.విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెప్పడం కాదు పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అందాల పోటీలకు నిధులు ఉంటాయి..కానీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించేందుకు నిధులు మాత్రం ఉండవా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు సుమారు రూ.8300 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

# రూ. 500 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

### శంషాబాద్‌లో 12 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
### ప్రహరీతో పాటు లోపల వేసిన షెడ్డుల తొలగింపు
### 12 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ భూములే పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న హైడ్రా తాజాగా రూ.500 కోట్ల విలువైన భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో రూ. 500 కోట్ల విలువైన 12 ఎకరాల భూమిని శనివారం స్వాధీనం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం శాతంరాయ్ గ్రామంలోని సర్వే నెంబర్ 17లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించింది. చుట్టూ నిర్మించిన ప్రహరీని, లోపల ఉన్న షెడ్డులను తొలగించింది.

### 12 ఎకరాల భూమి స్వాధీనం..

ఈ భూమిని రాష్ట ప్రభుత్తం 2011 లో ఇంటర్‌మీడియట్ ఎడ్యూకేషన్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ భూమి తమదంటూ స్థానికంగా నాయకులుగా చెలామణి అవుతున్న ఓ నాయకుడితో పాటు అనీష్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థ క్లెయిమ్ చేస్తోంది. ఈ మేరకు అక్కడ అనీష్ కన్స్ట్రక్షన్ సంస్థ బోర్డులు పెట్టింది. కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించడంతో స్థానికులు హైడ్రాకు ఫొటోలను పంపించారు. రాళ్ళు రప్పలతో వ్యవసాయ వినియోగానికి అవకాశం లేని ఈ ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తున్నామంటూ అసఫ్ జాహీ పైగా కుటుంబ వారసుల నుంచి కొన్నామంటూ కబ్జాదారులు చెబుతున్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యూకేషన్ అధికారులు కూడా ఇదే సమయంలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇలా స్థానికులతో పాటు ఇంటర్‌మీడియట్ బోర్డు వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. స్థానిక రెవెన్యూఅధికారులతోకలసిక్షేత్రస్థాయిలో పరిశీలించింది.

### శంషాబాద్ మండలంలో పైగా భూములు లేవు..

శంషాబాద్ పరిధిలో పైగా కుటుంబాలకు చెందిన భూములు లేవని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారు. వేరే చోట ఉన్న ఆ భూముల రికార్డులను ఇక్కడ చూపించి కబ్జాలకు పాల్పడినట్టు స్పష్టం చేశారు. అనీష్ కన్స్ట్రక్షన్స్ సంస్థకు చెందిన శ్రీపాద దేశ్ పాండే పలు భూముల వివాదాల్లో ఉన్నట్టు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ అంశాలన్నింటిని పరిశీలించాక, శంషాబాద్ మండలం శాతం రాయ్ గ్రామంలో ఉన్న 12 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఈ 12 ఎకరాలలో ఒక ఎకరం పరిధిలో ఉన్న కొన్ని నివాసాలు, ఒక దేవాలయం, మసీదును కాపాడుతూనే మిగతా భూమికి కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తున్నట్టు హైడ్రా బోర్డు పెట్టింది.

## జూబ్లీహిల్స్‌లో జోరుగా అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ డివిజన్‌లలో రూ. 8.49 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు,నగరమేయర్‌గద్వాల్‌విజయలక్ష్మి పాల్గొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లోని నవోదయ కాలనీ, మారుతి నగర్, కమలాపురి కాలనీ, ఇంజనీర్స్ కాలనీలలో రూ. 1.78 కోట్లతో సిసిరోడ్ల నిర్మాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. దీంతో పాటు, లేబర్ అడ్డా రోడ్డులో రూ. 3.77 కోట్లతో ఎల్ఎన్ నగర్, యూసుఫ్‌గూడ బస్తీ, శ్రీకృష్ణ నగర్, హైలం కాలనీలలో 14 సిసి రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని భారత్ నగర్ ఎక్స్ రోడ్డు, నేతాజీ నగర్, సుల్తాన్ నగర్, ప్రేమ్ నగర్, శంకర్ లాల్ నగర్, రాజీవ్ నగర్‌లలో రూ. 2.94 కోట్లతో 11 సిసి రోడ్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని, సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని నాయకులు కోరారు.

## 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలి

### జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జులై 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం2025లో భాగంగా ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు ఓటరు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

### అవకాశాలను సద్వినియోగం చేసుకోండి..


– ఫారం6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.
– ఫారం7 ద్వారా ఓటరు జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపులపై అభ్యంతరాలు తెలియజేయవచ్చు.




– ఫారం8 ద్వారా జాబితాలో మార్పులు, నివాసం మార్పు, దివ్యాంగులుగా గుర్తింపు, ఎపిక్ రీప్లేస్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (విహెచ్ఎ) లేదా అధికారిక వెబ్‌సైట్లు ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని ఆయన సూచించారు. మరింత సమాచారం కోసం బూత్ లెవెల్ ఆఫీసర్ (బిఎల్ఓ), ఎఇఆర్ఓ, ఇఆర్ఓ, డిఇఓలను సంప్రదించవచ్చని, లేదా 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు కావడం కేవలం హక్కు మాత్రమే కాదని, బాధ్యత కూడా అని ఆయన స్పష్టం చేశారు.

## నిరంతరం కురుస్తున్న వర్షాలు.. పాడవుతున్న పంటలు, రోడ్లు





**ప్రజాపక్షం/షాబాద్:** రైతులు ఆరుకాలం కష్టపడి అప్పులు చేసి భూములను చదును చేసి పంటలు సాగు చేస్తే చేతికి వచ్చే సమయంలో అతివృష్టిగా మారిం ది. గత 15 రోజులుగా బంగాళఖాతం వాయుగుండం ప్రభావంతో నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలు, రోడ్లు పాడవుతున్నాయని ఆయా గ్రామాల రైతులు, ప్రయాణికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని హైతాబాద్, పోతుగల్, చందనవెల్లి, రుద్రారం గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారిందని వాహణ దారులు భయాందోళనకు గురౌవుతున్నారు. మండల పరిధిలోని దైవాలగూడ గ్రామానికి చెందిన కడమంచి జంగయ్య సాగు చేసిన పత్తి పంట పూర్తిగా నీరు పట్టి పత్తి మొక్కలు చనిపోతున్నట్లు వాపోయ్యారు. మల్లారెడ్డిగూడ, నాగర్‌కుంట, కొమరబండ, దేవునిగడ్డ, రుద్రారం తదితర గ్రామాల్లో వర్షాల కారణంగా పత్తి , క్యాలిప్లవర్ ఇతర కూరగాయ పంటలు నష్టం జరిగిందని రైతులు వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారులు స్పందించి నష్ట పోయిన పంటలకు న్యాయం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

## విద్యార్థులు, ఉద్యోగులకు 'ఎఐ'పై అవగాహన ఉండాలి

### గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఎన్నో రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తీసుకువచ్చిందని, విద్యార్థులు, ఉద్యోగులు ఏఐని సద్వినియోగం చేసుకొని అవగాహన పెంచుకోవాలని గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. శనివారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలోని కుంట్ల రాంరెడ్డి పంక్షన్ హాల్‌లో షాద్‌నగర్ గిరిజన గురుకుల డిగ్రీ, పిజీ మహిళా కళాశాల ఆధ్వర్యంలో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధాస్సు)పై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిధిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తోపాటు స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మామాట్లాడుతూ అర్టిఫియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, నిపుణులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్లిష్టమైన పనులు సులువుగా పూర్తి చేసేందుకు ఎంతగానో ఏఐ ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థుల రైటింగ్ నుండి మొదలుకొని ప్రాజెక్టు మేనేజర్ వరకు అన్ని రంగాల్లో ఏఐ ఉపయోగపడుతుందని, విద్యార్థులు, నిపుణులు ఫీల్డ్‌లో సక్సెస్ అవుతున్నారని వివరించారు. ఏఐ అనేది ఒక ట్రాన్స్‌క్రిప్షన్ అసిస్టెంట్ టూల్‌గా పని చేస్తుందని, మాట్లాడే భాషను టెక్స్ట్‌గా మార్చడంతోపాటు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు, సభలు, సమావేశాల్లో పాల్గొనే నిపుణులకు ఎంతో చక్కగా పనిచేస్తుందని పేర్కొన్నారు. కొత్త డిజైన్లు, కళలు, ప్రాజెక్టులను సృష్టించడంతోపాటు సృజనాత్మక రంగాల్లో పని చేసే వారికి గొప్ప సాధనంగా ఉంటుందని అన్నారు. ఏఐ అన్ని రంగాలను అనునిత్యం అర్థం చేసుకోవడంతోపాటు కృత్రిమ మేదస్సుకు పదును పెట్టే విధంగా పని చేస్తుందని తెలిపారు. ఏఐ అనేది మానవ మేదస్సుతో ముడిపడి ఉన్న పనులను నిర్వహించడానికి గణన వ్యవస్థల సామర్థ్యంనే ఏఐ అంటారని వివరించారు. ఏ మానవుడైనా సముచిత సమయంలో స్వయంగా విశ్లేషించలేనంత ఎక్కువ సమాచారాన్ని కలిగి ఉంటాయని పేర్కొన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో ఏఐ వచ్చిందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో స్థిరపడాలని సూచించారు. కంప్యూటర్ యుగంలో అనేక కొత్త విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, వాటిని అనుగుణంగా విద్యార్థులు మారడంతోపాటు అలవర్చుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఉన్నతమైన విద్యను అభ్యసించడంతోపాటు కంప్యూటర్ విద్యపై దృష్టి కేంద్రీకరిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని అన్నారు. కంప్యూటర్ విద్యను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ఏమాత్రం తీసిపోకుండా ఉండేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అంధిస్తున్నట్లు తెలిపారు. విస్తృత శ్రేణి సాఫ్ట్‌వేర్, సాంకేతిక రంగాలను విద్యార్థులు, యువత అంధిపుచ్చుకొని ఉన్నతమైన రంగాల్లో రాణించాలని సూచించారు. అన్ని రంగాలను చుట్టుముట్టుతున్న అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని కోరారు. గిరిజన శాఖ కార్యదర్శి సీతా లక్ష్మీ (ఐఏఎస్), కాంగ్రెస్ నేతలు విశ్వం, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, శివశంకర్ గౌడ్, రాయికల్ శ్రీనివాస్, మహ్మద్ ఇబ్రహీం, లింగారెడ్డిగూడ అశోక్‌లుతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# శంకరపల్లిలో హడలెత్తిస్తున్న దొంగలు

### - పట్టపగలు కారును అపి రూ.40 లక్షలు దోచుకెళ్లిన సంఘటన
### - స్కూటీ డిక్కీ లో నుంచి రూ.రెండు లక్షల 98 వేలు అపహరణ



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస చోరీలతో దొంగలు హలలెత్తిస్తున్నారు. శుక్రవారం నాడు శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హుస్సేన్ పూర్ గ్రామ శివారులో కారును ఆపి 40 లక్షలు దొంగిలించిన సంఘటన కలకలం సృష్టించగా, అదే రోజు శంకరపల్లి పట్టణములో పట్టపగలు మరొక సంఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఓ ల్యాబ్ లో పనిచేసే వ్యక్తి బ్యాంకులో డిపాజిట్ చేయడానికి రెండు లక్షల 98 వెలతో వెళ్తే ఆ డబ్బులు కాస్తపట్టపగలేదొంగలు దర్జాగా దోచుకెళ్ళారు. నాలు గైదురోజుల క్రితం మహాలింగాపురం గ్రామానికి చెందిన వ్యక్తి యొక్క మోటార్ వైండింగ్ షాపు నుండి విలువైన మోటర్లు వైర్లను దొంగిలించారు.హుస్సేన్ పూర్ సంఘటనకు సంబంధించి 24 గంటల్లోనే దోపిడీ దొంగల ముఠా ను పట్టుకొని ఒక వైపు కమిషనర్ కార్యాలయంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయగా, అదే రోజు మరొక దొంగతనం సంఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదుకోవడం గమనార్హం. సీసీ కెమెరాలు ఇతరత్రాఆధారాలతోదొరుకుతామనితెలిసినా దొంగలు ఈ విధమైన సం ఘటనలకు పాల్పడడం విశేషంగా చెప్పవచ్చును.

### శంకర్ పల్లిలో పట్టపగలే రూ.2.98 లక్షల చోరీ

పట్టపగలే స్కూటీలో నుంచి భారీగా నగదు ఎత్తుకెళ్లిన ఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం మండలం లోని ఎర్వగూడ గ్రామానికి చెందిన ప్రదీప్ గౌడ్ శుక్రవారం మధ్యాహ్నం బ్యాంకులో డిపాజిట్ చేయడానికి రూ. 2.98 లక్షలు బ్యాంకుకు తీసుకువెళ్లాడు. అక్కడ జనాలు ఎక్కువగా ఉండడంతో స్కూటీలో డబ్బులు పెట్టి తిరిగి పనిచేసే వన్ ల్యాబ్కి వెళ్లాడు. ఇద్దరు స్కూటీ డిక్కీలోంచి డబ్బును తీసుకొని పరారయ్యారు. కేసు నమోదైంది.ఒకే రోజు శంకర్ పల్లి పోలీస్ స్టేషన్లో జరిగిన ఈ రెండు దొంగతనాలు స్థానికకంగా సంచలనంగా మారాయి.

## గచ్చిబౌలిలో నూతన విన్‌ఫాస్ట్ ఇండియా ఎలక్ట్రిక్ వాహనాల షోరూమ్ ఏర్పాటు

### విన్‌ఫాస్ట్ ఇండియా డిప్యూటీ సిఇఒ అరుణోదయ్ దాస్




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** హైద్రాబాద్‌లోని గచ్చిబౌలిలో విన్‌ఫిస్ట్ ఎలక్ట్రిక్ వాహనాల మొదటి షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విన్‌ఫాస్ట్ ఇండియా డిప్యూటీ సీఈఓఅరుణోదయ్ దాస్, నామేష్ అటోమేటివ్స్ ప్రైవేట్ టిమిటెడ్ డైరెక్టర్ అక్షయ్ జైన్‌లు విచ్చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం సీఈఓ అరుణోదయ్ దాస్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధ డిజైన్ స్టూడియోలైన పినిన్‌ఫరినా, టొరినో రూపోందించిన ప్రిమియమ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు, పర్యావరణ అనుకూల భవిష్యత్తుకు కట్టుబడి వీఎఫ్6, వీఎఫ్7 మోడల్ కార్లను మార్కెట్ లోకి విడుదల చేశామని తెలిపారు. ఈ కార్లను ఒక్కసారి చార్జ్‌చేస్తే 460520 కీలోమీటర్ల డ్రైవింగ్ రేంజ్ వస్తుందని , దీనితో పాటు పదేళ్ళ బ్యాటరీ వారంటీఅందిస్తున్నామని తెలిపారు. ఏడు ఎయిర్ బ్యాగులతో పాటు సన్‌రూఫ్, లెవల్2 అడాస్, 360' డిగ్రీస్ కెమెరాతో కనెక్టెడ్ టెక్నాలజీ, లగ్జరీ ఇంటీరియర్లప్రీమియం ఫీచర్లు అందుస్తున్నామని తెలిపారు. కార్ల ధరలు వీఎఫ్6 ఎక్స్ షోరూమ్ ధర 16.50లక్షలు,వీఎఫ్7ఎక్స్ షోరూమ్ ధర 20.89 లక్షల నుంచి ప్రారంభం అవుతున్నాయన్నారు. 2025 చివిరి నాటికి 27 నగరాల్లో 35 డిలర్‌షిప్‌లు,26 వర్క్‌షాపులతో విస్తరించనున్నామని తెలిపారు.తమిళనాడులోనితూత్తుకుడిలో కొత్త తయారీ ప్లంట్‌లో50,000 వెల వాహనాల సామర్థ్యంతో భారత్‌లో చార్జింగ్ మౌళిక సదుపాయలు బ్యాటరీ ఉత్పత్తితో పాటు ఈవీ అభివృద్దిలో తమ దీర్ఘకాల పెట్టుబడిని ప్రతిబింబిస్తామని తెలిపారు.

## హోలియా కాలేజ్ ప్రిన్సిపాల్‌ను విచారించండి : సంజీవరెడ్డి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** తనను మానసికంగా వేధింపులకు గురిచేసిన హోలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మరో ఇద్దరు ఉన్నతాధికారులపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగు లెక్చరర్ ఎస్. సంజీవరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎంఎల్‌సి శ్రీరాములు, రిటైర్డ్ హిందీ పండిట్ హరిహర నాథ్ గుప్తాతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తాను హోలియాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నానని తెలిపారు. అయితే, ప్రిన్సిపాల్ విజయ్ నాయక్ తనపై కక్షగట్టి కులపరంగా వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారులు ఎలాంటి విచారణ చేపట్టకుండానే తనను వికారాబాద్‌కు బదిలీ చేశారని తెలిపారు. అక్కడ తెలుగు పోస్టు లేకపోవడంతో తాను హైకోర్టును ఆశ్రయించగా, బదిలీ ఉత్తర్వులను రద్దుచేస్తూ విచారణ జరిగే వరకు హోలియాలోనే విధులకు ఉత్తర్వులిచ్చిందన్నారు. హైకోర్టు ఉత్తర్వులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఐదున్నర నెలల కాలయాపన తర్వాత 2024 ఆగస్టు 5న తిరిగి పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. తన విషయంలోనే కాదు మిగతా ఉద్యోగులను కూడా విజయ్ నాయక్ వేధించారని ఆరోపించారు.అతనిని విచారించి,న్యాయంచేయాలనిఆయనకోరారు.

## వడ్డెర్ల అభ్యున్నతికి పాటుపడుతా:వేముల



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** వడ్డెర సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొంటాం, వారి అభ్యున్నతికి పాటుపడతామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రంలో వడ్డెర సంఘం బలోపేతానికి కార్యవర్గం ఏర్పాటైందని పేర్కొన్నారు. జాతీయ ప్రధానకార్యదర్శిగా గుంజా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అశోక్, జాతీయ సంయుక్త కార్యదర్శిగా మొక్కల శేఖర్, యువజన అధ్యక్షులుగా డాక్టర్ వేముల శ్రీనివాస్, కార్యదర్శిగా వేముల మధుసూదన్‌లను నియమించినట్లు వివరించారు. పేదరికంలో మగ్గుతున్న వడ్డెరను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషిచేయాలని లక్ష్మణ్ సూచించారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చాలి: టియుఎఫ్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.శనివారం రాష్ట్ర టియుఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం చేరుకోవటంతో ఇబ్రహీంపట్నం తెలంగాణ ఉద్యమ కారులు ఘన స్వాగతం పలికారు.రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారులకు 250గజాల ఇంటి స్థలం,పింఛన్‌తో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టియుఎఫ్ నాయకులు దళిత్ శ్రీనివాస్,బోసుపల్లి వీరేష్ కుమార్,జానకి రెడ్డి, శ్యామల రంగారెడ్డి, కొంతం యాదిరెడ్డి, బట్టి మహేందర్, మాచర్ల శంకర్, వెంకటేష్, కిషన్, జంగయ్య, పాండు పాల్గొన్నారు.

## కుటుంబాల మధ్య తగాదా.. దాడి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కుటుంబాల మధ్య తగాదా చోటు చేసుకోవడంతో వేట కొడవళ్లు, కర్రలతో దాడికి దిగిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. సిఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన గంతల ప్రభు మొదటి భార్య కుమారుడు గంతల పృథ్వీరాజ్‌పై రెండో భార్య కుమారుడు గంతల సందీశ్వర్ వేట కొడవళ్లు, కర్రలతో దాడి చేసినట్లు వివరించారు. శనివారం ఉదయం గంతల పృథ్వీరాజ్ తన పిల్లలతో కలిసి పాలు తీసుకువచ్చేందుకు ఇంటి నుండి బయట వెళ్లారు. కేశంపేట రైల్వేగేటు వద్ద కాపు కాసి వేట కొడవళ్లతోపాటు కర్రలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు సిఐ తెలిపారు. గంతల సందీశ్వర్, భరత్ అనే ఇద్దరు తమ వెంట తెచ్చుకున్న వేట కొడవళ్లు, కర్రలతో గంతల పృథ్వీరాజ్‌పై దాడి చేసి గాయపరిచినట్లు వివరించారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు గంతల పృథ్వీరాజ్‌ను చికిత్స కోసం షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సిఐ విజయకుమార్ తెలిపారు.

## ఉచిత విద్య అందించాలన్నదే లక్ష్యం


### తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అంగన్‌వాడి స్థాయి నుండి పిజి స్థాయి వరకు ఉచిత విద్యను అంధించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అంగన్‌వాడి కేంద్రాలు సక్రమంగా లేక చిన్నారి విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని వివరించారు. శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడి భవనాల్లోకి ఎలుకలు, పందికొక్కులు వచ్చి చేరుతున్నాయని, విద్యార్థుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని వివరించారు. మాజీ జడ్పిటిసిలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, నేతలు సురేష్‌రెడ్డి, గోపాల్, శ్రావణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలాఉండగా పేద విద్యార్థులు శ్రేయస్సు కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఎస్‌కెపి రెడ్ మిక్స్ ప్లాంట్ నిర్వాహకుడు ఖాజపాషా (ఖాజు) రూ.20లక్షల విరాళం అంధించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొత్తూరు మండలం జహాంగీర్ ఫీర్ దర్గాకు చెంది ఖాజాపాషా (ఖాజు) అనే వ్యాపార వేత్త ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అడిగిన వెంటనే రూ.20లక్షల చెక్కును అంధించారు. కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, రవికుమార్, రాయికల్ శ్రీనివాస్, యాదయ్య, లింగారెడ్డిగూడ అశోక్, కబీర్ పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాల అభివృద్ధియే ఆర్.కృష్ణయ్య పోరాటం

**ప్రజాపక్షం/కొత్తూరు:** సబ్బండవర్గాల అభివృద్ధియే లక్ష్యంగా ఆర్.కృష్ణయ్య పోరాటాలు చేస్తున్నారని, వారికి వెన్నుదున్నుగా ఉంటూ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని బీసీసేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం బీసిల ఆశాజ్యోతి టైగర్ , రాజ్యసభ సభ్యులు, బీసి సంక్షేమ వ్యవస్థాపకులు ఆర్.కృష్ణయ్య జన్మదినం సందర్భంగా షాద్‌నగర్ నుండి బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సదర్ శ్రీనివాస్ మాట్లాడారు. బీసీసేన నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్ర శేఖర్ అప్ప, నేతలు రాజు, అమృతం, శ్రీకాంత్, యాదయ, బందయ్య, విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

# రీల్



## 'సినెటేరియా' వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

'సినెటేరియా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం 2025' వెబ్ సైట్ ను తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. హైదరాబాదు నగరంలో జరగనున్న ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. డిసెంబర్ 20న ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు సినెటేరియా ఫౌండేషన్ పేర్కొంది. నగరంలోని 9 సినిమా మాల్స్ లలో, 9 రోజులపాటు నిర్వహించనున్నామని సినెటేరియా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## 'బ్యూటీ' ట్రైలర్ విడుదల

ఓ మంచి ప్రేమ కథను, అంతకు మించిన కుటుంబ విలువలు, ఫాదర్ డాటర్ రిలేషన్, ఎమోషనల్ కంటెంట్ తో వస్తున్న చిత్రం 'బ్యూటీ'. జీ స్టూడియోస్, మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా 'బ్యూటీ' సినిమాని నిర్మించారు. అలాంటి 'బ్యూటీ' చిత్రం నుంచి ఇప్పటికే వదిలిన గ్లింప్స్, మోషన్ పోస్టర్, పాటలు, టీజర్ ఇలా అన్నీ హైలెట్ అయ్యాయి. సెప్టెంబర్ 19న మూవీని విడుదల చేస్తున్న క్రమంలో తాజాగా ట్రైలర్ విడుదల చేసి అంచనాలు పెంచేశారు. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన ఈ మూవీని విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ నిర్మించారు. ఇక ఈ సినిమాకు 'గీతా సుబ్రమణ్యం', 'హలో వరల్డ్, 'భలే ఉన్నాడే' ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించారు. విడుదల తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా యువ సామ్రాట్ నాగ చైతన్య తాజాగా బ్యూటీ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ట్రైలర్ విడుదల చేసిన అనంతరం చిత్ర యూనిట్ కి ఆల్ ది బెస్ట్ తెలిపారు. నాగ చైతన్య రిలీజ్ చేసిన ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకుల మనసుని హత్తుకుంటుంది. 'ఎప్పుడైనా నేను నిన్ను కొప్పడితే నన్ను అలా వదిలి పెట్టి వెళ్ళకు'.., 'నిన్ను వదిలేసి వెళ్ళడం అంటే.. నా ఊపిరి వదిలేయడమే కన్నా' అంటూ హీరో హీరోయిన్లు చెప్పే డైలాగ్ తో ట్రైలర్ ఓపెన్ చేశారు. స్కూటీ కొనిస్తాను అని తండ్రి మాట ఇవ్వడం, మిడిల్ క్లాస్ ఫాదర్ ఎమోషన్స్, 'క్యాబ్ డ్రైవర్ అయితే క్యాబ్ డ్రైవర్ లా ఉండాలి గానీ కలెక్టర్ లా ప్రామిస్ చేయొద్దు' అనే డైలాగ్ ప్రతీ ఒక్కరిని కదిలించేలా ఉంది. ఈ ట్రైలర్ లోని డైలాగ్స్, హీరో హీరోయిన్ల లవ్ ట్రాక్, ఫాదర్ డాటర్ ఎమోషన్, మిడిల్ క్లాస్ కష్టాలు ఇలా అన్నీ కూడా ఆకట్టుకున్నాయి. ఇక మ్యూజిక్, ఆర్ ఆర్, విజువల్స్ అయితే టాప్ నాచ్ గా ఉన్నాయి. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య, నీలఖి, నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ ప్రసాద్ బెహరా వంటి వారు నటించారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్‌గా శ్రీ సాయి కుమార్ దారా, ఆర్ట్ డైరెక్టర్ గా బేబీ సురేష్ భీమగాని, ఎడిటర్ గా ఎస్‌బి ఉద్ధవ్ పని చేశారు. ఈ సినిమాకు బి.ఎస్.రావు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక సెప్టెంబర్ 19న ఈ మూవీని రిలీజ్ చేయబోతోన్నారు.




## 'లవ్ ఓటిపి'లో విలన్‌గా రాజీవ్ కనకాల

భవప్రీతా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత విజయ్ ఎం రెడ్డి లవ్ ఓటిపి సినిమా నిర్మిస్తున్నారు. ఇందులో రాజీవ్ కనకాల అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సందర్భంగా రాజీవ్ కనకాల మాట్లాడుతూ వరుసగా సినిమాలు, వెబ్ సరీస్లు, షార్ట్ ఫిలిమ్‌లు ఇలా అన్ని ఫార్మాట్స్‌లో నటిస్తూ ఎంజాయ్ చేస్తున్నా. కరెక్ట్‌గా ఇదే సమయంలో 'లవ్ ఓటిపి' అంటూ చిత్ర దర్శకుడు హీరో అనీష్ కొత్త కథతో నా దగ్గరికి వచ్చాడు. ఈ చిత్రంలో నాకు నేనే ఎంతో కొత్తగా కనిపిస్తాను. సినిమాలో నన్ను చంపేస్తే మాత్రం నిన్ను చంపేస్తా అంటూ సరదాగా చేసిన ప్రమోషనల్ వీడియోతో మా సినిమా టైటిల్ 'లవ్ ఓటిపి' మీ ముందుకు వస్తుంది అని అన్నారు. అనీష్, స్వరూపిణి, జాన్విక, రాజీవ్ కనకాల, ప్రమోదిని, కాలకేరి, నాట్యరంగ, తులసి, అన్నపూర్ణ, చేతన్ గంధర్వ, రవి భట్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి సంగీతం ఆనంద్ రాజా విక్రమ్, డిఒపి హర్ష, ఎడిటర్ శరత్, ఫైట్స్ విక్రమ్ మోర్, డాన్స్ బాబా భాస్కర్, నిర్మాత– విజయ్ ఎం.రెడ్డి, రచన–దర్శకత్వం– అనీష్.



## 'కిష్కింధపురి'కి అద్భుతమైన రెస్పాన్స్



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లేటెస్ట్ థ్రిల్లింగ్ బ్లాక్ బస్టర్ 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రాన్ని కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. అద్భుతమైన ప్రిమియర్స్ తో మొదలైన ఈ చిత్రం సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని హౌస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ లో నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది చాలా హ్యాపీ మూమెంట్. మూడు ప్రీమియర్ షోలు వేద్దామనుకుని మొదలైన మా సినిమా 66 షోలు పడ్డాయి. ఆర్గానిక్ గా మా సినిమా ఆడియన్స్ కి రీచ్ అయింది. ఆడియన్స్ ఇచ్చిన ప్రేమ ఆదరణ అంత ఇంతా కాదు. 1400 మంది క్రౌడ్‌తో సినిమా చూశాను. రెస్పాన్స్ మామూలుగా లేదు.నిర్మాత సాహు గారపాటి, డైరెక్టర్ కౌశిక్, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ పాల్గొన్నారు.

## మిరాయ్ సక్సెస్ మీట్



హనుమాన్ హీరో తేజ సజ్జ, రితిక నాయక్ జంటగా నటించిన మిరాయ్ సినిమా ఇటీవల విడుదలై థియేటర్లలో నడుస్తున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్ లో సక్సెస్ మీట్ నిర్వహించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సందర్భంగా హీరో తేజ సజ్జ మాట్లాడుతూ తన కెరీర్లో ఇది మరో సంతకరమైన సినిమా అని అన్నారు. ఈ సినిమా సక్సెస్ అయిందంటే ముందుగా సంతోషపడేదినేనే అని అన్నారు. ఎందుకంటే ఈ సినిమా కోసం అంత కష్ట పడ్డానని చెప్పారు. దర్శకుడు కార్తీక్ ప్రతి సన్నివేశాన్ని ఎంతో చక్కగా తీర్చిదిద్దారని అన్నారు. ఈ సినిమా సక్సెస్ వెనుకాల పనిచేసిన ప్రతి ఒక్కరికి క్రెడిట్ దక్కుతుందని చెప్పారు. విలన్ గా నటించిన మంచు మనోజ్ మాట్లాడుతూ ఈ సినిమా తన కెరీర్ లో ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ప్రతి సన్నివేశం ఎంతో అద్భుతంగా ఉంటుందని అన్నారు. విడుదలైన అన్ని థియేటర్లలో హౌస్ ఫుల్ అవుతోందని, థియేటర్లలో ప్రేక్షకులను చూస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమా ద్వారా తనకు కూడా మంచి పేరు వచ్చిందని చెప్పారు. చాలా రోజుల తరువాత హ్యాపినెస్ మామూలుగా లేదని మనోజ్ పేర్కొన్నారు. హీరోయిన్ రితిక నాయక్ మాట్లాడుతూ ఈ సినిమాలో నటించడం గర్వపడుతున్నానని అన్నారు. సినిమా హిట్ అయినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇన్ని రోజుల కష్టం స్క్రీన్ పై కనిపిస్తోందని చెప్పారు. తప్పకుండ ఈ సినిమా మరింత పెద్ద హిట్ అవుతుందని పేర్కొన్నారు. నిర్మాత టివి విశ్వ ప్రసాద్ తో పాటు ఈ సినిమాకు పని చేసిన సాంకేతిక నిపుణులు కూడా మాట్లాడారు.

## 'ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు' ప్రీ రిలీజ్ ఈవెంట్

రాజాకృష్ణ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు'. తెలుగులోనే కాదు ప్రపంచ సినిమా చరిత్రలోనే ఎవరు చేయని విధంగా ఒకే షాట్లో సినిమా మొత్తాన్ని తెరకెక్కించి అందరిని ఆశ్చర్యశకితులను చేశాడు డైరెక్టర్, హీరో సూపర్ రాజా. సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో సూపర్ రాజా మాట్లాడుతూ క్రియేటివిటీనే బ్యాగ్రౌండ్ కసినే బలం ఈ రెండు ఆయుధాలతో సినిమా పరిశ్రమలో అద్భుతాలు చేయొచ్చు అంటున్నారు. ఒక మనిషి ఏం చేయగలడో సెప్టెంబర్ 19న థియేటర్లో చూస్తారు అన్నారు. సినిమా ఇంత అద్భుతంగా రావడానికి కారణం తన పేరెంట్స్ అని చెప్పారు. అలాగే ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిందని తెలిపారు. ఎన్నో రోజులు చీకట్లో ఉండి వెలుగు కోసం ప్రయత్నం చేశాను. ఈ ప్రయత్నం ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపుతుందని చెప్పారు. తనను నమ్మి డబ్బులు పెట్టిన తన పేరెంట్స్ అండ అన్నయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆయను నమ్మి నటించిన నటీనటులకు, డిస్ట్రిబ్యూట్ చేస్తున్న మైత్రీ వాళ్లకు, థ్యాంక్స్ చెప్పారు. ఈ సినిమాలో నటించడం చాలా స్పెషల్ ఫీల్ అవుతున్నట్లు హీరోయిన్ చందన పాలంకి తెలిపారు. మొదట సినిమా గురించి చెప్పినప్పుడు ఒకే షాట్ లో ఎలా తీస్తారు అనే భయం ఉండేది కానీ తరువాత సూపర్ రాజా కాన్ఫిడెన్స్ చూసిన తరువాత ఆ భయం పోయిందని అన్నారు. 1400 డైలాగ్స్ 100 మినట్స్ చెప్పడం అంటే మాములు విషయం కాదు. దాని కోసం చాలా కష్టపడ్డామన్నారు. దాదాపు రెండు సంవత్సరాలు సినిమా కోసం కష్టపడ్డామని వంశీ చెప్పారు. సినిమా కోసం వందల సార్లు ప్రాక్టీస్ చేశామన్నారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశీధర్ తదితరులు పాల్గొన్నారు . సూపర్ రాజా, వంశీ గోనె, చందన పాలంకి, రమ్య ప్రియ, తదితరులు నటించారు. ఈ చిత్రానికి సిద్దార్థ్ శివదాసని, సబు వర్గీస్ సంగీతం అందించారు.



## తమిళనాడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా వీరపాండియన్


### ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందన

**చెన్నై:** సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా ఎం. వీరపాండియన్ ఎన్నికయ్యారు. ఇప్పటివరకూ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఆర్.ముత్తురాసన్ శనివారం ఈ విషయం చెప్పారు. వీరపాండియన్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కూడా పనిచేశారు. చెన్నైలో జరిగిన సిపిఐ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. దాదాపు పది సంవత్సరాలు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ముత్తరాసన్ ఆ బాధ్యతల నుండి వైదొలగుతున్నారు. వీరపాండియన్ పేరును కార్యదర్శి పదవికి పార్టీ సీనియర్ నాయకులు ప్రతిపాదించారు. రైతులు, కార్మికులకోసం జరిగిన అనేక పోరాటా లో వీరపాండియన్ కీలకపాత్ర పోషించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా వీరపాండియన్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, అణగారిన వర్గాలకు చెందిన ప్రజలకోసం పోరాటాలు చేస్తున్న వామపక్ష రాజకీయాలతో మనం కలిసి ముందుకు ప్రయాణిద్దాం, విజయం సాధి ద్దాం అని పేర్కొన్నారు. అదేవిధంగా సిపిఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షన్ముగమ్ కూడా వీరపాండియన్‌కు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో పేదలు, అణగారిన వర్గాల ప్రజలను సంరక్షించేందుకు, వామపక్షాల ఐక్యతను బలోపేతం చేయడంలో ఉమ్మడి కృషి చేద్దామని షన్ముగమ్ పిలుపు ఇచ్చారు.




## తెలంగాణ అంతర్జాతీయ విత్తన పరీక్ష కేంద్రం ఆఫ్రికా ప్రతినిధుల బృందం సందర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ అంతర్జాతీయ విత్తన పరీక్ష కేంద్రాన్ని శనివారం ఆఫ్రికా ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈనెల11 నుంచి13వ తేదీవరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియా ఆఫ్రికా సీడ్ సమ్మిట్‌లో భాగంగా ఆఫ్రికా సీడ్ ట్రేడ్ అసోసియేషన్ (ఎఎఫ్ఎస్‌టిఎ), సెక్రటరీ జనరల్, యాకబో దయాలోతో పాటు 10 మంది విత్తన రంగ ప్రముఖులు తెలంగాణ అంతర్జాతీయ విత్తన పరీక్ష కేంద్రం ( టిఐఎస్‌టిఎ )ను సందర్శించారు. ఈ సందర్భంగా విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు, ఇతర అధికారులు టిఐఎస్‌టిఎలో ఉన్న అధునాతన విత్తన పరీక్ష పరికరాలు, యంత్రాలు, విత్తన పరీక్ష పద్ధతులను ఆఫ్రికా ప్రతినిధి బృందానికి వివరించారు. ఈ సందర్భంగా యాకబో దయాలో మాట్లాడుతూ విత్తన ఎగుమతులకు కావాల్సిన అధునాతన సౌకర్యాలను తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ ఐఎస్‌టిఎ విత్తన పరీక్ష ల్యాబ్‌లో ఏర్పాటు చేసుకోవటం గొప్ప విషయమని ప్రశంసించారు. ఆఫ్రికా దేశాలలో కూడా ఇలాంటి విత్తన పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.



ఇండోఆఫ్రికా సమ్మిట్‌లో తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ (టిఎస్‌సిఎ) విత్తన పరీక్షధ్రువీకరణ ఎక్సలెన్సీ అవార్డును గెలుచుకుంది. భారత ఆహార వ్యవసాయ కౌన్సిల్ (ఐసిఎఫ్ఎ) ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా విత్తన రంగంలో విశేష సేవలందించిన సంస్థలకు ఈ అవార్డును అందజేశారు. అందులో భాగంగా తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు అవార్డు అందుకున్నారు. గ్లోబల్ సీడ్ హబ్‌గా ఎదుగుతున్న తెలంగాణకు ఇది గర్వకారణమని డైరెక్టర్ డాక్టర్ కేశవులు తెలిపారు.తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ దేశంలోనే మొదటిసారిగా ఆన్‌లైన్ విత్తన ధ్రువీకరణ, సీడ్ ట్రేసబిలిటీ విధానాలను ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు తెలిపారు. అంతర్జాతీయ విత్తన పరీక్ష సంస్థ (ఇస్టా) గుర్తింపు పొందిన తెలంగాణ ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తన ఎగుమతులకు మార్గం సుగమం చేసిందని వివరించారు. రైతులు, ఉత్పత్తిదారులకు శిక్షణ ఇస్తూ రాష్ట్ర విత్తన రంగానికి గణనీయమైన సహకారం అందిస్తోందని తెలిపారు. సంవత్సరానికి సుమారు 22 లక్షల క్వింటా ళ్ల విత్తనాలను ఉత్పత్తి చేస్తూ తెలంగాణతో పాటు మరో 10 రాష్ట్రాలకు ధ్రువీకరించిన విత్తనాలను స రఫరా చేస్తోందన్నారు. తెలంగాణలో విత్తనోత్పత్తికి అనుకూల వాతావరణం ఉండటంతో 500కు పైగా విత్తన కంపెనీలు, 3.5 లక్షల మంది రైతులు ఉత్ప త్తి చేస్తున్నారని, వారి నుంచి దాదాపు 90 లక్షల క్వింటాళ్ల విత్తనాలు ఉత్పత్తి అవుతుండగా 3 లక్షల మందికి ఉపాధిలభిస్తోందని కేశవులు తెలిపారు.




## 16న హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ బాండెడ్ లేబర్ సమస్యలపై మీడియా వర్క్‌షాప్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ మీడియా అకాడమీ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజెఎం) సంయుక్తంగా ఈనెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్ అంశాలపై ప్రత్యేక మీడియా వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. ఈ అంశాలపై మీడియా ప్రతినిధులకు అవగాహన పెంపొందించేలా, ఈ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవడం, బాధితుల పట్ల ప్రదర్శించే వైఖరి లక్ష్యంతో ఈ కార్యక్రమాన్నిఏర్పాటు చేస్తున్నారు. ఈ వర్క్‌షాప్‌లో హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ బాండెడ్ లేబర్ బాధితుల పునరావాసం, న్యాయపరమైన, సమాజపరమైన మద్దతు అంశాలపై నిపుణులు ప్రసంగించనున్నారు. అలాగే, మీడియా పాత్ర, బాధితుల గౌరవాన్ని కాపాడుతూ సమగ్ర కథనాలను రూపొందించడంలాంటి అంశాలపై ప్రత్యేక చర్చలు నిర్వహించడంతోపాటు సివిల్ సొసైటీ ప్రతినిధులు, న్యాయ నిపుణులు, అనుభవజ్ఞులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు.జర్నలిస్టులు, ఎడిటోరియల్ టీంలకు అత్యంత ఉపయోగకరంగా ఉండనుంది.తెలంగాణ మీడియా అకాడమీ ఈ సమస్యపై జర్నలిజానికి అవసరమైన అవగాహనను పెంచే లక్ష్యంతో నిర్వహించనున్నఈ వర్క్‌షాప్‌లో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు ఈనెల15వ తేదీ మధ్యాహ్నం 100 గంట లోపు తమ పేరు, సంస్థ పేరు, హోదా, పని చేస్తున్న ప్రదేశంతోపాటు తమ మొబైల్ నెంబర్‌ను ఈ కార్యాలయ మేనేజర్ సెల్ నెంబర్ 7093600977కు వాట్సాప్ ద్వారా రిజిష్టర్ చేసుకోవాల్సిందిగా కోరారు. ముందుగా నమోదు చేసుకున్న మొదటి 70 మంది జర్నలిస్టులకు మాత్రమే ఈ వర్క్ షాప్‌లో పాల్గొనుటకు అనుమతి ఉంటుందని మీడియా అకాడమీ వెల్లడించింది.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com